

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం

# వ్యవసాయం

ఆగస్టు, 2020

సంపుటి - 6 సంచిక-8 పేజీలు- 52 వెల : ₹ 20/-







పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్ రాష్ట్రీయ కృషి విజ్ఞాన్ ప్రోత్సాహన్ పురస్కార్ అవార్డును పొందిన కృషి విజ్ఞాన కేంద్రం, వైరా



# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక





వ్యవసాయ పాలిటెక్నిక్, సంగుపేట బాలికల నూతన వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న గౌ॥ రాష్ట్ర ఆర్థిక శాఖామాత్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు, గౌ॥ తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘ వైస్ ఛైర్మన్ శ్రీ బి. వినోద్ కుమార్ మరియు వర్సిటీ రిజిస్ట్రార్ డా॥ ఎస్. సుధీర్ కుమార్





వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న గౌ॥ రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, గౌ॥ రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు శ్రీ గంగుల కమలాకర్ మరియు వర్సిటీ ఉన్నతాధికారులు





తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో మొక్కలను నాటి నీరు పోస్తున్న తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ టి. పాపిరెడ్డి మరియు విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ వి. ప్రవీణ్ రావు

# వ్యవసాయం

సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

ఆగష్టు, 2020

శ్రీ శార్వరి నామ సం॥ శ్రావణ శుద్ధ త్రయోదశి నుండి బాద్రపద శుద్ధ త్రయోదశి వరకు


## సంపాదక వర్గం




ప్రధాన సంపాదకులు

డా॥ చల్లా వేణు గోపాల రెడ్డి

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు

డా॥ జి. శ్రీనివాస్

ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ (అగ్రానమి)

డా॥ యన్. రామగోపాల వర్మ

ప్రధాన శాస్త్రవేత్త (ఎంటమాలజి)

పర్యవేక్షణ

డా॥ కాలిశెట్టి వాణిశ్రీ

శాస్త్రవేత్త



వ్యవసాయ మాసపత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు. డి.డి. అయితే **Principal Agril. Information Officer, AI&CC & PJTSAU Press** పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి.



చిరునామా :

ప్రిన్సిపల్ అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్

వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం

ఏ.ఆర్.ఐ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.

తెలంగాణ రాష్ట్రం, ఫోన్ నెం. 040-24015380

e-mail : pjtsau.paio@gmail.com

vyavasayam.pjtsau@gmail.com


పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.

## విషయ సూచిక


1. ఉపకులపతి సందేశం........................................5
2. ఈ మాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు..............6
3. వాతావరణం - పంటల పరిస్థితి - విశ్లేషణ................ 14
4. సాంకేతిక వ్యాసాలు
   - మిషన్‌తో వరినాట్లు వేసిన పొలాల్లో అధిక దిగుబడికి సూచనలు................................................ 15
   - వరిలో సమర్ధవంతంగా సాగునీటి యాజమాన్యం...... 16
   - వానాకాలం వరిలో కలుపు నివారణ.................... 18
   - వానాకాలం వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు యాజమాన్యం............................................ 19
   - సోయాచిక్కుడును ఆశించు చీడపీడలు-యాజమాన్యం.. 20
   - ప్రత్తి పంట తొలిదశలో ఆశించే రసం పీల్చే పురుగులు - యాజమాన్యం............................................ 23
   - పోషకాల ఆధారిత ఎరువుల యాజమాన్యం.............25
   - జోనల్ స్థాయిలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ రాష్ట్రీయ కృషి విజ్ఞాన్ ప్రోత్సాహన్ పురస్కార్ అవార్డును పొందిన కృషి విజ్ఞాన కేంద్రం, వైరా.....................26
   - ప్రత్తిని ఆశించు తెగుళ్ళు-యాజమాన్యం................ 28
   - వ్యవసాయ రంగంలో హోమియోపతి మందుల ద్వారా తెగుళ్ళ నివారణ.................................... 32
   - ఆగష్టు మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు........................................ 34
   - శ్రీగంధం సాగు............................................36
   - చామంతి సాగు - మేలైన యాజమాన్య పద్ధతులు...... 37
   - తీగ జాతి కూరగాయలలో బంక తెగులు - యాజమాన్యం........................................ 39
   - వ్యవసాయ పదవినోదం.................................41
   - ఇనుము ధాతువును ఇంట్లోనే పెంచుకోండి ఇలా........ 42
   - నాణ్యమైన చేప పిల్లల ఎంపికలో మెళకువలు........... 44
5. టి.వి. చానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు............................................ 46
6. రైతన్నకో ప్రశ్న..............................................47
7. విశ్వవిద్యాలయ వార్తలు......................................48
8. రైతు విజయగాథ
   - సేంద్రియ శ్రేష్ఠం - మన అంజిరెడ్డి ...................... 49

# ఆగష్టు మాసం క్యాలెండర్ - 2020

## శ్రీ శార్వరి నామ సం॥ శ్రావణ శుద్ధ త్రయోదశి నుండి భాద్రపద శుద్ధ త్రయోదశి వరకు

| SUN<br>ఆది<br>రాహుకాలం<br>సా. 4.30-6.00 | MON<br>సోమ<br>రాహుకాలం<br>సా. 4.30-6.00 | TUE<br>మంగళ<br>రాహుకాలం<br>మ. 3.00-4.30 | WED<br>బుధ<br>రాహుకాలం<br>మ, 12,00-1.30 | THU<br>గురు<br>రాహుకాలం<br>మ. 1.30-3.00 | FRI<br>శుక్ర<br>రాహుకాలం<br>ఉ. 10.30-12.00 | SAT<br>శని<br>రాహుకాలం<br>ఉ. 9.00-10.30 |
|---|---|---|---|---|---|---|
| **30** ద్వాదశి ఉ.9-05, ఉత్తరాషాఢ ప.3-32, రా.వ.7-35 ల 9-12 | **31** త్రయోదశి ఉ.8-35, శ్రవణం ప.3-53, రా.వ.8-03 ల 9-43 | | | | | **1** శ్రావణ శు.త్రయోదశి రా.9-48, మూల ఉ.7-48, ఉ.వ.6-15 ల 7-48, సా.వ.5-15 ల 6-50 |
| **2** చతుర్దశి రా.9-03, పూర్వాషాఢ ఉ.7-27, ప.వ.3-32 ల 5-10 | **3** పూర్ణిమ రా.8-46, ఉత్తరాషాఢ ఉ.7-45, ప.వ.11-49 ల 1-27 | **4** బ.పాడ్యమి రా.8-52, శ్రవణం ఉ.8-15, ప.వ.12-26 ల 2-06 | **5** విదియ రా.9-34, ధనిష్ఠ ఉ.9-24, సా.వ.5-04 ల 6-47 | **6** తదియ రా.10-43, శతభిషం ఉ.11-01, సా.వ.5-57 ల 7-41 | **7** చవితి రా.12-17, పూర్వాభాద్ర ప.1-04, రా.వ.11-40 ల 1-26 | **8** పంచమి రా.2-05, ఉత్తరాభాద్ర ప.3-26, తె.వ.4-48 ల |
| **9** షష్ఠి తె.4-11, రేవతి సా.6-01, ఉ.శే.వ.6-34వ | **10** సప్తమి పూర్తి, అశ్విని రా.8-36, సా.వ.4-10 ల 5-56 | **11** సప్తమి ఉ.6-10, భరణి రా.11-05, ఉ.వ.7-11 ల 8-57 | **12** అష్టమి ఉ.7-58, కృత్తిక రా.1-16, ప.వ.12-10 ల 1-55 | **13** నవమి ఉ.9-25, రోహిణి తె.3-05, సా.వ.6-28 ల 8-11 | **14** దశమి ఉ.10-29, మృగశిర తె.4-27, ఉ.వ.8-59 ల 10-41 | **15** ఏకాదశి ఉ.11-01, ఆర్ద్ర తె.5-18, ప.వ.1-08 ల 2-48 |
| **16** ద్వాదశి ఉ.11-03, పునర్వసు తె.5-41, సా.వ.5-30 ల 7-07 | **17** త్రయోదశి ఉ.10-37, పుష్యమి తె.5-34, ప.వ.1-38 ల 3-14 | **18** చతుర్దశి ఉ.9-42, ఆశ్రేష తె.5-02, సా.వ.6-04 ల 7-38 | **19** అమావాస్య ఉ.8-22, మఘ తె.4-08, సా.వ.4-34 ల 6-07 | **20** భాద్రపద శు.పాడ్యమి ఉ.6-39, విదియ తె.4-35, పుబ్బ రా.2-56, ఉ.వ.11-43 ల 1-15 | **21** తదియ రా.2-22, ఉత్తర రా.1-31, ఉ.వ.9-42 ల 11-12 | **22** చవితి రా.12-01, హస్త రా.11-57, ఉ.వ.9-22 ల 10-51 |
| **23** పంచమి రా.9-32, చిత్ర రా.10-15, ఉ.వ.7-23 ల 8-52, తె.వ.3-27 ల 4-57 | **24** షష్ఠి రా.7-04, స్వాతి రా.8-35, రా.వ.1-49 ల 3-19 | **25** సప్తమి సా.4-47, విశాఖ రా.7-05, రా.వ.10-51 ల 12-21 | **26** అష్టమి ప.2-35, అనూరాధ సా.5-42, రా.వ.11-02 ల 12-33 | **27** నవమి ప.12-39, జ్యేష్ఠ సా.4-35, రా.వ.12-18 ల 1-51 | **28** దశమి ఉ.10-59, మూల ప.3-46, ప.వ.2-14 ల 3-46, రా.వ.1-11 ల 2-46 | **29** ఏకాదశి ఉ.9-45, పూర్వాషాఢ ప.3-21, రా.వ.11-24 ల 1-01 |

03 శ్రావణ పూర్ణిమ / రాఖీ పూర్ణిమ 09 ఈద్-ఇ-ఘదీర్ 16 పార్సీ న్యూ ఇయర్ 29 9వ మొహరం

01 ఈద్-ఉల్-అజహా (బక్రీద్), 11 శ్రీ కృష్ణాష్టమి 15 స్వాతంత్ర్యదినోత్సవం 22 వినాయక చతుర్థి 30 షహదత్ ఇమామ్ హుస్సేన్ 10వ మొహరం

**ఆశ్లేషా కార్తె (3.08.19 నుండి 16.08.19)**

జొన్న : అంతరకృషి, రెండవ దఫా ఎరువులు వేయుట, సస్యరక్షణ

సజ్జ : అంతరకృషి, సస్యరక్షణ

వేరుశనగ : సస్యరక్షణ

ఆముదం : రసాయనిక ఎరువులు వేయుట, అంతరకృషి, సస్యరక్షణ

వరి : అంతరకృషి, సస్యరక్షణ, స్వల్పకాలిక రకాల నాట్లు పూర్తి చేయుట లేదా నేరుగా విత్తుట

మొక్కజొన్న : రసాయనిక ఎరువులు వేయుట

కొర్ర : ఆలస్యంగా వర్షాలు పడినచో వెంటనే విత్తనం వేయుట

కాయధాన్యాలు: తక్కువ పంట కాలపు పెసర, మినుము కోతలు, కంది పంటకు కలుపు తీయుట

ప్రత్తి : అంతరకృషి, రసాయనిక ఎరువులు వేయుట

**మఘ కార్తె (17.08.19 నుండి 30.08.19)**

జొన్న : మాఘీ జొన్నకు నేల తయారి

సజ్జ : సస్యరక్షణ

కొర్ర : రసాయనిక ఎరువులు వేసి అంతరకృషి చేయుట

ఆముదం : అంతరకృషి, సస్యరక్షణ

వరి : సస్యరక్షణ, కలుపు తీయుట, రెండవ దఫా ఎరువులు వేయుట

కాయధాన్యాలు: తక్కువ పంట కాలపు మినుము కోయడం

వేరుశనగ : సస్యరక్షణ

ప్రత్తి : సస్యరక్షణ

# డిజిటల్ వ్యవసాయం-నూతన సాంకేతికతకు శ్రీకారం



డా॥ వి. ప్రవీణ్ రావు
ఉపకులపతి

ప్రపంచ వ్యాప్తంగా గత కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయ రంగంలో డిజిటల్ సాంకేతికత బహుళ ప్రాచుర్యం పొందుచున్నది. దీనిలో భాగంగా మనదేశం కూడా ఇప్పుడిప్పుడే “డిజిటల్ వ్యవసాయం” వైపు నడకనారంభించింది. ఈ తరహా వ్యవసాయం ద్వారా అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగించుకొని అభివృద్ధి సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

డిజిటల్ వ్యవసాయం ఇంటర్నెట్ ఆధారిత వ్యవసాయం. ఈ వ్యవసాయ విధానంలో రిమోట్ సెన్సింగ్, కృత్రిమ మేధస్సు, క్లౌడ్ మెషిన్ లెర్నింగ్, శాటిలైట్ ఛాయాచిత్రాలు, జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ పరికరాలతో సమాచారంను సంకలనం చేసి విశ్లేషణ చేయడం, అడ్వాన్స్డ్ అనలైటిక్స్ మొదలగునవి వాడటం వలన ఖచ్చితత్వం పెరుగుతుంది. డిజిటల్ వ్యవసాయ విధానంలో పెద్ద రైతులతో పాటు చిన్న, సన్నకారు రైతులకు కూడా సమానలాభం ఒనగూరుతుంది. కృత్రిమ మేధస్సును ఉపయోగించి ఖచ్చితమైన విత్తే సమయాన్ని గుర్తించి, పాటించటం వలన సుమారు 30% వరకు అధిక దిగుబడులను సాధించవచ్చును. పురుగుల ఉధృతిని ముందుగా అంచనా వేయటం వలన సమర్ధ యాజమాన్య చర్యలను సరైన సమయంలో తీసుకునే అవకాశముంటుంది. అంతేగాకుండా కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధానంలో మూడు నెలల ముందుగానే కనీస మద్ధతు ధరలు నిర్ణయించటం ద్వారా రైతులకు చాలా ప్రయోజనం చేకూరుతున్నది.

మనదేశంలోని ఔత్సాహిక యువత వివిధ యాప్‌లను తయారుచేసి వ్యవసాయ రంగ ముఖ చిత్రం మార్చడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్రిశాట్ మరియు మైక్రోసాఫ్ట్ సమిష్టి సహకారంతో “కృత్రిమ మేధస్సుతో విత్తటం” యాప్‌ను తయారు చేసి ప్రయోగాత్మకంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో పరీక్షించి సఫలీకృతమైనాయి. ఈ యాప్ ద్వారా 30 సంవత్సరాల సమాచారాన్ని కృత్రిమ మేధస్సుతో క్రోడీకరించి విత్తే సమయం, తేమ సమర్ధత సూచిక, ఎరువుల వాడకం మొదలగు విషయాలలో వారం ముందుగా రైతాంగానికి సూచనలివ్వటం ద్వారా వారు పంటలలో మంచి దిగుబడులు సాధించారు. “భారత్ అగ్రియాప్”ను ఇద్దరు ఔత్సాహిక యువ ఇంజనీర్లు తయారు చేసి వ్యవసాయ రంగంలో అద్భుతాలు సృష్టించారు. ఈ యాప్ ద్వారా మొక్కల ఎదుగుదలపై ప్రభావం చూపే 30కి పైగా అంశాలపై సమగ్ర అధ్యయనం చేసి రైతులకు సమాచారాన్ని అందించటం ద్వారా దిగుబడిలో 60% వృద్ధిని, పంట ఖర్చులో సుమారు 20% వరకు తగ్గుదలను సాధించారు. అంతేగాకుండా వివిధ వాటాదారులైన రైతులు, బ్యాంకర్లు ఎగుమతిదారులు, మార్కెటింగ్ కంపెనీలు, విత్తన ఉత్పత్తిదారులు మొదలగువారందరిని విలువాధారిత చెయిన్‌లో భాగస్వాములను చేయటం ద్వారా అందరికి ప్రయోజనకారిగా ఉంది.

మన కేంద్ర ప్రభుత్వం డిజిటల్ పరివర్తనలో భాగంగా “జాతీయ ఎలక్ట్రానిక్ వ్యవసాయ మార్కెట్‌ను” ఏర్పాటు చేసి రైతులు తమ ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అమ్ముకునేందుకు వీలు కల్పించింది. దీని ద్వారా వివిధ వర్తకుల మధ్య పోటీ ఏర్పడటంతో రైతులకు ఎక్కువ ఆదాయం కూడా లభించే అవకాశముంది.

డిజిటల్ విధానంలో భాగంగా మన విశ్వవిద్యాలయం వాయిస్ మెసేజ్ ఆధారిత వ్యవసాయ సలహాలు, మొబైల్ ద్వారా వాతావరణ సూచనలు, వ్యవసాయం కోసం యూట్యూబ్ ఛానల్, అన్నపూర్ణ కృషి ప్రసార సేవ, వాట్సప్ గ్రూపుల వంటి వినూత్న సేవలను రైతులకు ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. అంతేకాకుండా రాష్ట్ర రైతాంగం కోసం “గ్యాన్ కిసాన్ యాప్‌ను” రూపొందించి అందుబాటులోకి తేవటానికి అహర్నిశలు ప్రయత్నిస్తున్నది. అతి త్వరలో ఈ యాప్‌ను రైతులందరికి ఉచితంగా అందుబాటులోకి తీసుకువస్తామని తెలియజేయటానికి సంతోషిస్తున్నాను.

మన రైతాంగం డిజిటల్ వ్యవసాయంపై అవగాహన పెంచుకొని నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంభించి పంటలలో అధిక దిగుబడులు సాధిస్తారని ఆశిస్తూ...

ఉపకులపతి



# వరి

జూన్ - జూలై మాసాల్లో చాలా జిల్లాల్లో సాధారణ వర్షపాతం మరియు కొన్ని జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. రైతులు బోరుబావులు, నీటి వసతి ఉన్న చోట్ల వరినార్లు పోశారు. అలాగే ఆయకట్టు ప్రాంతాల్లో వర్షాలను నమ్ముకొని నార్లు పోశారు. ఇంకా ఎక్కడైనా నార్లు పోసుకోకపోతే ఆగష్టు మాసంలో వెదజల్లే లేదా డ్రమ్ సీడర్ పద్ధతిలో విత్తుకోవడం మంచిది. నాటు యంత్రాలు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ట్రే పద్ధతిలో లేదా పాలిథీన్ షీట్‌పై నారు పోసుకొని, నారు విత్తిన 17-20 రోజులలోపు నాట్లు వేసుకోవాలి.

- సాగర్ ఆయకట్టు జిల్లాల్లో (ఉమ్మడి ఖమ్మం మరియు నల్గొండ) వరినాట్లు ఆలస్యమయ్యేటప్పుడు ప్రత్యామ్నాయంగా స్వల్ప కాలిక వరి రకాల నార్లు అందుబాటులో ఉంటే సెప్టెంబర్ మొదటి వారంలోపు నాట్లు పూర్తి చేయాలి.
- రైతులు ముదురు నారు నాటు వేయాల్సిన అవసరం వస్తే మొక్కల మధ్య దూరం తగ్గించి దగ్గర దగ్గరగా నాట్లు వేసుకొంటే దిగుబడి తగ్గకుండా ఉంటుంది.
- నారుమడిలో ఊద, ఒడిపిలి వంటి కలుపు మొక్కలు ఉన్నట్లయితే విత్తిన 15-20 రోజులకు సైహలోఫాప్ - పి - బ్యుటైల్ 1.5 మి.లీ. లేదా బిస్‌పైరిబాక్ సోడియం 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- నాటడానికి వారం రోజుల ముందు ప్రతి 2 గుంటల నారుమడికి 800 గ్రా॥ కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు వేసుకొని కాండం తొలిచే పురుగు మరియు ఉల్లికోడును నివారించుకోవాలి.
- ప్రధాన పొలాన్ని 10-12 రోజులు బాగా మురగనిచ్చి దమ్ము చేయాలి. ఆఖరి దమ్ములో ఎకరానికి 16 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరము మరియు 8 కిలోల పొటాష్ నిచ్చు ఎరువులు (అనగా 50 కిలోల డి.ఎ.పి., 15 కిలోల యూరియా మరియు 14 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) వేసుకోవాలి.
- నత్రజని ఎరువును 3-4 దఫాలుగా వేయాలి. దమ్ములోను, పంట బాగా దుబ్బు చేసే దశలో (30-35 కిలోల యూరియా) మరియు అంకురం తొడిగే దశలోను (30-35 కిలోలు) బురద పదునులో వెదజల్లి 36 - 48 గంటల తర్వాత పలుచగా నీరు పెట్టాలి.
- మొత్తం భాస్వరం ఎరువును దమ్ములోనే వేయాలి. పొటాష్ ఎరువును రేగడి నేలల్లో ఆఖరి దమ్ములో పూర్తిగా ఒకేసారి వేయాలి. తేలిక భూముల్లో ఆఖరి దమ్ములో సగం (14 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్), అంకురం ఏర్పడే దశలో (14 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) మిగతా సగాన్ని వేయాలి.
- ప్రధాన పొలంలో కలుపు మొక్కల నివారణకు ఎకరానికి 4 కిలోల బెన్‌సల్ఫ్యూరాన్ మిథైల్ 0.6% జి.ఆర్. + ప్రెటిలాక్లోర్ 6% జి.ఆర్. గుళికలను నాటిన 3-5 రోజుల లోపు 20 కిలోల ఇసుకలో కలిపి చల్లాలి.
- డ్రమ్ సీడర్ లేదా నేరుగా వెదజల్లే పద్ధతిలో సాగు చేసే రైతులు ఎకరానికి ప్రెటిలాక్లోర్ + సేఫ్‌నర్ మందును 600-800 మి.లీ. 3-5 రోజుల లోపు ఇసుకలో కలిపి చల్లాలి.
- ప్రధాన పొలంలో నాటిన తొలిదశలో చౌడు, నాచు మరియు మురుగు నీరు నిల్వ ఉండటం వలన మొక్కల వేర్లు నల్లబడి చనిపోతాయి. నివారణకు పొలాన్ని వెంట్రుక వాసి పగుళ్ళు వచ్చే వరకు ఆరగట్టాలి. తర్వాత నీరుపెట్టి 25 - 30 కిలోల యూరియాకు 50-60 గ్రా. కార్బెండాజిమ్ 25% + మ్యాంకోజెబ్ 50% మిశ్రమాన్ని కలిపి పొలమంతా సమానంగా 20-22 రోజుల దశలో చల్లాలి. పొలాన్ని చేతితో కలియబెట్టాలి.
- ముందుగా వేసిన దీర్ఘకాలిక సన్నగింజ రకాల్లో బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆగష్టు మాసంలో ఆశించే అవకాశం ఉంది. ఈ తెగులు లక్షణాలు గమనించినట్లయితే నత్రజని ఎరువును వేయటం తాత్కాలికంగా ఆపాలి. తొలిదశలో వ్యాప్తిని నివారించడానికి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. + ప్లాంటామైసిన్ లేదా పోషామైసిన్ లేదా అగ్రిమైసిన్ 0.4 గ్రా॥ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. తెగులు నివారణకు మందులు లేవు కాని తొలిదశలో వ్యాప్తిని నివారించవచ్చు.
- అలాగే ఆగష్టు మాసంలో ముందుగా వేసిన దీర్ఘకాలిక రకాల్లో సుడిదోమ కూడా ఆశించే అవకాశం ఉంది. కావున దోమ



ఉధృతి ఎప్పటికప్పుడు పొలంలో గమనించాలి. పొలంలో నీరు తగ్గించి అడపాదడపా ఆరబెట్టాలి. నత్రజని ఎరువును దపా దఫాలుగా వేయాలి. 1.5 గ్రా. ఎసిఫేట్ లేదా 0.4 గ్రా. డైనోటెఫ్యురాన్ లేదా 0.6 గ్రా. పైమెట్రోజైన్ లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ళ మీద పడేటట్లు పిచికారి చేయాలి.

డా॥ యం. వెంకట రమణ, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ (వరి)
వరి పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్.
ఫోన్ నెం. 7337399470

## మొక్కజొన్న

- ఎక్కువ వర్షపాతం నమోదైనప్పుడు మొక్కజొన్న లేతదశలో అధిక తేమను తట్టుకోలేదు. ఈ పరిస్థితిని నివారించుటకు పొలం నుండి వర్షపు నీటిని మురుగు నీటి కాలువల ద్వారా బయటకు తీయాలి.
- కత్తెర పురుగు నివారణకు 10-12 రోజుల పైరుపై వేప సంబంధిత మందైన అజాడిరాక్టిన్ (1500 పిపియం) 5 మి.లీ. లేదా బాక్టీరియా సంబంధిత మందులను (బిటి ఫార్ములేషన్) 2 గ్రా. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- సాధ్యమైనంత వరకు మందు ద్రావణం మొక్క సుడిలో పడునట్లుగా సాయంకాలం వేళలో పిచికారి చేయాలి.
- 25-30 రోజుల వయస్సున్న పైరులో అంతరకృషి జరిపి ఎకరాకు 50 కిలోల యూరియాను పైపాటుగా వేసుకొని మట్టిని మొక్కల వేర్లకు ఎగద్రోయవలెను.
- పూత దశలోనున్న పైరుకు ఎకరాకు 50 కిలోల యూరియా మరియు 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసుకోవాలి. ఎరువులు వేసినప్పుడు నేలలో తేమ తప్పనిసరిగా ఉండవలెను.
- పేనుబంక ఆశించినచో డైమిథోయేట్ 30 ఇ.సి. 2 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పొడ తెగులు ఆశించినచో నేలకు దగ్గరగా ఉన్న తెగులు సోకిన ఆకులను తీసివేయవలెను. కలుపు లేకుండా శుభ్రమైన పంటసాగును అవలంభించవలెను. ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి పొడ తెగులును నివారించుకోవచ్చు.
- ఆకుమాడు/ ఆకుఎండు తెగుళ్ళ నివారణకు మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

డా॥ యం. లవకుమార్ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ (మొక్కజొన్న),
మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్,
హైదరాబాద్, ఫోన్ నెం. 7675896677

## చిరుధాన్యాలు

జొన్నని జూన్ రెండవ వారంలో విత్తినట్లైతే పంట 35-40 రోజుల దశలో ఉంటుంది. కావున ఎకరాకు 25 కిలోల యూరియాను పైపాటుగా వేసుకోవాలి. అలాగే 30 రోజుల తర్వాత నుండి పంట కోసే వరకు కాండం తొలిచే పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. దీని నివారణకు విత్తిన 30-40 రోజుల దశలో 4 కిలోలు కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలను ఆకు సుడులలో వేసుకోవాలి. ఒకవేళ పంటను జూలై 15 లోపు విత్తినట్లైతే ఒత్తుగా ఉన్న మొక్కలను తీసివేసి, గుంటక లేదా దంతితో అంతరకృషి చేయాలి. అలాగే మొవ్వుచంపు ఈగ బారినుండి పంటను కాపాడుకొనుటకు ఇమిడాక్లోప్రిడ్ 85 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పంటపై పిచికారి చేసుకోవాలి.

జొన్నలో కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉంది. కావున క్రింద సూచించిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించినట్లైతే పురుగు ఉధృతిని తగ్గించవచ్చును.

పంట విత్తినప్పటి నుండి 30 రోజుల వరకు మొక్క సుడులలో అజాడిరాక్టిన్ (1500 పి.పి.యం) 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసినట్లైతే గ్రుడ్లను మరియు మొదటి దశ లార్వాలను నివారించుకోవచ్చును.



పంట 31 నుండి 65 రోజుల మధ్య వయస్సులో పురుగు ఉధృతి అధికంగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 యస్.జి 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తీవ్ర బెట్ట పరిస్థితులలో పంటను కాపాడుటకు ఈ క్రింద సూచించిన పద్ధతులను పాటించాలి.**

1. 10 రోజుల వ్యవధిలో లీటరు నీటికి 20 గ్రాముల యూరియాను కలిపి పైపాటుగా 2 సార్లు పిచికారి చేయాలి.
2. పంటలో పలుమార్లు అంతరసేద్యం చేయాలి. దీనివల్ల కలుపు కూడా నివారించబడుతుంది.

**సజ్జ :** పంట వేసి 2 వారాలు దాటినట్లైతే ఒత్తు మొక్కలను తీసివేయాలి. అంతరకృషి చేసిన తర్వాత భూమిలో తేమ ఉన్నప్పుడు ఎకరాకు 25 కిలోల యూరియాను పైపాటుగా వేసుకోవాలి. పంటను ఈ దశలో వెర్రి కంకి తెగులు ఆశించే ఆస్కారం ఉంది. కావున మెటలాక్సిల్ 25 డబ్ల్యు.పి. 2 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారి చేయాలి.

**రాగి :** పంటను విత్తి రెండు వారాలు అయినట్లైతే ఒత్తు మొక్కలను తీసివేయాలి. ఒకవేళ పంట 30 రోజుల దశలో ఉన్నట్లైతే కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అంతరకృషి చేపట్టి ఎకరాకు 25 కిలోలు యూరియాను పైపాటుగా వేయాలి.

**కొర్ర :** ప్రస్తుతం కొర్ర పంటలో ఒత్తుగా ఉన్న మొక్కలను తీసివేసి అంతరకృషి చేపట్టాలి. ఒకవేళ పంట 30 రోజుల దశలో ఉన్నట్లైతే కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అంతరకృషి చేపట్టి ఎకరాకు 25 కిలోలు యూరియాను పైపాటుగా వేయాలి.

**డా॥ సి.వి. సమీర్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చిరుధాన్యాలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం ఫోన్ నెం. 9704157788**

## వేరుశనగ

- జూలై మాసంలో విత్తిన వేరుశనగ 20-30 రోజుల దశలో ఉన్నది.
- ఒకవేళ పంట విత్తిన తరువాత బెట్ట పరిస్థితులు ఏర్పడినట్లైతే ఈ సమయంలో ఒక నీటి తడిని ఇస్తే పంట ఒకేసారి పూతకు వస్తుంది.
- పొలంలో వెడల్పాకు మరియు గడ్డిజాతి కలుపు ఉన్నట్లైతే విత్తిన 20-25 రోజులప్పుడు ఇమాజితాఫిర్ 10% అనే కలుపు మందును ఎకరానికి 300 మి.లీ. లేదా ఇమాజామాక్స్ 35% + ఇమాజితాఫిర్ 35% అనే కలుపు మందును 40 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- గడ్డిజాతి కలుపు ఎక్కువగా ఉన్నట్లైతే విత్తిన 20-25 రోజుల సమయంలో క్విజలోఫాప్-పి-ఇథైల్ అనే కలుపు మందు ఎకరానికి 400 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- ఈ దశలో ఒకసారి గొర్రుతో అంతరకృషి చేయవచ్చు.
- తామర పురుగుల నివారణకు థయోమిథాక్సామ్ 100 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- శనగ పచ్చపురుగు మరియు పొగాకు లద్దె పురుగు నివారణకు నొవాల్యూరాన్ ఎకరానికి 200 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- ఆకుమచ్చ తెగులు ఉధృతిని గమనించినట్లైతే క్లోరోథలోనిల్ 400 గ్రా. లేదా టెబ్యుకొనజోల్ 200 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారి చేయాలి.

## ఆముదం

- జూలై మాసంలో విత్తిన పంటను పలుచన చేయాలి.
- జూన్ నెలలో విత్తిన ఆముదంలో గుంటక సహాయంతో అంతరకృషి మరియు వరుసలపై మట్టిని ఎగద్రోయాలి. 15-20 కిలోల యూరియాను పైపాటుగా అందించాలి.
- రసం పీల్చే పురుగులను గమనించినట్లైతే ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.



- దాసరి పురుగు ఉధృతిని గమనించినట్లైతే తొలిదశలో వేపనూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పురుగు ఉధృతిని బట్టి ఎసిఫేట్ 75 ఎస్.పి 1.5 గ్రా. మరియు డైక్లోరోవాస్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- ఎండు తెగులు లక్షణాలు కనిపించినట్లైతే లీటరు నీటికి గ్రాము కార్బండాజిమ్ చొప్పున కలిపి మొక్కల మొదళ్ళ దగ్గర నేలను బాగా తడపాలి.

## ప్రొద్దుతిరుగుడు

- జూన్ మాసంలో విత్తిన పంటకు రక్షక నీటి తడులను ఇవ్వాలి. రెండవ దఫా నత్రజనిని (6 కిలోల నత్రజని) పైపాటుగా వేయాలి.
- ఆకర్షక పత్రాలు వికసించే దశలో 2 గ్రాములు బోరాక్స్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం వలన గింజ దిగుబడి పెరుగుతుంది.
- జూలై మాసంలో విత్తిన పంటలో ఒత్తుగా ఉన్న మొక్కలను తీసి అంతర సేద్యం, కాలువలు మరియు బోదెలు ఏర్పాటు చేయాలి. 6 కిలోల నత్రజనిని పైపాటుగా వేయాలి.
- పొగాకు లద్దెపురుగు ఉధృతి గమనించినట్లైతే నొవాల్యూరాన్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. శనగపచ్చ పురుగు నివారణకై థయోడికార్బ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- నెక్రోసిస్ వైరస్ తెగులు వయ్యారిభామ మొక్కల పరాగ రేణువులు, తామర పురుగుల వల్ల వ్యాపిస్తుంది. వయ్యారి భామ మొక్కలు పూత దశకు రాకముందే తీసివేయాలి. తామర పురుగుల నివారణకై ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. లేదా థయామిథాక్సామ్ 0.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

## నువ్వులు

మే రెండవ పక్షంలో విత్తిన నువ్వులు కోత మరియు నూర్పిడి చేసుకోవాలి.

- వానాకాలంలో ఆలస్యంగా వేసే (ఆగష్టు రెండవ పక్షంలో) పంట కొరకు దుక్కి దున్నుకోవాలి.
- ఆఖరి దుక్కిలో ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువు, 16 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరం మరియు 8 కిలోల పొటాష్ ఎరువులను వేసుకోవాలి.
- ఎకరానికి 2.5 కిలోల విత్తనం సరిపోతుంది. వరుసల మధ్య 30 సెం.మీ. మరియు మొక్కల మధ్య 15 సెం.మీ. దూరంతో విత్తుకోవాలి.
- కిలో విత్తనానికి 3 గ్రాముల మ్యాంకోజెబ్‌తో విత్తినశుద్ధి చేయాలి. పంట తొలిదశలో రసం పీల్చే పురుగుల బారి నుండి కాపాడడానికి ఇమిడాక్లోప్రిడ్ 2.0 మి.లీ. కిలో విత్తనానికి కలిపి శుద్ధి చేసుకోవాలి.
- విత్తనాన్ని వరుసలలో విత్తుకోవడం వలన అంతర కృషి మరియు ఇతర యాజమాన్య పద్ధతులను సులభంగా చేపట్టవచ్చు.

**డా॥ యం. సుజాత, ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం. 7207240582**

## సోయాచిక్కుడు

- సోయ పంట ప్రస్తుతం 30-40 రోజుల దశలో ఉంది. మొలకశాతంలో వచ్చిన ఇబ్బంది వలన కొన్నిచోట్ల రైతులు మరల విత్తడం జరిగినది.
- 30-35 రోజుల దశలో ఉన్న సోయా పంటకు ఎకరాకు 30-35 కిలోల యూరియాను అడుగు మందుగా వేయాలి. అటు తర్వాత సోయా పంటకు ఎరువు వేయనక్కరలేదు.



- అవసరాన్ని బట్టి పైరు కాత దశలో, కాయ తయారవుతున్నప్పుడు పైపాటుగా లీటరు నీటికి 10 గ్రా. యూరియా లేదా 5 గ్రా. మల్టీకె/పాలీఫీడ్ లాంటి పోషకాలను 1,2 సార్లు పిచికారి చేయాలి.
- ప్రస్తుత దశలో పంటలో కలుపు సమస్య ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. నివారణకు కలుపు మొక్కలు లేత దశలో (2-4 ఆకులు) ఉన్నప్పుడు ఎకరాకు 300 మి.లీ. ఇమాజితాఫిర్ లేదా 40 గ్రా. ఇమాజితాఫిర్ + ఇమాజోమాక్స్ మిశ్రమ మందును కలుపుపై పిచికారి చేసి నివారించుకోవచ్చు.
- పైరు వేసిన 40 రోజుల వరకు చిన్న గొర్రు, గుంటకలను నడిపి పంటలో కలుపు లేకుండా చూసుకోవాలి.
- సోయాచిక్కుడును ప్రస్తుతం కాండపు ఈగ, పెంకు పురుగు, పొగాకు లద్దె పురుగు, వేరు కుళ్ళు మరియు ఆకు మచ్చ తెగుళ్ళు ఆశించే అవకాశం ఉంది.
- పైరు లేత దశలో వేరు కుళ్ళు ఆశించి మొక్కలు ఎండి చనిపోవడం గమనించితే లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ గాని లేదా 2 గ్రా. కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ మిశ్రమ మందును కలిపి మొక్కల చుట్టూ భూమిని తడపాలి.
- ఆకుమచ్చలు ఆశించినప్పుడు కూడా పై శిలీంధ్రనాశనులను పంటపై పిచికారి చేసుకోవచ్చు.
- కాండపు ఈగ సమస్య ఉన్నచోట ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3 జి. గుళికలను సరియైన తేమలో భూమిలో వేయాలి లేదా లీటరు నీటికి 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ మరియు 1 మి.లీ. డైక్లోరోవాస్ లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ మందును కలిపి పిచికారి చేయాలి.
- పెంకు పురుగు ఆశించిన చోట లీటరు నీటికి 2 మి.లీ. ట్రైజోఫాస్ లేదా 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ లాంటి మందులను పిచికారి చేయాలి.
- పొగాకు లద్దె పురుగు, ఆకు ముడుత/ఆకు చుట్టు పురుగు ఆశించినప్పుడు లీటరు నీటికి 1.5 గ్రా. థయోడికార్బ్ లేదా 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా 1 మి.లీ. నొవాల్యురాన్ లేదా 0.5 గ్రా. ఇమామెక్టిన్ బెంజోయేట్ లాంటి మందులను మారుస్తూ 1, 2 సార్లు పిచికారి చేయాలి.

**ఎ. సుదర్శనమ్, ప్రధాన శాస్త్రవేత్త (సోయాచిక్కుడు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 9652290044**

## అపరాలు

- పెసర / మినుము ప్రస్తుతం 20 రోజుల నుండి మొగ్గ / పూత దశలో ఉన్నాయి. తొలి దశలో రసం పీల్చే పురుగులు ముఖ్యంగా తామర పురుగులు, పేనుబంక మరియు తెల్లదోమ ఆశించే అవకాశముంది. రసం పీల్చే పురుగుల నివారణకై మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- మొగ్గ / పూత, పిందె దశలో బెట్ట పరిస్థితులు ఏర్పడినచో అవకాశమున్న చోట తేలిక పాటి తడి ఇవ్వవలెను లేదా లీటరు నీటికి 20 గ్రా. యూరియా లేదా 10 గ్రా. మల్టీ-కె కలిపి వారం వ్యవధిలో పిచికారి చేయాలి.
- వర్షాలు ఏకధాటిగా కురిసినప్పుడు ఆకురొట్ట ఎక్కువగా ఉండటంవల్ల పొగాకు లద్దెపురుగు ఆశించి నష్టపరుచును.
- జల్లెడాకులు కనబడినచో లద్దెపురుగు ఆశించినట్లుగా గుర్తించి వెంటనే గ్రుడ్ల సముదాయం, పిల్ల పురుగులు కలిగిన జల్లెడాకులు తీసివేయాలి.
- తొలిదశలో లార్వాల నివారణకై ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా క్వినాల్ఫాస్ 2.0 మి.లీ. మరియు ఎదిగిన లార్వాల నివారణకై థయోడికార్బ్ 1.0 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.



- ఉధృతిని బట్టి 10 కిలోల తవుడు, కిలో బెల్లం, లీటరు క్లోరిపైరిఫాస్ లేదా మోనోక్రోటోఫాస్ తగినంత నీరు కలిపి బెల్లం ఒక రోజు ముందే నానబెట్టి బాగా పులిసిన తర్వాత విషపు ఎరలు తయారుచేసుకొని సాయంత్రం వేళ పొలంలో సమంగా వెదజల్లినచో ఎదిగిన పొగాకు లద్దెపురుగు లార్వాలను సమర్ధవంతంగా అదుపు చేయవచ్చును.
- మొగ్గ తొలి దశలో 5% వేపకషాయం లేదా 5 మి.లీ. వేపనూనె మరియు 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసినచో శనగపచ్చ పురుగు మరియు మారుకా మచ్చల పురుగు ఉధృతి తగ్గించవచ్చును.
- పూత/ తొలి పిందె దశలో కాయ తొలుచు పురుగుల నియంత్రణకు 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ + డైక్లోర్వాస్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మారుకా మచ్చల పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నచో క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పల్లాకు తెగులు ఆశించినచో తెగులు సోకిన మొక్కలను పీకి కాల్చివేయాలి. తెగులు వ్యాప్తిని అరికట్టేందుకు తెల్లదోమను సకాలంలో నివారించాలి. నివారణకై డైఫెన్ థయురాన్ 1.5 గ్రా. లేదా 0.2 గ్రా. ఎసిటామిప్రిడ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను.
- అధిక వర్షాలకు ఆకుమచ్చ తెగులు వ్యాప్తి చెందును. కావున కార్బండాజిమ్ 1.0 గ్రా. లేదా మ్యాంకోజెబ్ 2.5గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను.
- కంది పంట 20 నుండి 40 రోజుల దశలో ఉంది. తొలి 60 రోజుల వరకు కలుపు లేకుండా చూడాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో అంతరకృషి చేసి కలుపును నివారించి భూమిని గుల్లబారేలా తయారుచేసినచో భూమిలో తేమ బాగా నిలిచి బెట్టను కొంత మేరకు తట్టుకొనును.
- అంతరకృషి సాధ్యంకాని పరిస్థితులలో కలుపు నివారణకు విత్తిన 20 రోజులకు ఇమాజితాఫిర్ 300 మి.లీ. ఎకరానికి అనగా 1.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసినచో గడ్డి మరియు వెడల్పాకు కలుపును నివారించవచ్చును.
- బెట్ట పరిస్థితులలో రసం పీల్చే పురుగులు ముఖ్యంగా పేనుబంక ఆశించి మొక్కలు పాలిపోవును. కావున 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ మరియు 20 గ్రా. యూరియా ద్రావణం లేదా 10 గ్రా. మల్టీ-కె లేదా పాలీఫీడ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను.
- వర్షాలు అధికంగా ఉంటే పంటలో వర్షపు నీరు నిలువకుండా ఎప్పటికప్పుడు నీరు తీసివేయాలి. వీలైనంత వరకు బోదె కాల్వ పద్ధతిలో విత్తుకొని వర్షపు నీరు ఇంకేలా చేయాలి.
- ఆలస్యంగా కంది విత్తుకునే రైతులు స్వల్పకాలిక రకాలను వేయకూడదు. మధ్యకాలిక రకాలైన డబ్ల్యు.ఆర్.జి-65, ఐ.సి.పి.ఎల్-87119, ఐ.సి.పి.హెచ్-2740, టి.డి.ఆర్.జి.-4 లేదా మధ్య స్వల్పకాలిక రకాలైన డబ్ల్యు.ఆర్.జి.ఇ-97, డబ్ల్యు.ఆర్.జి.ఇ-93 విత్తుకోవచ్చును.
- సాళ్ళ మధ్య 75-90 సెం.మీ. మొక్కల మధ్య 15 సెం.మీ. ఎడంతో విత్తుకోవాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 18 కిలోల యూరియా, 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా 50 కిలోల డి.ఎ.పి. ని వేయాలి.
- కంది/ పెసర/ మినుము పంటల తొలిదశలో గొంగళి పురుగులు ఆశించినచో క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**డా॥ పి. జగన్‌మోహన్ రావు, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 9849133493**

## ప్రత్తి

- ప్రత్తి పంట ప్రస్తుతం విత్తిన సమయాన్ని బట్టి శాఖీయ, గూడ, పూత దశలో ఉంది. వర్షాలు సకాలంలో కురుస్తున్న ఈ సమయంలో పంట చాలా చోట్ల మంచి పెరుగుదలతో బాగుంది.
- ప్రస్తుత పంటలో కలుపు, ఎరువుల యాజమాన్యం, అంతరకృషి ముఖ్యమైనవి.



- పెరిగే పంటలో కలుపు సమస్య ఎక్కువగా ఉంటే ఎకరానికి 250 మి.లీ. పైరిథయోబ్యాక్ సోడియం మరియు 250 మి.లీ. ప్రొపాక్విజాఫాప్ మందులను లీటరు నీటికి 1.25 మి.లీ. చొప్పున కలిపి కలుపు లేతదశ (2-4 ఆకులు)లో పిచికారి చేసుకొంటే దాదాపు అన్ని రకాల కలుపు నివారణ అవుతుంది.
- ప్రస్తుత దశలో పంటలో గొర్రు, గుంటకల ద్వారా దాదాపు 10 రోజులకొకసారి అంతరకృషి చేయాలి. దీని వలన పంట పెరుగుదల బాగుంటుంది.
- ప్రతి పంటకు వేసే ఎరువుల విషయంలో సిఫారసు చేసిన ఎరువుల మోతాదును, ఎరువులు వేసే విధానాన్ని మరియు సమయాన్ని ఖచ్చితంగా పాటిస్తేనే చీడపీడలు తగ్గి సరియైన దిగుబడులు వస్తాయి.
- ప్రతి పంటకు ముఖ్యంగా కాంప్లెక్స్ ఎరువులను పంట మొదటి దశలో అనగా విత్తేటప్పుడు గాని లేదా విత్తిన 15-20 రోజుల లోపుగాని ఒకసారి మాత్రమే వేయాలి. మోతాదు ఎకరాకు 50 కిలోలు.
- అటు తర్వాత పైపాటుగా పంటకు యూరియా, పొటాష్ ఎరువులను మాత్రమే దాదాపు ప్రతి 20 రోజులకొకసారి ఎకరాకు 25-30 కిలోల యూరియా మరియు 5-10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌తో కలిపి పంట కాలంలో విత్తిన 100 రోజులలోపు నాలుగు దఫాలుగా వేయాలి.
- భూమిలో పొటాష్ నిల్వలు సమృద్ధిగా ఉన్నట్లు నిర్ధారణ అయితే పొటాష్‌ను కేవలం 1 లేదా 2 సార్లు పైన సూచించిన విధంగా ఎకరాకు 5-10 కిలోల వరకు వేస్తే సరిపోతుంది.
- ఎరువులను ముఖ్యంగా మొక్కలకు దగ్గరగా (10 సెం.మీ. దూరంలో) భూమిలోపలపడునట్లు గొర్రు ద్వారా వేసి, గుంటకను నడపాలి తద్వారా ఎరువు వృధా కాకుండా మొక్కకు భాగా సద్వినియోగం అవుతుంది.
- భూమి ద్వారా అందించే ఎరువులే కాకుండా అవసరాన్ని బట్టి బెట్ట/ అధిక వర్షపాత సమయాల్లో, పంట కాయ ఎదుగుదల దశలో పైపాటుగా పోషకాల పిచికారిని అవసరాన్ని బట్టి అప్పుడప్పుడు చేయాలి. దీనికి గాను లీటరు నీటికి 10 గ్రా. పొటాషియం నైట్రేట్ (మల్టీ-కె) లేదా 10 గ్రా. 19:19:19 (పాలీఫీడ్) లాంటివి కలిపి పిచికారి చేయాలి.
- ప్రస్తుత దశలో ప్రత్తిని తామర పురుగులు, పచ్చదోమ మొదలగు రసం పీల్చు పురుగులు ఆశిస్తున్నాయి. అలాగే అక్కడక్కడ వేరుకుళ్ళు, మొక్కలు వడలిపోవడం గమనించవచ్చు.
- ముఖ్యంగా తామరపురుగులు, పచ్చదోమ మొదలగు రసం పీల్చు పురుగుల నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. ఫిప్రోనిల్ లేదా 0.3 గ్రా. ఫ్లోనికామిడ్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ లేదా 0.9 మి.లీ. స్పైనటోరామ్ మొదలగు వాటిని పిచికారి చేసుకోవాలి.
- వేరుకుళ్ళు, మొక్కలు ఎండిపోవడం గమనించినచోట లీటరు నీటికి 2 గ్రా. కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ కలిపిన మిశ్రమం లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ మందులను కలిపి మొక్కల చుట్టూ భూమిని తడపాలి. ఇలా వారంలోపు 2 సార్లు చేయాలి.
- పైరు పూత దశలో గులాబీ రంగు కాయతొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంది. కావున ఎకరాకు 4 చొప్పున లింగాకర్షక బుట్టలను అమర్చి పురుగు ఉనికిని గమనిస్తూ సస్యరక్షణ చేపట్టాలి.
- ముఖ్యంగా పైరు పూత దశలో కనిపించు గులాబీ రంగు పురుగు లార్వాలున్న గుడ్డిపూలను ఎప్పటికప్పుడు ఏరి నిర్మూలించాలి.
- పైరులో 10% గుడ్డిపూలను గమనించినట్లైతే నష్టపరిమితి దశగా భావించి పురుగు మందులు పిచికారి చేయాలి.
- గులాబీ పురుగు నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. క్వినాల్ఫాస్ లేదా 1.5 గ్రా. థయోడికార్బ్ లేదా 0.9



మి.లీ. స్పైనటోరామ్ లేదా 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ లాంటి వాటిని మారుస్తూ అవసరాన్ని బట్టి పిచికారి చేయాలి. పిచికారి ఉదయం లేదా సాయంత్రం వేళలో చేయాలి.

**ఎ. సుదర్శనమ్, ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 9652290044**

## చెఱకు

ఈ మాసంలో జూన్ – జూలై మాసంలో నాటిన విత్తనపు తోటలకు పైపాటుగా నాటిన 30 వ రోజున ఎకరానికి 40 కిలోల చొప్పున నత్రజని వేయాలి. అంతర సేద్యం ద్వారా కలుపు యాజమాన్యం చేపట్టాలి. దీని వల్ల భూమిలో తేమ కూడా సంరక్షించబడుతుంది.

తెలంగాణ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వేరు పురుగు ఆశించి పంటను నష్టపరుస్తుంది. ఈ పురుగు తేలిక నేలల్లో ఎక్కువగా కనిపించి మొక్కల వేర్లను తినివేయటం వలన మొక్కలు చనిపోతాయి. తొలకరి వర్షాలు పడిన వెంటనే పొలంలో దీపపు ఎరలు అమర్చుకోవటం ద్వారా ప్రౌఢ పెంకు పురుగులు ఆకర్షితమై, దీపపు ఎర క్రింద అమర్చుకొన్న పురుగు మందు ద్రావణంలో పడి చనిపోవును తద్వారా దాదాపు 50 శాతం పురుగులను నిర్మూలించవచ్చు. ఎదిగే తోటల్లో ఈ పురుగు నివారణకు ఫోరేట్ 10 శాతం గుళికలను ఎకరాకు 8 కిలోలు చొప్పున మొక్కల మొదళ్ళ దగ్గర గుంత చేసి నాటే సమయంలో భూమిలో వేస్తే ఈ పురుగు వలన కలిగే నష్టాన్ని తగ్గించుకోవచ్చు లేదా ఈ పురుగును సమర్థవంతంగా నివారించుటకు 200 గ్రా. ఫిప్రోనిల్ 40% మరియు ఇమిడాక్లోప్రిడ్ 40% మందును 400 లీటర్ల నీటిలో కలిపి మొక్కల మొదళ్ళ దగ్గర పూర్తిగా తడిచే విధంగా పిచికారి చేయాలి.

చెఱకులో దూదేకుల పురుగులు ఆకుల అడుగుభాగాన గుంపులు గుంపులుగా చేరి ఆకుల నుండి రసాన్ని పీల్చి వేయడం వలన ఆకులు వడలిపోయి ఎండిపోతాయి. పురుగు ఆశించిన చెఱకు నుండి తయారు చేసిన బెల్లం నల్లగాను, మెత్తగాను ఉండి నిల్వకు పనికిరాదు. మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి పురుగును నివారించుకోవచ్చు.

తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో చెఱకును కాండం తొలిచే పురుగు ఆశించి గడ కణుపులకు రంధ్రాలు చేసి లోనికి ప్రవేశిస్తాయి. దీని వల్ల చెఱకు గడ లోపల ఎర్రని చారలు ఏర్పడతాయి. లోపలి పదార్థమును తిని వాటి మలినాన్ని రంధ్రాల ద్వారా బయటకు విసర్జిస్తాయి. ఈ పురుగు ఆశించిన కణుపులు గట్టిపడి దిగుబడి, రస నాణ్యత తగ్గిపోతుంది. ఈ పురుగు ఆశించిన తోటల్లో 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ 36% ఎస్.ఎల్ లేదా 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ 20% ఇ.సి. లేదా 0.75 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ 18.50% ఎస్.సి. లేదా 2 మి.లీ. ఫిప్రోనిల్ 0.30% జి.ఆర్. లేదా 0.75 మి.లీ. థయోమిథాక్సామ్ 75% డబ్ల్యు.డబ్ల్యు ఎస్.జి. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. క్లోరాంట్రానిలిప్రోల్ గుళికలను 18.50% ఎస్.సి. ఎకరాకు 7.5 కిలోల చొప్పున నేలలో వేసుకోవాలి. ట్రైకోగ్రామా ఖిలోనిస్ గ్రుడ్డు పరాన్న జీవిని ఎకరాకు 20,000 చొప్పున చెఱకు నాటిన 30 రోజుల వ్యవధిలో 4 సార్లు విడుదల చేయాలి.

పంట ఏపుగా ఎదిగే దశలో మొక్కల మొదళ్ళ వరకు ఎత్తుగా మట్టిని ఎగద్రోసి, అవసరాన్ని బట్టి జడ చుట్లు వేసుకోవాలి. లేని పరిస్థితులలో బలమైన వర్షాలు, తుఫాను గాలుల వలన తోట పడిపోయి అటు రసనాణ్యత ఇటు దిగుబడి తగ్గే అవకాశముంది.

**డా॥ యం. విజయ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు), వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్, మెదక్, ఫోన్ నెం. 9849535756**

# వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ జి. శ్రీనివాస్
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

ఈ సంవత్సరం నైరుతి ఋతుపవనాలు జూన్ 1వ తేదీన కేరళ తీరాన్ని తాకాయి. తెలంగాణ రాష్ట్రంలో నైరుతి ఋతుపవనాలు జూన్ 11 వ తేదీన ప్రవేశించి జూన్ 12 వ తేదీన రాష్ట్రమంతటా విస్తరించాయి. భారత వాతావరణ విభాగం (ఐ.ఎం.డి), న్యూఢిల్లీ వారు అందించిన ముందస్తు వాతావరణ సూచనల ప్రకారం 2020 సంవత్సరానికి గాను దేశం మొత్తానికి జూన్ నుండి సెప్టెంబర్ మాసం వరకు నైరుతి ఋతుపవనాల ద్వారా సాధారణ వర్షపాతం (102 ± 4 శాతం) నమోదయ్యే సూచనలున్నాయి. నైరుతి ఋతుపవనాల కాలంలో రెండవ అర్ధభాగంలో కూడా (ఆగష్టు నుండి సెప్టెంబర్) సాధారణ వర్షపాతం (104 ± 8) నమోదయ్యే సూచనలున్నాయి.

రాష్ట్రంలో 29.07.2020 వరకు వానాకాలం పంటకాలానికి విస్తీర్ణం (ఎకరా) గమనిస్తే సాధారణ విస్తీర్ణంలో వరి - 56 శాతం (15,13,293), జొన్న - 91 శాతం (1,08,173), మొక్కజొన్న - 15 శాతం (1,75,070), కంది - 107 శాతం (8,13,908 ), పెసర - 53 శాతం (1,16,426 ), మినుములు - 59 శాతం (40,644 ), వేరుశనగ - 27 శాతం (11,578 ), ఆముదము - 42 శాతం (33,951), సోయాచిక్కుడు - 79 శాతం (3,87,646) మరియు ప్రత్తి - 121 శాతం (53,64,127) సాగు చేయటం జరిగింది.

ఈ సంవత్సరం వానాకాలంలో ఇప్పటి వరకు ఆహార పంటలు 22 శాతం, పప్పుదినుసులు 92 శాతం, నూనె గింజల పంటలు 67 శాతం మరియు మొత్తం మీద 84 శాతం వరకు పంటలు సాగుచేయటం జరిగింది.

### వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు

- వరిలో దోమపోటు ఉధృతి తగ్గించుటకు ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ. కాలిబాటను వదులుకొని తూర్పు పడమర దిశలలో వరసలు ఉండే విధంగా వరినాట్లను సెప్టెంబర్ మొదటి వారంలోపు పూర్తి చేసుకోవాలి. వర్షాలు అధికంగా కురిసిన ప్రాంతాలలో వరిలో బాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించకుండా మరియు తెగులు ఆశించినచో నివారించుటకు నత్రజని ఎరువులను తాత్కాలికంగా (5-7 రోజులు) వాయిదావేయాలి. వరిలో తాటాకు తెగులు మరియు కాండంతొలుచు పురుగు ఆశించుటకు అనుకూలం. తాటాకు తెగులు నివారణకు 2 మి.లీ. క్వినాల్‌ఫాస్ లేదా ప్రొఫెనోఫాస్ లేదా 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. కాండం తొలుచు పురుగు నివారణకు 8 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలను ఎకరా పొలంలో వేసుకోవాలి.
- మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు విషపు ఎర తయారు చేసుకోవడానికి గాను 10 కిలోల వరి తవుడులో 2 కిలోల బెల్లంను కలిపి 2-3 లీటర్ల నీటిని చేర్చి సుమారు 12 గంటల పాటు పులియనిచ్చి మరుసటి రోజు 100 గ్రా. థయోడికార్బ్‌ను కలుపుకొని ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసి మొక్క సుడులలో వేసుకోవాలి.
- ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా థయామిథాక్సామ్ 9.5% + లామ్డాసైహాలోత్రిన్ 12.6% - 0.5 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- నేలలో ఎక్కువ మోతాదులో తేమ ఉన్నచో మొక్కజొన్నలో ఎండు తెగులు సోకుటకు అనుకూలం. తెగులు వ్యాప్తి నివారణకు పొలంలోని మురుగు నీటిని తీసివేయాలి. అధిక వర్షాల వలన నల్లరేగడి నేలలోని ప్రత్తికి ఎండు తెగులు సోకుటకు అవకాశం ఉన్నది. నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటిలో కలిపి మొక్కల చుట్టూ నేలను తడపాలి.
- సోయాచిక్కుడులో కాండం తొలుచే ఈగ మరియు పెంకు పురుగు ఆశించినచో నివారణకు 2 మి.లీ. డైమిథోయేట్ లేదా 2 మి.లీ. క్వినాల్‌ఫాస్ + 5 మి.లీ. వేప గింజల కషాయం లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. సోయాచిక్కుడులో పొగాకు లద్దె పురుగు నివారణకు 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా 1 మి.లీ. నొవాల్యూరాన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- కూరగాయలలో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే సూచనలున్నాయి. నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా థయామిథాక్సామ్ 0.3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9989625231



# మిషన్‌తో వరినాట్లు వేసిన పొలాల్లో అధిక దిగుబడికి సూచనలు

ఎన్. నవత, ఎ. రజనీదేవి, పి. మధుకర్ రావు మరియు డా॥ఆర్. ఉమారెడ్డి
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస, జగిత్యాల

తెలంగాణ రాష్ట్రంలో నియంత్రిత సాగు విధానం ద్వారా 40 లక్షల ఎకరాల్లో వరి పంట సాగుచేయడం జరుగుతుంది. రాష్ట్రంలో నానాటికి వ్యవసాయ కూలీల సమస్య పెరిగిపోతుంది. వరిని పండించే రైతులు కూలీల సమస్యను తగ్గించటానికి మిషన్‌తో వరినాట్లు వేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని పొలాల్లో మిషన్‌ల ద్వారా వరినాట్లు వేయడం జరుగుతుంది. కావున మిషన్‌తో వరినాట్లు వేసే రైతులు మంచి దిగుబడిని సాధించటానికి కొన్ని మెళకువలను పాటించడం ఎంతైనా అవసరం.

ప్రధాన పొలాన్ని నాటడానికి వారం నుంచి పది రోజులు ముందుగా ఒకసారి, నాటడానికి రెండు లేదా మూడు రోజులు ముందుగా మరోసారి రోటవేటర్‌తో దమ్ము చేసుకోవాలి. ఎక్కువసార్లు దమ్ము చేయడం వలన వరినాటు యంత్రం దిగబడిపోతుంది. పొలం జారుగా లేకుండా బిగుతుగా ఉండేలా చూసుకోవాలి. మట్టి పేరుకొకపోతే నాటు నిలబడక పడిపోతుంది.

**నీటి యాజమాన్యం:** నాట్లు వేస్తున్నప్పుడు యంత్రానికి మట్టి అంటుకోకుండా ఉండటానికి నీరు పలుచగా 1-2 సెం.మీ. ఉండాలి. మిషన్‌తో నాటు వేసేటప్పుడు చాలా తక్కువ ఎత్తు ఉన్నటువంటి నారును వేస్తారు. కాబట్టి నాటు వేసినప్పుడు నుంచి దుబ్బు చేయడం పూర్తయ్యే వరకు పొలంలో పలుచగా (2-3 సెం.మీ.) నీరు పెట్టాలి. నీరు ఎక్కువగా ఉన్నట్లయితే పైరు సరిగా దుబ్బు చేయదు. చిరు పొట్ట దశ నుంచి గింజ గట్టి పడే దశ వరకు 5 సెం.మీ. లోతు వరకు నీరు ఉంచాలి. కోతకు వారం నుంచి 10 రోజుల ముందు నుంచి నీటిని నెమ్మదిగా తగ్గించాలి.

**కలుపు యాజమాన్యం:** కలుపు నివారణకు ప్రెటిలాక్లోర్ 500 మి.లీ. లేదా బ్యుటాక్లోర్ లీటరు లేదా ఆక్సాడయార్జిల్ 35 గ్రా. పొడి మందును 500 మి.లీ. నీటిలో కలిపిన ద్రావణంను ఎకరాకు 25 కిలోల పొడి ఇసుకలో కలిపి నాటిన 3 నుంచి 5 రోజుల్లో పలుచగా నీరు ఉండేటట్లు చూసుకొని సమానంగా వెదజల్లాలి లేదా వరినాట్లు వేసిన 8 నుంచి 10 రోజుల తర్వాత పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 80 గ్రా. లేదా నాట్లు వేసిన 15 రోజుల తర్వాత బిస్‌పైరిబాక్ సోడియం 100 మి.లీ. చొప్పున ఎకరాకు 200 లీటర్ల నీటికి కలిపి పొలంలో నీటిని తీసివేసి చేతి పంపుతో సమానంగా పిచికారి చేసి కలుపును నివారించాలి. మిషన్‌తో వరినాట్లు వేసిన పొలంలో 15 నుంచి 25 రోజుల తర్వాత ప్రతి 10 రోజులకు ఒకసారి పవర్ వీడర్‌ను 3 సార్లు నడపాలి. మొక్కకు మొక్కకు మధ్య ఉన్న కలుపును మనుషుల ద్వారా తొలగించాలి. వీడర్ నడపడం వలన కలుపు భూమిలో కలిసిపోయి సేంద్రియ పదార్థం వృద్ధి చెంది సూక్ష్మజీవుల అభివృద్ధికి తోడ్పడుతుంది. వీడర్ వాడటం వలన వేర్లకు బాగా ఆక్సిజన్ అందుతుంది. పిలక వేయడం ఎక్కువ అవుతుంది. పవర్ వీడర్ ద్వారా 2 నుంచి 2.5 గంటల్లో ఎకరం పొలంలో కలుపు తీయవచ్చు. గంటకు సుమారుగా లీటరు పెట్రోల్ మాత్రమే ఖర్చు అవుతుంది.

**పోషకాల యాజమాన్యం:** రసాయన ఎరువులతో పాటు సేంద్రియ మరియు జీవన ఎరువులను వాడి పైరుకు సమతుల్య పోషకాలను అందజేయాలి. ఎకరాకు 48 నుంచి 60 కిలోల నత్రజని, 25 కిలోల భాస్వరాన్ని మరియు 20 కిలోల పొటాష్‌ను వాడాలి. నత్రజని మూడు సమభాగాలుగా చేసి నాటుకు ముందు దమ్ములోను, దుబ్బు చేసే దశలోను, చిరుపొట్ట దశలోను బురద పదునులో మాత్రమే సమానంగా వెదజల్లి 36 నుంచి 48 గంటల తర్వాత పలుచగా నీరు పెట్టాలి. మొత్తం భాస్వరం ఎరువుని దమ్ములో వేయాలి. పొటాష్ ఎరువును ఆఖరి దమ్ములో సగం, చిరుపొట్ట దశలో మిగతా సగం వేయాలి. కాంప్లెక్స్ ఎరువులను దుబ్బు లేదా చిరుపొట్ట ఏర్పడే దశలో పైపాటుగా వేయకూడదు.

మేలైన యాజమాన్య పద్ధతులను పాటించినట్లయితే మిషన్ నాట్ల ద్వారా కూలీల సమస్యను అధిగమించడమే కాకుండా 10% వరకు అధిక దిగుబడులతో పాటు నీటిని కూడా ఆదా చేయవచ్చును.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8074006521



# వరిలో సమర్ధవంతంగా సాగునీటి యాజమాన్యం

ఫిర్దోజ్ షహీన, రమ్య రాథోడ్, స్వప్న నాగూరి, పి. జలంధర్ నాయక్, వై స్వాతి మరియు డా॥ యం.శ్రీధర్
ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన స్థానం, రుద్రూరు

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఋతుపవనాలు ఆలస్యంగా ప్రారంభమై జూన్ మాసంలో 35% లోటు వర్షపాతం నమోదైంది. జూలై మాసంలో ఇప్పటి వరకు కురిసిన వర్షాలు 29% లోటుగా ఉన్నాయి. వరి సాగు చేసే రైతులు ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులలో సాగునీటిని సమర్ధవంతంగా ఉపయోగించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఒక ఎకరా వరి పంట పండించడానికి సుమారుగా 1200 మి.మీ. నుండి 1400 మి.మీ. నీరు అవసరమవుతుంది. సాంప్రదాయ పద్ధతిలో కిలో బియ్యం ఉత్పత్తి చేయడానికి 3000 నుండి 5000 లీటర్ల నీరు అవసరం అవుతుంది. వరి పంటలో వివిధ దశలలో నీటి అవసరం ఈవిధంగా ఉంటుంది.

| పంట వృద్ధి దశ | నీటి అవసరం (మి.మీ.) |
|---|---|
| నారుమడి దశలో | 50-60 |
| ప్రధాన క్షేత్ర తయారి | 200-250 |
| నాటినప్పటి నుండి అంకురం ఏర్పడు వరకు | 400-550 |
| అంకురం ఏర్పడు దశ నుండి పూత దశ వరకు | 400-450 |
| పూత నుండి పక్వత దశ వరకు | 100-150 |
| **మొత్తం** | **1200-1460** |

సమర్ధవంతంగా నీటి యాజమాన్యం చేపట్టినచో పంట దిగుబడిపై నీటి కొరత ప్రభావం ఉండదు. వరిలో తేమ సున్నిత దశలలో నీటి లోటును నివారించలేని పరిస్థితులలో 30-60% వరకు దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుంది. వరిలో తేమ సున్నిత దశలు

1. పిలక దశ
2. అంకురం ఏర్పడు దశ
3. పోటాకు దశ
4. పూత దశ

పిలకలు వృద్ధి చెందే దశలలో వరి పంట తేమ ఒత్తిడికి గురైనచో 30% వరకు దిగుబడి తగ్గుతుంది. అలాగే పూత దశలో అయితే 50-60% దిగుబడి తగ్గిపోవును. కావున వరి సాగులో సమర్ధ నీటి వినియోగంతో మంచి దిగుబడులు సాధించవచ్చు. వరి పంట పెరుగు దశలకు అనుగుణంగా నీటి లోతు అవసరం మారుతుంది.

| పంట దశ | నీటి లోతు (సెం.మీ.) |
|---|---|
| నాట్లు వేయునప్పుడు | 2-3 |
| నాట్లు వేసిన తరువాత 5 నుండి 20 రోజులు | 4-5 |
| పిలక దశ (22 నుండి 42 రోజులు) | 2-3 |
| అంకురం ఏర్పడు దశ నుండి పూత దశ వరకు | 4-5 |
| పరిపక్వత దశ నుండి కోత దశ వరకు క్రమంగా నీరు తగ్గించాలి | |

నాట్లు వేసిన 40-45 రోజుల తరువాత పొలంలో నీరు తీసివేసి 24-48 గంటలు ఆరబెట్టవలసిన అవసరం ఉంది. ఈ ప్రక్రియ వలన దోమపోటు మరియు కాండం కుళ్ళు నుండి పంటను కాపాడుకోవచ్చు. వరి నీటి అవసరం సాగు రకాన్ని బట్టి మారుతూ ఉంటుంది. వరి రకాన్ని బట్టి ఈ క్రింది సూచించిన విధంగా నీటిని అందించి సాగు నీటిని సమర్ధవంతంగా వినియోగించవచ్చు.

| నాటినప్పటి నుండి రోజులు | ఇవ్వవలసిన తడుల సంఖ్య | పాటించవలసిన నీటి లోతు (సెం.మీ.) |
|---|---|---|
| **స్వల్పకాలిక రకాలు (100-105 రోజుల కాలపరిమితి)** | | |
| 1-25 | 5-7 | 2-3 |
| 25-28 | నీటిని పలుచగా ఉంచవలయును | |
| 29-50 | 5-6 | 2-5 |
| 51-70 | 5-6 | 2-5 |
| 71-105 | 5-6 | 2-5 |
| **మధ్యకాలిక రకాలు (120-125 రోజుల కాలపరిమితి)** | | |
| 1-30 | 5-7 | 2-3 |
| 30-33 | నీటిని పలుచగా ఉంచవలయును | |
| 34-65 | 6-8 | 2-5 |
| 66-95 | 8-10 | 2-5 |
| 96-125 | 6-8 | 2-5 |
| **దీర్ఘకాలిక రకాలు (126-150 రోజుల కాలపరిమితి)** | | |
| 1-35 | 6-8 | 2-5 |
| 35-38 | నీటిని పలుచగా ఉంచవలయును | |
| 39-95 | 12-15 | 2-5 |
| 96-125 | 7-9 | 2-5 |
| 126-150 | 5-6 | 2-5 |

### సాగునీటిని వృధా కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు

1. నాట్లు వేయడం పూర్తి అయిన తరువాత నీరు పలుచగా ఉంచవలెను
2. ఎరువులు వేయడానికి సుమారు 2 రోజులు ముందు నీరు తీసివేయండి
3. పొలం చుట్టూ ఉన్నటువంటి గట్లలో ఏర్పడే పగుళ్ళ ద్వారా నీటి లీకేజీని నివారించడానికి గట్టుకు సమాంతరంగా మరో చిన్న గట్టు ఏర్పర్చుకోవాలి
4. వృధాగా నీరు భూమి లోపల ఇంకిపోకుండా ఉండడానికి నీటిని 5 సెం.మీ. లేదా అంతకంటే తక్కువ ఉంచాలి.
5. పిలకలు వేయు దశ పూర్తి అయిన తరువాత 5 నుండి 7 రోజులు పూర్తిగా నీటిని తీసివేయండి. ఇది సల్ఫైడ్ వంటి విషపదార్థాలను తొలగించడానికి సహాయపడుతుంది.

ఈవిధంగా వరి పంట సాగులో పంట నీటి అవసరానికి అనుగుణంగా నీటిని అందించి నీరు వృధా కాకుండా తగు జాగ్రత్తలు వహించినచో ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో సాగునీటిని సమర్ధవంతంగా ఉపయోగించి వరి పంట దిగుబడులు తగ్గకుండా వరి సాగు చేసుకోవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9848373997**





# వానాకాలం వరిలో కలుపు నివారణ

డా॥ యం. మల్లారెడ్డి
కంప్యూటర్ సెంటర్, రాజేంద్రనగర్, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో రైతు సోదరులు ప్రస్తుతం జూలై నెలలో నార్లు పోసిన ప్రాంతాల్లో నాట్లు వేస్తున్నారు. జూన్ నెలలో నారు పోసి జూలై నెలలో నాట్లు వేసిన ప్రాంతాల్లో కలుపు నివారణ చర్యలు చేపట్టుతున్నారు. మన రాష్ట్రంలో ఈ వానాకాలంలో నియంత్రిత పద్ధతిలో పంటల సాగు విధానాన్ని రైతులు మనస్ఫూర్తిగా పాటిస్తున్నారు. సుమారుగా 40 లక్షల ఎకరాలలో వానాకాలం వరిని సాగు చేస్తున్నారు. సాగు నీటి లభ్యత, రైతుకు దోహదపడే ప్రభుత్వ విధానాలు, అదునులో అందుబాటులో వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు, నాణ్యమైన విత్తన లభ్యత వెరసి రైతులు ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగుకు మొగ్గుచూపారు. వానాకాలం వరిలో అధిక దిగుబడులు పొందాలంటే అదునులో కలుపు నివారణ ముఖ్యం. నాటిన వరిలో కలుపు మొక్కల వలన సుమారుగా 50 శాతం దిగుబడి తగ్గుతుందని పరిశోధన ఫలితాలు చెపుతున్నాయి. కలుపు మొక్కలు వరి పంటతో పోటీబడి నీరును, సూర్యరశ్మిని, పోషకాలను ఎక్కువగా తీసుకొని పంట ఎదుగుదలను ప్రభావితం చేస్తాయి. అంతేకాకుండా చీడపీడలకు నిలయమై పంట దిగుబడిని గణనీయంగా తగ్గిస్తాయి.

ప్రస్తుతం కూలీల కొరత, అధిక రేట్లు, అదునులో దొరకపోవటం వంటి అంశాలు వరిలో కలుపు నివారణ మీద తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కావున రైతులు తక్కువ ఖర్చుతో అదునులో కలుపు మందులతో కలుపు నివారణ చేయవచ్చును. చాలా మంది రైతులు వరి సాగులో కలుపు మందులు వాడుతున్నారు. మార్కెట్లో చాలా రకాల కలుపు మందులు లభిస్తున్నాయి. రైతులు మాత్రం వరి పైరుకు, ఏ మందును ఎంత మోతాదులో, ఏ సమయంలో ఎలా వాడాలో తెలుసుకోవాలి మరియు అవగాహన పెంచుకోవాలి. నారుమడిలో ఊద, ఒడిపిలి వంటి గడ్డిజాతి కలుపు ఉన్నట్లయితే విత్తిన 15 రోజులకు సైహాలోఫాప్ బ్యుటైల్ 10% 1.5-2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. నాటిన వరి పొలంలో కలుపు నివారణకు ప్రెటిలాక్లోర్ 50% 500 మి.లీ. లేదా 35-45 గ్రా. ఆక్సాడయార్జిల్ లేదా బెన్ సల్ఫ్యూరాన్ మిథైల్ (0.6%) + ప్రెటిలాక్లోర్ (6% జి.ఆర్.) 4 కిలోల గుళికలు లేదా పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 70% డబ్ల్యు.డి.జి. 12 గ్రా. లేదా పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 10% డబ్ల్యు.పి. 80 గ్రా. ఎకరాకు 20 కిలోల ఇసుకలో కలిపి 3-5 రోజుల లోపు చల్లుకోవాలి. వరి నాటిన 12 రోజులకు కలుపు నివారణకు పెనాక్సులమ్ 10 గ్రా. ఎకరాకు పిచికారి చేస్తే మంచి ఫలితాలు వచ్చాయని పరిశోధనలు చెపుతున్నాయి. వరి నాటిన 15 నుండి 20 రోజుల మధ్య గడ్డిజాతి మరియు వెడల్పాకు కలుపు నివారణకు బిస్‌పైరిబాక్ సోడియం 100 మి.లీ. ఎకరాకు పిచికారి చేయాలి. వరి నాటిన 15 రోజుల తరువాత ఇథాక్సీసల్ఫ్యూరాన్ 15% డబ్ల్యు.డి.జి. ఎకరాకు 50 గ్రా. చొప్పున పొలంలో నీటిని తీసివేసి సమానంగా పిచికారి చేసి కలుపు నివారణ చేయవచ్చును. వరి నాటిన 15-20 రోజులకు కలుపు నివారణకు మెట్‌సల్ఫ్యూరాన్ మిథైల్ (10.1%) + క్లోరిమ్యురాన్ ఇథైల్ (10.1% డబ్ల్యు.పి.) 8 గ్రా. ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

నేరుగా వెదజల్లే పద్ధతిలో లేదా డ్రమ్ సీడర్‌తో వరి సాగు చేసే రైతులు ప్రెటిలాక్లోర్ + సేఫనర్ కలుపు మందును ఎకరాకు 600 మి.లీ. 3-5 రోజులలోపు 20 కిలోల ఇసుకలో కలిపి చల్లాలి లేదా పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 80 గ్రా. ఎకరాకు పిచికారి చేయాలి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గతంలో రైతుల వరి పొలాల్లో పరిశోధలను చేసినప్పుడు వరి నాటిన తరువాత 3-5 రోజులలోపు ప్రెటిలాక్లోర్ 500 మి.లీ. ఎకరాకు + 20 రోజుల తరువాత బిస్‌పైరిబాక్ సోడియం 80 మి.లీ. ఎకరాకు పిచికారి చేయటం వలన సమర్థవంతంగా కలుపు నివారణ జరిగి అధిక దిగుబడి వచ్చింది. కలుపు మందు పిచికారి చేయునప్పుడు ప్రక్కన ఉండే పొలంలోని పైర్లకు పిచికారి చేసే మందుల వలన ఏదైనా నష్టం ఉంటుందో లేదో ముందుగా తెలుసుకోవాలి. ముఖ్యంగా వరిలో 2,4-డి సంబంధిత మందులు వాడేటప్పుడు చాలా జాగ్రత్త అవసరం. ప్రక్క పొలంలో ద్విదళ బీజ పంటలైన ప్రత్తి, మిరప మొదలగునవి ఉంటే వరిలో 2,4-డి సంబంధిత కలుపు మందులు వాడరాదు. గతంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో రైతులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2,4-డి సంబంధిత కలుపు మందులు పిచికారి చేయుటకు సాధ్యమైనంత వరకు స్ప్రేయర్లను విడిగా ఉంచుకోవాలి. పిచికారి చేయుటకు సరైన నాజిల్‌ను (ఫ్లడ్‌జెట్, ఫ్లాట్ ఫాన్) వాడాలి. ఎండ మరీ ఎక్కువగా ఉన్నప్పుడు, అలాగే గాలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు కలుపు మందులు పిచికారి చేయరాదు. వరిలో కలుపు మందుల వాడకంలో సరైన సమయంలో శాస్త్రవేత్తల మరియు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు తీసుకొని ఈ వానాకాలంలో అధిక దిగుబడులు సాధిస్తారని ఆశిద్దాం.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9848199544



# వానాకాలం వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు - యాజమాన్యం

డా॥ టి.కిరణ్ బాబు, డా॥ ఎన్. ఆర్. జి. వర్మ, డా॥ పి. స్పందన భట్,
డా॥ వై. చంద్రమోహన్, డా॥ ఎల్. క్రిష్ణ మరియు డా॥ యం.వెంకట రమణ
వరి పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో వానాకాలంలో సాగయ్యే పంటల్లో వరి ముఖ్యమైన పంట. వాతావరణ శాఖ ముందస్తు అంచనాల మేరకు ఈ వానాకాలంలో వర్షాలు సాధారణంగా ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం జూలై ఆఖరు వరకు కూడా కొన్ని జిల్లాల్లో సాధారణానికి మించి 22% అధికంగా వర్షాలు కురిసాయి. ఈ వానాకాలంలో వరి విస్తీర్ణం సుమారు 40 లక్షల ఎకరాల మేరకు ఉండే అవకాశం ఉందని ముందస్తు గణంకాలు తెలుపుతున్నాయి. ఈ సంవత్సరం ప్రభుత్వం చేపట్టుతున్న నియంత్రిత వ్యవసాయ విధానంలో భాగంగా వానాకాలంలో వరిలో సన్నగింజ రకాలను ఎక్కువగా సాగు చేశారు. ముఖ్యంగా గత సంవత్సర అనుభవాలు మరియు వాతావరణ పరిస్థితులు దృష్ట్యా సన్నగింజ వరి రకాల్లో బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆగష్టు మాసంలో మొదలై సెప్టెంబర్ మాసంలో ఉధృతి అధికమయ్యే అవకాశం ఉంది. అలాగే దీర్ఘకాలిక సన్నగింజ రకాలను ముందుగా నాట్లు వేసిన జిల్లాల్లో (నిజామాబాద్, కామారెడ్డి, నల్గొండ, సూర్యపేట, మెదక్, వరంగల్ మరియు ఖమ్మం) ఆగష్టు మాసంలో దుబ్బుకట్టే దశ నుండి చిరుపొట్ట దశ వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించడానికి అవకాశం ఉంది కావున తెగులు లక్షణాలు మరియు సమగ్ర యాజమాన్యం రైతులకు సూచించడమైనది.

**లక్షణాలు:** ఈ తెగులు నారుమడి దశ నుండి చిరుపొట్ట దశ వరకు ఆశించే అవకాశం ఉంది. నారుమడి దశలో సోకితే ఆకుల చివరి నుండి క్రింది వరకు రెండు ప్రక్కల తడిసినట్లు ఉండి పసుపు రంగుకు మారి ఆకులు ఎండి చనిపోతాయి. కాని నారుమడి దశలో తక్కువ ఉధృతిలో ఆశించే అవకాశం ఉన్నది.

ప్రధాన పొలంలో పిలకల దశలో ఆశించినట్లయితే ఆకులపైన పసుపు రంగు నీటి డాగు మచ్చలు ఏర్పడి అంచుల వెంబడి అలల మాదిరిగా పైనుండి క్రింద మట్టల వరకు వ్యాప్తి చెందుతాయి. ఉదయం సమయంలో తెగులు సోకిన ఆకుల నుండి పసుపు పచ్చని జిగురు లాంటి పదార్థం పైకి వచ్చును. ఈ పదార్థం సూర్యరశ్మికి గట్టిపడి చిన్న చిన్న ఉండలుగా మారి గాలి వీచినప్పుడు ఆకు నుండి నీటిలో పడతాయి. నీటి ద్వారా బ్యాక్టీరియా ఇతర మొక్కలకు మరియు పొలాలకు వ్యాపిస్తుంది.

వరి ఈనిక దశలో ఈ తెగులు ఆశించినట్లయితే ఆకులలో హరిత పదార్థం తగ్గుట వలన కొన్ని వెన్నులు పాక్షికంగా మాత్రమే బయటకు రావటం జరుగుతుంది.

**అనుకూల పరిస్థితులు:**

అధిక వేగంతో గాలులు, ఎడతెరిపి లేకూండా చిరుజల్లులు పడటం (2-4 రోజులు), సగటు ఉష్ణోగ్రతలు 22-26 డిగ్రీల సెల్సియస్, అధిక మోతాదులో నత్రజని వాడకం లాంటి పరిస్థితులు ఈ తెగులు ఆశించడానికి అనుకూలం.

**నివారణ:** తెగులు తట్టుకొనే ఇంప్రూవ్డ్ సాంబమషూరి అనే రకాన్ని సాగుచేయాలి. ముఖ్యంగా ఆగష్టు మాసంలో కురిసే వర్షాల వలన ఈ తెగులు ఆశిస్తుంది. కావున పొలాన్ని ఎప్పటికప్పుడు గమనించాలి. అలాగే తెగులు తొలిదశ లక్షణాలు గమనించినట్లయితే నత్రజని ఎరువు వేయడం తాత్కాలికంగా నిలిపివేయాలి. తెగులు తట్టుకొనే రకాలను సాగుచేయనప్పుడు, వానాకాలంలో సాగు చేస్తున్న సన్నగింజ వరి రకాలలో నత్రజని ఎరువును 3-4 దఫాలుగా వేయాలి. ముఖ్యంగా ఈ తెగులు నీటి ద్వారా వ్యాప్తి చెందుతుంది కావున ఆశించిన పొలం నుండి మురుగు నీరు ప్రక్క పొలంలోకి పోకుండా జాగ్రత్త పడాలి. తెగులు లక్షణాలు దుబ్బు కట్టే దశ నుండి చిరుపొట్ట దశలో ఆశించినట్లయితే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. + 0.4 గ్రా. ప్లాంటామైసిన్ లేదా అగ్రిమైసిన్ లేదా పోషామైసిన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసినట్లైతే కొంతవరకు తెగులు వ్యాప్తిని నియంత్రించవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9848329394





# సోయాచిక్కుడును ఆశించు చీడపీడలు- యాజమాన్యం

**యస్. ఓంప్రకాశ్, యం. రాజేంద్రప్రసాద్, పి. మధుకర్ రావు మరియు డా॥ ఆర్. ఉమారెడ్డి**

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పొలాస, జగిత్యాల

తెలంగాణ రాష్ట్రంలో వానాకాలంలో పండించే ప్రధానమైన పంటల్లో సోయాచిక్కుడు ఒక ముఖ్యమైన పంట. ఇది నల్లరేగడి భూముల్లో వర్షాధారంగా సాగుచేయుటకు అనుకూలమైనది. స్వల్ప కాలపరిమితి (110-120 రోజులు), తక్కువ ఖర్చుతో అధిక నిఖరాదాయాన్నిస్తూ రైతుల ఆర్థిక స్వావలంభనకు బాటలు వేస్తున్నది. సోయా పంట ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలతో పాటు కరీంనగర్, వరంగల్, మెదక్ జిల్లాల్లో కొంతమేరకు సాగుచేయబడుతున్నది. తెలంగాణ రాష్ట్రంలో పండించు 5 ముఖ్యమైన పంటలు అనగా వరి, ప్రత్తి, మొక్కజొన్న, అపరాలుతో పాటు సోయాచిక్కుడు కూడా ప్రధానమైన పంట.

ఇటీవల కాలంలో సోయాచిక్కుడులో దిగుబడులు తగ్గిపోవడానికి ప్రధాన కారణాలు చూసుకొన్నట్లైతే వర్షాభావ పరిస్థితులు మరియు సమగ్ర యాజమాన్య పద్ధతులను చేపట్టకపోవడం మరియు సరియైన సమయంలో పంటలో చీడపీడలను గుర్తించి సస్యరక్షణ చర్యలను చేపట్టకపోవడం వలన రైతులు క్షేత్ర స్థాయిలో నష్టాలను ఎదుర్కొంటున్నారు. సోయా పంటను తక్కువ ఉధృతితో ఆశించే చీడపీడలు గత 4-5 సం॥లుగా ఎక్కువ ఉధృతితో ఆశించి నష్టపరుస్తున్నాయి.

### పురుగులు

**కాండం తొలిచే ఈగ :** ఈ పురుగు గ్రుడ్లను లేత ఆకులపై చిన్న గుంటలుగా చేసిపెడతాయి. గ్రుడ్ల నుండి వెలువడిన లార్వాలు (మ్యాగెట్స్) కాండంలోనికి చేరి తినడం వల్ల మొక్కలు వడలి చనిపోతాయి. కాండాన్ని చీల్చి చూసినట్లైతే క్రమం లేని ఎర్రటి సొరంగాలు కనపడతాయి. ఆలస్యంగా విత్తిన పంటలో మరియు బెట్ట పరిస్థితులలో దీని ఉధృతి ఎక్కువగా ఉంటుంది.

**నివారణ**

- కిలో విత్తనానికి 1.5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.
- ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి ఉధృతి తొలిదశలో ఉన్నప్పుడు పిచికారి చేయాలి.

**రసం పీల్చు పురుగులు (తెల్లదోమ, పేనుబంక, పచ్చదోమ మరియు తామర పురుగులు) :** పిల్ల మరియు తల్లి పురుగులు ఆకుల అడుగుభాగాన చేరి రసం పీల్చడం వల్ల మొదట ఆకులు పసుపు రంగులోకి క్రమేపి గోధుమ రంగులోకి మారి ముడుచుకుపోతాయి. అంతేకాక ఈ రసం పీల్చు పురుగులు వివిధ రకాల తెగుళ్ళకు వాహకాలుగా పనిచేస్తాయి (తెల్లదోమ ద్వారా పల్లాకు తెగులు మరియు తామరపురుగుల ద్వారా మొవ్వుకుళ్ళు తెగులు).

**నివారణ**

- కిలో విత్తనానికి 1.5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.
- తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- తామర పురుగులు, తెల్లదోమ, పేనుబంక మరియు పచ్చదోమ ఆశించినట్లైతే ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

- తెల్లదోమ మరియు పేనుబంక నివారణకు ట్రైజోఫాస్ 2.0 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పొగాకు లద్దెపురుగు :** తల్లి పురుగు గ్రుడ్లను గుంపులు గుంపులుగా ఆకుల అడుగు భాగాన పెట్టును. పిల్ల లార్వాలు ఆకులకు రంధ్రాలు చేసి ఆకులను జల్లెడాకులుగా మారుస్తాయి. పువ్వు మరియు లేత కాయలలోని గింజలను కూడా తింటాయి.

**నివారణ**

- వేసవిలో లోతైన దుక్కులు చేయాలి.
- లింగాకర్షక బుట్టలు ద్వారా మగ పురుగుల ఉధృతిపై నిఘా వేయాలి. ఎకరానికి 4 చొప్పున లింగాకర్షక బుట్టలు అమర్చాలి.
- తొలిదశలో లార్వాల నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- బాగా ఎదిగిన లార్వాల నివారణకు విషపు ఎర (క్లోరిపైరిఫాస్ 1000 మి.లీ.+ బెల్లం 1 కిలో + తవుడు 10 కిలోలు) చిన్న ఉండలుగా చేసి సాయంత్రం వేళల్లో పొలంలో చల్లుకోవాలి.

**పిండి పురుగు :** పిండి పురుగు యొక్క పిల్ల మరియు తల్లి పురుగులు కొమ్మలు, మొగ్గలు మరియు కాండం నుండి రసాన్ని పీల్చడం వల్ల మొక్కలు వాడి ఎండిపోతాయి.

**నివారణ**

- కలుపు మొక్కలైన తుత్తుర బెండ, సిడా, పార్థీనియం మొదలగునవి పిండి పురుగుకు ఆవాసమిస్తాయి. కావున గట్ల మీద కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి.
- ఈ పురుగు నివారణకు 3.0 మి.లీ. ప్రొఫెనోఫాస్ లేదా 2.0 గ్రా. ఎసిఫేట్‌తో పాటుగా 1.0 మి.లీ. జిగురు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**కాండం తొలుచే పురుగు :** తల్లి పెంకు పురుగు కాండం మీద అర్ధచంద్రాకారంలో రెండు రంధ్రములు చేసి గ్రుడ్లను పెట్టును. గ్రుడ్ల నుండి పొదిగిన గ్రబ్స్ కాండంలోనికి చొచ్చుకుపోయి లోపలి పదార్థాన్ని తినడం వల్ల కొమ్మల చివరి భాగాలు కత్తిరించినట్లు అయి చివరకు ఎండిపోయి మొక్కలు చనిపోవును.

**నివారణ**

- 5 కిలోల ఫోరేట్ 10 జి గుళికలను విత్తే ముందు సాళ్ళలో వేసుకున్న తర్వాత విత్తుకోవాలి.
- పురుగు ఉధృతిని తొలిదశలోనే గుర్తించి ప్రొఫెనోఫాస్ 2.0 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.



## తెగుళ్ళు

**ఫైటోఫ్తోరా వేరు మరియు కాండం కుళ్ళు తెగులు :** ఈ తెగులు నల్లరేగడి మరియు మురుగు నీరు పోయే సౌకర్యం లేని పొలాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఉత్తర తెలంగాణ మండలంలోని నిజామాబాద్ మరియు కరీంనగర్ జిల్లాల్లో ఈ తెగులు ఉధృతి ఎక్కువగా గమనించడమైనది.

- ఈ శిలీంధ్రం వల్ల వేసిన విత్తనాలు భూమిలోనే కుళ్ళి పోవడం లేదా మొలకెత్తిన 10-20 రోజుల తర్వాత మొక్కలు అక్కడక్కడ చనిపోవడం జరుగుతుంది.
- తెగులు ఆశించిన మొక్కల కాండం మెత్తబడి, గోధుమ వర్ణపు చారలు కాండం క్రింది భాగం నుండి పైకి కొమ్మల వరకు వ్యాపించి మొక్కలు నిలువుగా ఎండిపోయి చనిపోతాయి.

**మాక్రోఫోమినా వేరుకుళ్ళు తెగులు :** ఈ తెగులు వలన మొక్కల వేర్ల మీద నల్లటి మచ్చలు ఏర్పడి 30-35 రోజులలో మొక్కలు ఎండి చనిపోవును. పొడి వాతావరణంలో ఈ తెగులు వ్యాప్తి అధికంగా ఉంటుంది.

**నివారణ**

- పంటమార్పిడి పద్ధతి పాటించడం
- పొలంలో నీరు నిల్వకుండా ఉండేలా చూసుకోవాలి.
- తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్న పొలాల్లో అలాగే 3 గ్రా. మెటలాక్సిల్ లేదా కాప్టాన్ కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.

**ఆంత్రాక్నోస్ తెగులు :** గాలిలో అధిక తేమ శాతం ఈ తెగులు వ్యాప్తికి అనుకూలంగా ఉంటుంది. తెగులు సోకిన ఆకులు మరియు కాయలపైన నల్లటి వలయాకార మచ్చలు ఏర్పడతాయి. కాయలలో గింజలు పూర్తిగా ఏర్పడక, చిన్నవిగా మారి వంకర తిరుగుతాయి. కాయలు వివిధ వర్ణాలలోకి మారి తప్పలుగా మారుతాయి.

**నివారణ**

- విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రా. కాప్టాన్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.
- తెగులు తొలిదశలో కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ 2.5 గ్రా. కలిపి ఉన్న మందును రెండుసార్లు 10 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

**ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు :** గాలిలో అధిక తేమ శాతం మరియు వర్షపాతం ఉన్నప్పుడు ఈ తెగులు ఉధృతి అధికంగా ఉంటుంది. ఆకుల మీద చిన్న చిన్న మచ్చలు ఏర్పడి క్రమేపి ఒకదానితో ఒకటి కలిసిపోయి ఆకులు ఎండిపోయి రాలిపోతాయి.

**నివారణ :** ఈ తెగులు నివారణకు కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ కలిపి ఉన్న మందును 2.5 గ్రా. లేదా క్లోరోథలోనిల్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో అవసరాన్ని బట్టి రెండు సార్లు పిచికారి చేయాలి.

**పల్లాకు తెగులు :** తెగులు సోకిన ఆకులు మొత్తం పసుపు రంగులోకి మారుతాయి. తెగులు సోకిన మొక్కలలో కాయలు ఏర్పడవు. ఈ తెగులు కారక వైరస్ తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది.

**యాజమాన్యం**

- పల్లాకు తెగులు తట్టుకొనే రకాలు పి.ఎస్. 416, పి.ఎస్ 564, పి.ఎస్ 1024, పి.ఎస్. 1029, యస్.యల్.295 మొదలగునవి వేసుకోవాలి.
- కిలో విత్తనానికి 1.5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్. ఎస్. కలిపి విత్తనశుద్ధి చేయాలి.
- తెల్లదోమ ఉధృతి తగ్గడానికి ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ట్రైజోఫాస్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**సోయాబీన్ మొజాయిక్ వైరస్ తెగులు**

- విత్తనం ద్వారా వ్యాప్తి చెందే అతి ముఖ్యమైన తెగులు.
- తెగులు సోకిన మొక్కలు కురచగా ఉండి, ఆకులు వంకరగా తిరిగి సన్నగా ఉంటాయి. కాయలు సరిగా ఏర్పడవు.
- పేనుబంక కొంత వరకు ఈ వైరస్ తెగులును వ్యాప్తి చేస్తుంది.

**నివారణ**

- తెగులు సోకని ప్రాంతాల నుండి విత్తనం సేకరించాలి.
- గట్లపై కలుపు మొక్కలు లేకుండా చూడాలి.
- పేనుబంక నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.




























ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. **9866373563**

# ప్రత్తి పంట తొలిదశలో ఆశించే రసం పీల్చే పురుగులు - యాజమాన్యం

డా॥ బి. రాంప్రసాద్, ఎ. సుదర్శనమ్, డా॥ వి. తిరుమలరావు, డి. అశ్విని,
బి. మాధవి మరియు డా॥ పి. జగన్మోహన్ రావు
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్


కాండానికి మందు పూత




పేనుబంక


వేరుకుళ్ళు తెగులు


తామర పురుగులు

ఈ సంవత్సరం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్తి పంటను ఇప్పటి వరకు అనగా జూలై మొదటి వారం వరకు సుమారుగా 18 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో విత్తుకోవడం జరిగినది. ప్రస్తుతం ప్రత్తి పంట చాలా చోట్ల 15 నుండి 20 రోజుల దశలో ఉన్నది. ఈ సంవత్సరం గత సంవత్సరం కంటే భిన్నంగా అధిక వర్షాలతో పాటుగా అధిక ఉష్ణోగ్రతలు కూడా ఉండటం వలన ప్రత్తి పంట తొలిదశలోనే చాలా చోట్ల తామరపురుగులు, పేనుబంక మరియు వేరుకుళ్ళు తాకిడి వలన రైతులు ఇబ్బందులను ఎదుర్కొవడం గమనించడం జరిగినది. ప్రస్తుత తరుణంలో పంట తొలిదశలో ఆశించే రసం పీల్చే పురుగులు మరియు వాటి నియంత్రణ పద్ధతులను గూర్చి ఈ క్రింద వివరించడం జరిగినది.

**తామర పురుగులు:** ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలతో పాటు నెలకొన్న అధిక మధ్యాహ్న ఉష్ణోగ్రతల వలన ప్రత్తి పంట తొలి రెండు ఆకుల దశ నుండే తామరపురుగు పిల్ల, తల్లి పురుగులు ఆకుల అడుగుభాగాన చేరి రసం పీల్చడం వలన ఆకులు ముడుచుకొని పోవడం మరియు రెండు ఆకుల మధ్య ఉన్న లేత కొన మొగ్గ నుండి రసాన్ని పీల్చడం వలన మొక్క పెరుగుదల కుంటుపడటంతో పాటు, తర్వాత దశలో మొక్క పెరుగుదల అస్తవ్యస్తంగా ఉండటంతో పాటు చాలా వరకు దిగుబడులు తగ్గే అవకాశమున్నది. నివారణకు తొలిదశలో 5 శాతం వేపగింజల కషాయం లేదా వేపనూనె (1500 పి.పి.యం) 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతే ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా సల్ఫాక్సాఫ్లోర్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి మొక్కలపైన మరియు భూమి మీద పిచికారి చేయాలి. దీని ద్వారా తామర పురుగులు బాగా నియంత్రించబడతాయి.

**పేనుబంక :** అధిక వర్షాలతో బాటు మధ్య మధ్యలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు మరియు అధిక ఉష్ణోగ్రతలు పేనుబంక ఆశించటానికి అనుకూలమైన పరిస్థితులు, పేనుబంక తల్లి, పిల్ల పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడం వలన ఆకులు దొప్పలుగా మారి మొక్క పెరుగుదల గిడసబారడం జరుగుతుంది తద్వారా దిగుబడులు కూడా తగ్గే అవకాశమున్నది. పేనుబంకకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ఉన్నట్లైతే

పంటకాలంలో 20-25 జీవిత చక్రాలను పూర్తి చేసుకునే అవకాశమున్నది. పేనుబంకతో పాటు మిత్ర పురుగులైన అక్షింతల పురుగుల సంఖ్య కూడా పెరిగే అవకాశమున్నది. కావున మందుల పిచికారి అవసరం ఉండదు. ఒకవేళ పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతే సస్యరక్షణ చర్యలను చేపట్టాలి. తొలిదశలో 5 శాతం వేపకషాయం లేదా వేపనూనెను పిచికారి చేయాలి. పంట 30 రోజుల దశలో ఉన్నట్లైతే కాండానికి మందు పూత పద్ధతి ద్వారా పేనుబంకను సమర్థవంతంగా నివారించుకోవచ్చును. దీనికి గాను ఎసిటామిప్రిడ్, నీరు 1:20 నిష్పత్తిలో లేదా ఫ్లోనికామిడ్, నీరు 1:20 నిష్పత్తిలో కలుపుకొని కాండానికి పైన ఉన్న లేత ఆకుపచ్చ భాగంలో 15 రోజుల వ్యవధిలో 2 సార్లు మందు పూత పూసినట్లైతే పేనుబంకను సమర్థవంతంగా నివారించుకోవచ్చును. ప్రత్యామ్నాయంగా లీటరు నీటికి 0.2 గ్రా. ఎసిటామిప్రిడ్ లేదా 0.3 గ్రా. ఫ్లోనికామిడ్ కలిపి పిచికారి చేసుకోవచ్చు.

**పచ్చదోమ :** ప్రస్తుతం ప్రత్తిలో పచ్చదోమ ఉధృతి చాలా తక్కువగా ఉన్నది. కానీ మబ్బులతో కూడుకున్న అధిక వర్షాలు కురిసే వాతావరణంలో దీని ఉధృతి బాగా పెరిగే అవకాశమున్నది. పచ్చదోమ తల్లి, పిల్ల పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చటం వలన ఆకుల అంచులు మొదట పసుపు రంగులోకి మారి తర్వాత దశలో ఎరుపు రంగులోకి మారి, ఆకులు పూర్తిగా డొప్పలు తిరిగి ఎండిపోతాయి. తద్వారా పూత కూడా రాలే అవకాశమున్నది. దీని నివారణకు తొలిదశలో అనగా విత్తిన 30,45,60 రోజుల వరకు కాండానికి మందు పూత (ఫ్లోనికామిడ్, నీరు 1:20 నిష్పత్తిలో, మోనోక్రోటోఫాస్, నీరు 1:4 నిష్పత్తిలో) పద్ధతి ద్వారా పచ్చదోమను సమర్థవంతంగా నివారించుకోవచ్చును. ప్రత్యామ్నాయంగా పై పురుగు మందులను పిచికారి కూడా చేసుకోవచ్చు (మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రా. లీటరు నీటికి). పైన తెలిపినటువంటి రసం పీల్చే పురుగులతో పాటు, కొన్ని చోట్ల అధిక వర్షాలకు మొక్కలు గుంపులు గుంపులుగా ఎండిపోయి చనిపోవడం గమనించడం జరిగినది దీనిని వేరుకుళ్ళు తెగులుగా గుర్తించడం జరిగింది. తెగులు సోకిన మొక్కలలోని ఆకులు పైనుండి క్రిందకు వాడిపోయి వ్రేలాడుతూ ఉంటాయి మరియు తెగులు సోకిన మొక్కలను తేలికగా పీకి వేయవచ్చును. భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు ఈ తెగులు పైరు అన్ని దశలలో కనబడుతుంది. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ 2.0 గ్రా. లీటరు నీటికి కలిపి తెగులు సోకిన మొక్కల మొదళ్ళ చుట్టూ వేరు వ్యవస్థ బాగా తడిచేలా పోసుకోవాలి. దీనికి తోడు సిఫారసు చేసిన పొటాష్ ఎరువులను తప్పక వాడాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **9963073087**

## మీకు తెలుసా?

**గోల్డ్ ఫిష్‌ని కొన్ని గంటల పాటు చీకట్లో వదిలేస్తే బూడిద రంగులోకి మారిపోతుంది**









# పోషకాల ఆధారిత ఎరువుల యాజమాన్యం

డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, కె. రామకృష్ణ, బి. రాజశేఖర్, యం. రాజశేఖర్, ఆదిశంకర్ మరియు అఫీఫా జహాన్
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం

పంటల సాగుకు ప్రధానంగా ఎరువులు అవసరం. రైతుల పంటల సాగుకు పెట్టే పెట్టుబడిలో ఎక్కువగా రసాయన ఎరువులపైనే వెచ్చిస్తున్నారు. దీంతో ఖర్చు పెరగడంతో పాటు నేల ఉత్పాదక శక్తి తగ్గిపోయి, నిర్జీవమై సాగుకు పనికి రాకుండా పోతుంది. ప్రస్తుతం రైతులు సూటి ఎరువుల కంటే కాంప్లెక్స్ ఎరువులపై ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. రసాయన ఎరువులను ఎంపిక చేసుకునేటప్పుడు అందులోని పోషక మోతాదు మరియు దాని ధరను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రస్తుతం ఒక బస్తా యూరియా (45 కిలోలు) ధర రూ॥ 268/- గా ఉంది. బస్తా యూరియాలో 21 కిలోల నత్రజని ఉంటుంది. కిలో నత్రజని ధరను లెక్కించినట్లయితే రూ॥ 13/- గా ఉంటుంది. అదే విధంగా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ధర రూ॥ 450/- ఇందులో 8 కిలోల భాస్వరం ఉంటుంది. కాబట్టి కిలో భాస్వరం ఖరీదు రూ॥ 56/- గా లెక్కించబడింది. అలాగే మ్యూరేట్ ఆఫ్ పొటాష్ బస్తా ధర రూ॥ 950/- ఇందులో 30 కిలోల పొటాష్ పోషకం ఉంటుంది. కిలో పొటాష్ ధర లెక్కిస్తే రూ॥ 32/-. ఈ మూడు సూటి ఎరువులు ఒక్కొక్క బస్తాగా వేసినట్లయితే మొత్తం 59 కిలోల పోషకాలు నత్రజని, భాస్వరం మరియు పొటాష్ రూపంలో మొక్కకు అందుతాయి. అప్పుడు ఒక కిలో పోషకం ధర 28 రూపాయలుగా పడుతుంది.

అదేవిధంగా కాంప్లెక్స్ ఎరువుల ధరలు వాటిలోని పోషకాల మోతాదును పరిశీలించినట్లయితే బస్తా డి.ఎ.పి. ధర రూ॥ 1200/-. అందులో ఉండే నత్రజని మరియు భాస్వరం పోషకాల మోతాదును కలిపితే 32 కిలోలు. కిలో పోషక ధరను లెక్కిస్తే రూ॥ 38/- గా ఉంటుంది. అలాగే 20-20-0-13 ఎరువు ధర అందులో ఉండే పోషకాల మోతాదును బట్టి లెక్కిస్తే కిలో పోషకం ధర రూ॥ 37/- వరకు ఉంటుంది. అలాగే 12-32-16 రసాయన ఎరువులో కిలో పోషకం ధర రూ॥ 39/- వరకు మరియు 14-35-14 ఎరువులో కిలో పోషకం ధర రూ॥ 40/- వరకు ఉంటుంది.

| రసాయన ఎరువు | 50 కిలోల బస్తా ధర (రూ॥) | 50 కిలోల బస్తాలో పోషక మోతాదు (కిలోలు) | కిలో పోషక ధర (రూ॥) |
|---|---|---|---|
| యూరియా (45 కిలోలు) | 268 | 21 | 13 |
| సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ | 450 | 8 | 56 |
| మ్యూరేట్ ఆఫ్ పొటాష్ | 950 | 30 | 32 |
| డి.ఎ.పి. | 1200 | 32 | 38 |
| 20-20-0-13 | 975 | 26 | 37 |
| 12-32-16 | 1175 | 30 | 39 |
| 14-35-14 | 1250 | 32 | 40 |

పంటకు కావలసిన పోషకాలను సూటి ఎరువుల రూపంలో అందిస్తే కిలో పోషక ధర రూ॥ 28/- గా ఉంటే, కాంప్లెక్స్ ఎరువులలోని పోషకాల ఆధారిత ధర లెక్కించినట్లయితే కిలో పోషకం ధర రూ॥ 38/- నుండి 40/- వరకు ఉంటుంది. అంటే ఒక బస్తా రసాయన ఎరువును కాంప్లెక్స్ ఎరువుల రూపంలో వేయడం వలన రూ॥ 300/- వరకు అధికంగా ఖర్చు చేయవలసి వస్తుంది మరియు అన్ని పోషకాలు అందవు. అందువలన రైతులు కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించి సూటి ఎరువులను వాడటం వలన ఖర్చు తగ్గడమే కాకుండా మొక్కకు అన్ని రకాల పోషకాలు అనుకున్న సమయంలో లెక్కించిన మోతాదులో వేసుకోవచ్చు. ప్రస్తుతం నేలల్లో భాస్వరం మోతాదు ఎక్కువగా ఉన్నందున భాస్వరం మోతాదు ఎక్కువగా ఉండే కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాల్సిన అవసరం ఉంది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9848774820



# జోనల్ స్థాయిలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ రాష్ట్రీయ కృషి విజ్ఞాన్ ప్రోత్సాహన్ పురస్కార్ అవార్డును పొందిన కృషి విజ్ఞాన కేంద్రం, వైరా

భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఏఆర్) 92వ వ్యవస్థాపక దినోత్సవం సంధర్భంగా జూలై 16వ తేదీన వివిధ రంగాలలో అత్యున్నత ప్రతిభను కనబరచిన వ్యవసాయ శాస్త్రవేత్తలకు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు, కృషి విజ్ఞాన కేంద్రాలకు, వ్యవసాయ విద్యార్థులకు మరియు అధ్యాపకులకు పురస్కారాలను అందజేసారు.

రైతులకు ఉత్తమ విస్తరణ, వైజ్ఞానిక సేవలు అందించినందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఖమ్మం జిల్లా వైరా కృషి విజ్ఞాన కేంద్రం (జోన్ - 10లో) ప్రతిష్టాత్మకమైన "పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ రాష్ట్రీయ కృషి విజ్ఞాన్ ప్రోత్సాహన్" అవార్డును పొందింది. ఢిల్లీ నుంచి డిజిటల్ పద్దతిలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి గౌ॥ శ్రీ నరేంద్రసింగ్ తోమర్ ఈ అవార్డును ప్రకటించారు. వ్యవసాయ రంగానికి శాస్త్ర మరియు సాంకేతిక పరంగా విస్తృతంగా చేసిన సేవలే ముఖ్యంగా రైతాంగానికి ఒనగూరిన లాభాలే ఈ పురస్కార సాధనకు ముఖ్య కారణం. కృషి విజ్ఞాన కేంద్రం, వైరా 2004 లో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో స్థాపించబడింది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ నందు గల ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోకి రావడం జరిగింది. వైరా కృషి విజ్ఞాన కేంద్రానికి అవార్డు రావడం పట్ల ఉపకులపతి డాక్టర్ వి. ప్రవీణ్ రావు హర్షం వ్యక్తం చేశారు. వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఉత్తమ సేవలు అందించిన వైరా కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డా॥ జె. హేమంత్ కుమార్‌ను, కె.వి.కె. లో పనిచేస్తున్న ఇతర శాస్త్రవేత్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. జోన్ - 10 పరిధిలో 71 కృషి విజ్ఞాన కేంద్రాలు ఈ అవార్డుకు పోటి పడగా, వైరా కృషి విజ్ఞాన కేంద్రం ఈ అవార్డుకు ఎంపిక కావడం గర్వకారణం అన్నారు. వైరా కె.వి.కె. ను మిగతా వారు స్ఫూర్తిగా తీసుకొని రైతులకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అలాగే, జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో మెట్ట-మాగాణి వరిసాగు విధానంలో వరి సాగు చేయడమే కాకుండా సోషల్ మీడియా ద్వారా ఇతర జిల్లాల రైతులను కూడా ఈ పద్దతి వైపు మళ్ళించేందుకు చేసిన కృషికి గానూ ఐ.సి.ఏ.ఆర్. అవార్డు పొందిన జమ్మికుంట కె.వి.కె. పరిధికి చెందిన మహిళా రైతు ఆర్. లక్ష్మిని కూడా ఉపకులపతి అభినందించారు. ఈ అవార్డుతో పాటు ఏడున్నర లక్షల రూపాయల నగదు ప్రోత్సహకాన్ని, ప్రశంసాపత్రాన్ని ఐ.సి.ఏ.ఆర్. అందజేసింది.





Indian Council of Agricultural Research

ICAR

Certificate

PANDIT DEENDAYAL UPADHYAY RASHTRIYA KRISHI VIGYAN PROTSHAHAN PURASKAR-2019

(Zone X)

is presented to

Krishi Vigyan Kendra, Wyra, Khammam

Telengana

16 July, 2020
New Delhi

(T. Mohapatra)
Secretary (DARE) &
Director General (ICAR)

(Narendra Singh Tomar)
Agriculture & Farmers Welfare Minister, GoI
& President, ICAR Society





రైతులకు వివిధ సాంకేతికాలను అందజేయటంలో ఖమ్మం జిల్లాలో ఈ కేంద్రం పేరుగాంచింది. వివిధ పంటలలో తక్కువ పెట్టుబడితో కూడిన సాంకేతికతను రైతుకు పరిచయం చేసి, అవి రైతులు అమలు చేసేలా వివిధ శిక్షణా కార్యక్రమాలను, ప్రదర్శనా క్షేత్రాలను, క్షేత్ర ప్రదర్శనలను రైతులకు నిర్వహించారు. జిల్లా నందు గల ఇతర శాఖలు అనగా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ మరియు పశుసంవర్ధక శాఖ నందు గల అధికారులతో సమేకమై పనిచేయుట తద్వారా జిల్లా నందు గల మారుమూల గ్రామాలలోని రైతులకు కూడా చేరుకోగలిగే



వరకు సేవలను అందించగలిగారు. ఆపత్కాల సమయాలైనటువంటి వివిధ ప్రకృతి వైపరీత్యాలు – అధిక వర్షాలు, కరువు, చీడపీడల సమస్యలు, నేటికాలంలో సంభవిస్తున్న వాతావరణ మార్పులు ముఖ్యంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం, ఇలాంటి వివిధ క్లిష్ట పరిస్థితులలో రైతాంగానికి సాంకేతికతను తెలియపరిచి తద్వారా రైతులకు సేవ చేయడంలో కెవికె వైరా ఎప్పుడు ప్రథమ స్థానంలోనే ఉంటుంది. ఖమ్మం జిల్లా నందు వివిధ మండలాలు, గ్రామాల నందు గల రైతులు కెవికె శాస్త్రవేత్తల యొక్క సలహాలను ఫోన్ ద్వారా గానీ నేరుగా గానీ సంప్రదించి తెలుసుకుంటూ ఉంటారు.

## కృషి విజ్ఞాన కేంద్రం, వైరా గత ఐదేళ్ళలో వివిధ పంటలలో రైతులకు చేరవేసిన ముఖ్య సాంకేతికతలు:–

జిల్లాలో ప్రధాన ఆహార పంటైన వరిలో నాటు వేసే పద్ధతికి బదులుగా వివిధ రకాలైన వరి సాగు పద్ధతులపై ప్రాచుర్యం కల్పించారు. మెట్ట– మాగాణి వరి సాగు, నేరుగా దమ్ములో వరి విత్తనాలు విత్తి సాగుచేయటం వంటివి బాగా రైతులు ఆచరించేలా కృషి చేసారు తద్వారా రైతుకు పెట్టుబడి ఖర్చులు తగ్గి నికరాదాయం పెరగడానికి తోడ్పడ్డారు.



- చౌడు నేలల్లో సాగుకు వీలైనటువంటి వరి రకం – సిద్ధి (డబ్ల్యుజియల్ 44) రకం విత్తనోత్పత్తి ద్వారా రైతులకు నిత్యం అందుబాటులో ఉంచారు.
- వాణిజ్యపంటల్లో ముఖ్యమైనది అయిన ప్రత్తిలో రసం పీల్చు పురుగుల నష్టాన్ని తగ్గించు కొనుటకుగానూ తక్కువ ఖర్చుతో కూడిన రోలింగ్ స్టెవ్ం అప్లికేటర్ పరికరాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చి తద్వారా తక్కువ మందును ఉపయోగిస్తూ మంచి ఫలితాలను పొందేట్లు రైతులకు తోడ్పడ్డారు, తక్కువ మోతాదులో కీటకనాశనులను వాడటం వలన రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు వాతావరణ కాలుష్యం కూడా తగ్గించడానికి ప్రయత్నం చేశారు.
- మొక్కజొన్నలో నూతన విధానలైనటువంటి జంట సాళ్ళ మొక్కజొన్న, జిరో టిల్లేజ్ పద్ధతి వంటివి రైతులకు బాగా అవగాహన కల్పించి రైతులు పాటించటానికి తోడ్పడ్డారు. అపరాలైన కంది, పెసర, మినుములో చీడపీడలను తట్టుకొనే వివిధ నూతన రకాలను రైతులకు సాగు చేయటంలో తోడ్పడ్డారు. అపరాల సాగుపై పూర్తి అవగాహన కొరకు క్లస్టర్ డెమోన్ట్రేషన్ను నిర్వహించారు. ప్రత్తిలో అంతరపంటగా కంది సాగుని తేలికపాటి నేలల్లో ప్రోత్సహించారు.
- చెఱకులో జంట సాళ్ళ పద్ధతి, వరి మాగాణుల్లో జనుము విత్తనోత్పత్తి వంటివి రైతాంగం నందు బాగా ప్రాచుర్యం పొందేలా కృషి చేసారు. ఉద్యాన పంటల్లో టమాటలో ట్రెల్లీస్ పద్ధతిలో సాగు చేయడం, మల్చింగ్ మరియు డ్రిప్ విధానంలో సాగు చేయుట, మామిడి, జామలో మేలైన యాజమాన్య పద్ధతులను రైతులకు అందుబాటులోకి తెచ్చారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పాడి–పరిశ్రమ, కోళ్ళ పెంపకం వంటివి రైతుల మనుగడకు ముఖ్యం గనుక “రాజశ్రీ” కోళ్ళ పెంపకం, అజోల్లా దాణా వంటి వాటిపై రైతులకు శిక్షణ కార్యక్రమాలు, ప్రదర్శనా క్షేత్రాలు ఏర్పర్చి రైతులకు అవగాహన కల్పించి పాటించడానికి కృషి చేశారు. ఇవే కాకుండా గిరిజన మహిళలకు, యువతకు పలు నైపుణ్య శిక్షణలను నిర్వహించి వ్యవసాయంతో పాటుగా స్థిరమైన ఆదాయం పొందుటకు తోడ్పడి తద్వారా వారి జీవనోపాధి పెంపొందించుటకు తోడ్పడ్డారు.

# ప్రత్తిని ఆశించు తెగుళ్ళు - యాజమాన్యం

డా|| జె. హేమంత్ కుమార్, డా|| పి. శ్రీరంజిత, డా|| కె. రవి కుమార్ మరియు డా|| పి. జగన్మోహనరావు
కృషి విజ్ఞాన కేంద్రం, వైరా

తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్న ప్రధానమైన వాణిజ్య పంట ప్రత్తి. ఈ వానాకాలంలో దాదాపుగా 24 లక్షల హెక్టార్లలో ప్రత్తిని సాగు చేస్తున్నారు. ప్రస్తుత ప్రత్తి సాగులో రైతులు దాదాపుగా బి.టి. ప్రత్తి హైబ్రిడ్లనే సాగు చేస్తున్నారు గనుక కాయ తొలుచు పురుగుల ఉధృతి తగ్గినప్పటికీ మారుతున్న వాతావరణం రీత్యా వివిధ రకాల తెగుళ్ళు పంటను ఆశించి నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ తెగుళ్ళ యొక్క లక్షణాలను, నివారణ చర్యలను సరియైన యాజమాన్య పద్ధతుల ద్వారా, సమగ్ర సస్యరక్షణ చర్యలు ద్వారా సమయానుకూలంగా చేపట్టినట్లయితే పంటను తెగుళ్ళ వల్ల కలిగే నష్టం నుండి కాపాడుకొని మంచి దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంది.

**ఫుజేరియం వడలు తెగులు:** ఈ తెగులు ప్రత్తి అన్ని దశలలో కనిపిస్తుంది. మొలక దశలో ఆశించినపుడు నానుడు తెగులు లక్షణాలు కనిపిస్తాయి. ఎదిగిన మొక్కలలో పుష్పించే దశలలో ఈ తెగులు ఎక్కువగా కనిపిస్తుంది. తెగులు సోకిన మొక్కలు ఆకులు వాడిపోయి, మొదట ఈనెల మధ్య పసుపు రంగుగా మారి తదుపరి ఎర్రగా మారి ఆకులు క్రింద నుండి పైకి ఎండుకుంటూ రాలిపోతాయి.

ప్రథమంగా మొక్క క్రింది భాగంలోని ముదురు ఆకులను ఆశించి తరువాత పైభాగంలోని లేత ఆకులకు వ్యాపిస్తుంది. తెగులు సోకిన మొక్కలు పూర్తిగా లేదా పాక్షికంగా ఎండిపోతాయి. లేత దశలో తెగులు ఆశిస్తే మొక్కలు గిడసబారతాయి. ముదురు దశలో గనుక ఆశిస్తే మొక్క గిడసబారి చిన్న కాయలుగా ఉండి అవి త్వరగా పగులుతాయి. ఎండిన మొక్కల కాండం మొదలు భాగం చీల్చి పరిశీలిస్తే గోధుమ వర్ణపు నిలువు చారలు కనిపిస్తాయి.

**యాజమాన్యం:**

- తెగులు సోకిన మొక్కలను తీసివేసి కాల్చి నాశనం చేయాలి.
- భూమిలో పొటాష్ ధాతు లోపం లేకుండా చూసుకోవాలి, నత్రజని మరియు భాస్వరపు ఎరువులను సమతుల్యంగా వాడాలి.
- తెగులు సోకిన మొక్కల మొదళ్ళలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి మొక్క మొదళ్ళలో పోయాలి.
- ప్రత్తి తర్వాత జొన్న లేదా మొక్కజొన్న వంటి పంటలతో పంట మార్పిడి చేయాలి.
- కిలో విత్తనానికి 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడెతో విత్తనశుద్ధి చేయాలి.
- ట్రైకోడెర్మా విరిడె జీవన ఎరువును రెండు కిలోల చొప్పున 90 కిలోల బాగా చివికిన పశువుల ఎరువును మరియు 10 కిలోల వేపపిండి కలిపి 15 రోజుల పాటు మాగబెట్టి భూమిలో వేసి కలియ దున్నాలి.

**వర్టిసీలియం వడలు తెగులు:** ఈ తెగులు ఎదిగిన మొక్కలలో పుష్పించే దశలో ఆశిస్తుంది. తెగులు సోకిన మొక్కల ఆకుల ఈనెల మధ్య పసుపు రంగుకు మారి, తెగులు తీవ్రమైనప్పుడు కణాలు చనిపోయి పెద్ద పెద్ద నల్లని మచ్చలు ఏర్పడి ఆకులపై పులి చారలు వలె కన్పిస్తాయి. ఆకులు కొంత కాలం వేలాడి, పూర్తిగా రాలాక క్రింది భాగంలో ఉన్న మొగ్గలు క్రొత్త ఆకులను, కొమ్మలను ఇస్తాయి కానీ కాయలు ఏర్పడవు. కాండము మరియు వేరుని చీల్చి చూస్తే లోపల గోధుమ రంగుకు మారి ఉంటుంది. క్రింది నుండి పైకి ఆకులు మాడిపోవడంతో పాటుగా ఆకు బాగా రాలిపోతుంది.

**యాజమాన్యం:**

- తెగులు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి.
- ప్రత్తి తర్వాత జొన్న లేదా మొక్కజొన్నతో పంట మార్పిడి చేయాలి.
- నత్రజని, పొటాష్ ఎరువులను సిఫారసు మేరకే వాడాలి.
- తెగులు ఆశించిన మొక్కల మొదళ్ళలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పోయాలి.
- కిలో విత్తనానికి 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడెతో విత్తనశుద్ధి చేయాలి.

**బూడిద తెగులు/బూజు తెగులు:**

- ఈ తెగులు సాధారణంగా డిసెంబర్ - జనవరి మాసాలలో వాతావరణంలో అధిక తేమ ఉన్నప్పుడు ముదురు పైరు మీద కాయలు ఏర్పడిన తరువాత కనిపిస్తుంది.

- ముదురు ఆకుల క్రింది భాగాన కోణాకారపు తెల్లటి మచ్చలు ఏర్పడి బూజు తెగులు శిలీంధ్రబీజాలు ఆకుల అడుగు భాగాన ఏర్పడతాయి.
- ఉధృతి ఎక్కువైనప్పుడు బూజు తెగులు ఆకుల పైభాగానికి కూడా వ్యాపించి ఆకులు పసుపు రంగులోకి మారి పండుబారి రాలిపోతాయి.

**యాజమాన్యం:** తెగులు నివారణకు లీటరు నీటిలో కరిగే గంధకం 3.0 గ్రా. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా టెబ్యుకొనజోల్ + ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 0.6 గ్రా. కలిపి పిచికారి చేయాలి.

**వేరు కుళ్ళు తెగులు:**

- భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు ఈ తెగులు ఆశిస్తుంది.
- శిలీంధ్రం సాధారణంగా లేత మొక్కలను (ఒకటి/రెండు వారాల) ఆశిస్తుంది. మొక్క మొదళ్ళలో నల్లటి నీటి చుక్కలా ఏర్పడి అవి కాండమును తొలచి మొక్కలు పొలంలో గుంపులు గుంపులుగా చనిపోతాయి.
- అర్థాంతరంగా మొక్క పూర్తిగా ఎండి పోవడం ఈ తెగులు యొక్క ముఖ్య లక్షణం.
- మొక్కలోని అన్ని ఆకులు పైనుండి క్రింది భాగం వరకు వడలిపోయి వేలాడుతూ ఉంటాయి. ఒక్క రోజులోనే మొక్క అర్థాంతరంగా చనిపోతుంది.
- తెగులు సోకిన మొక్కలను తేలికగా పీకి వేయవచ్చును.
- ఎదిగిన మొక్కలు వడలిపోయి ఆకులు పండు బారి రాలిపోతాయి.
- వేర్లపై ఉండే బెరడు పగిలి పీకలుగా పోతుంది. పీచు వేళ్ళు కుళ్ళిపోయి ఊడిపోతాయి. అప్పుడే ఎండిపోయిన చెట్టు వేరు చివరి భాగం కొద్దిగా తడిగా, జిగటగా ఉంటుంది.
- మొక్క మొదలు భాగంలో ఉన్న బెరడును తీసి చూస్తే లోపల కొయ్య భాగం ముదురు గోధుమ రంగులో కనిపిస్తుంది.
- తెగులు సోకిన మొక్కల బెరడులో అతి చిన్నవైన నల్లని స్క్లీరోషియా కనిపిస్తాయి.

**యాజమాన్యం:**

- ట్రైకోడెర్మా విరిడె – 10 గ్రా. లేదా సుడోమోనాస్ ఫ్లోరిసెన్స్ 10 గ్రా. కిలో విత్తనానికి పట్టించి విత్తనశుద్ధి చేయాలి.
- పశువుల ఎరువు ఎకరానికి 2.5 ట. ఆఖరి దుక్కిలో వేయాలి.
- వేసవి దుక్కులు చేయడం వలన సూర్యరశ్మి తాకిడికి శిలీంధ్రబీజాలు నశిస్తాయి.
- జొన్న వంటి పంటలను అంతర పంటలుగా సాగు చేయాలి.


బ్యాక్టీరియా నల్ల మచ్చ తెగులు


వర్టీసీలియం వడలు తెగులు


ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు


వేరు కుళ్ళు తెగులు


ఫుజేరియం వడలు తెగులు


బూజు తెగులు


ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు


వేరు కుళ్ళు తెగులు









- తెగులు ఆశించిన మొక్కల మొదళ్ళలో మరియు చుట్టూ ఉన్న మంచి మొక్కలకు 1 లీ. నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పాదుల చుట్టూ పోసినట్లయితే తెగులు వ్యాప్తిని అరికట్టవచ్చు.

**ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు (లేదా) ఆల్టర్నేరియా కాండం మచ్చ తెగులు:**

- ఈ తెగులు మొక్క అన్ని దశలలో వ్యాపిస్తుంది.
- ఆకుల మీద గోధుమ రంగు మచ్చలు వలయకారపు సుడులుగా, రింగులుగా ఏర్పడతాయి.
- తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు తరువాత దశలో కాయల మీద కూడా మచ్చలు కనబడతాయి.
- ఆకుమచ్చ తెగులు మబ్బులతో కూడిన వర్షపు వాతావరణంలో ఎక్కువగా వ్యాపిస్తుంది.
- కాండం మచ్చ తెగులుకు చేనులో అక్కడక్కడ సుడులు సుడులుగా పిడుగుపాటుకు మొక్కలు ఎండిపోయినట్లుగా కనబడుతుంది.
- వ్యాధి తీవ్రత ఎక్కువైనప్పుడు ఆకు మధ్య ఈనె, కాడలు మరియు కాండము పైన నల్లని మచ్చలు ఏర్పడి నిర్జీవంగా కనబడతాయి.
- కాండం, కొమ్మ భాగాలు పెళుసుగా మారతాయి.
- బెట్ట వాతావరణం ఉండి అధిక వర్షాలు కురిసినపుడు ఈ వ్యాధి సోకే అవకాశం ఉన్నది.

**యాజమాన్యం:**

- వేసవి లోతు దుక్కులు చేయాలి.
- ట్రైకోడెర్మా విరిడె కిలో విత్తనానికి 10 గ్రా. చొప్పున విత్తనశుద్ధి చేయాలి.
- తెగులు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి.
- తెగులు నివారణకు ప్రొపికొనజోల్ 1.0 మి.లీ. లేదా కాప్టాన్ + హెక్సాకొనజోల్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి 5 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలి.

**సెర్కోస్పోరా ఆకు మచ్చ తెగులు:**

- ఈ తెగులు ఎక్కువగా ముదురు ఆకుల మీద పంట చివరి దశలో కనబడుతుంది.
- ఆకుల మీద గోధుమ రంగుతో గుండ్రని మచ్చలు ఏర్పడి చుట్టూ ఎరుపు వర్ణం కలిగి మధ్య భాగం తెల్లగా ఉంటుంది.
- ఇటువంటి మచ్చలు అన్నీ కలగలిసి పెద్ద మచ్చలుగా ఏర్పడతాయి.
- నెమ్మదిగా మధ్య తెల్లటి భాగం విడిపోయి, క్రమేపి ఆకులు కూడా రాలతాయి.

**యాజమాన్యం:**

- తెగులు ఆశించిన మొక్కలను నాశనం చేయాలి.
- కిలో విత్తనానికి ట్రైకోడెర్మా విరిడె 10 గ్రా. చొప్పున కలిపి విత్తనశుద్ధి చేయాలి.
- కాపర్ ఆక్సీక్లోరైడ్ 3.0 గ్రా. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా కాప్టాన్ + హెక్సాకొనజోల్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలి.

**టొబాకోస్ట్రీక్ వైరస్:**

- ఈ వైరస్ తామర పురుగుల ద్వారా వ్యాపిస్తుంది.
- వైరస్ సోకిన మొక్కలు కొమ్మల చివరి లేత ఆకులు కొద్దిగా పసుపు వర్ణానికి మారి చిన్నవిగా ఉంటాయి.
- కొంత భాగం ఆకులు మాడిపోయి మరియు కొంచెం వంకర తిరిగినట్లు కుంచించుకుపోతాయి.
- సాధారణంగా వ్యాధి సోకిన మొక్కల కొమ్మల్లో ఎదుగుదల తగ్గిపోయి గిడస బారుతాయి.







- వ్యాధి తీవ్రత ఎక్కువైనపుడు వైరస్ వ్యాపించిన కొమ్మకు ఉన్న మొగ్గలు ఎండి రాలిపోతాయి.
- కలుపు మొక్కల్లో వయ్యారిభామ పాత్ర వైరస్ వ్యాప్తిలో చాలా ప్రధానమైనది. వయ్యారిభామలో వ్యాధి లక్షణాలు ఏమి కనిపించకపోయినప్పటికీ ఇది వ్యాధికారక వైరస్ వృద్ధి చెందటానికి దోహదపడుతుంది.
- వయ్యారిభామ పుప్పొడి రేణువులు తామర పురుగుల వివిధ భాగాలకు అంటుకొని, ఇవి ప్రతి మొక్కల ఆకులను గీకి తినడం వల్ల ఈ వైరస్ కలిగిన పుప్పొడి రేణువులు ప్రతి మొక్కలోనికి ప్రవేశిస్తాయి. గాలి ద్వారా కూడా వైరస్ కలిగిన రేణువులు వ్యాపించి ప్రతి మొక్కలోనికి ప్రవేశించగలవు.

**యాజమాన్యం:**

- ప్రత్తి పంట పొలంలో మరియు గట్ల వెంబడి ఉండే వయ్యారిభామ, ఉత్తరేణి, గడ్డి చామంతి వంటి కలుపు మొక్కలను పూతకు రాకముందే పీకి తగలబెట్టాలి.
- కలుపు మొక్కలను పూతకు రాకముందే నివారించటం రోగ నివారణకు ముఖ్య భాగం.
- తామర పురుగుల నివారణకు అవసరాన్ని బట్టి ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయామిథాక్సామ్ 0.2 గ్రా. లేదా డైఫెన్ థయూరాన్ 1.25 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి వారం రోజుల వ్యవధిలో మందులను మార్చి 2 సార్లు పిచికారి చేయాలి.

**బ్యాక్టీరియా నల్ల మచ్చ తెగులు:**

- బ్యాక్టీరియా తెగులు మొక్క యొక్క అన్ని దశలలో విత్తనం నుండి కోత వరకు ఆశిస్తుంది.
- మొలకల మీద చిన్న చిన్న నీరు సోకిన మచ్చలు ఏర్పడి దాని వలన మొలకలు ఎండిపోయి చనిపోతాయి.
- మొక్క లేత దశలో ఆకులపై గుండ్రని ముదురు ఆకుపచ్చ నూనెరంగు మచ్చలు ఏర్పడి తరువాత నల్లగా మారుతాయి.
- మొక్క ఎదుగుదల దశలో ఆకులపై కోణాకారంలో నూనె రంగు మచ్చలు ఏర్పడి తరువాత నల్లగా మారి, తరువాత దశలో ఆకుల ఈనెల ద్వారా తెగులు వ్యాపించి ఈనెలు నల్లగా మారతాయి.
- తెగులు ఉధృతి ఎక్కువైతే ఆకులు పండి రాలిపోతాయి.
- తెగులు ఉధృతంగా ఉన్నప్పుడు కొమ్మలకు కూడా వ్యాపించి, కొమ్మలు నల్లగా మారి ఎండిపోతాయి. దీనినే బ్లాక్ ఆర్మ్ అని పిలుస్తారు.
- పువ్వులు, కాయలకు ఈ తెగులు సోకినపుడు పరిపక్వ దశకు రాకముందే రాలిపోతాయి.
- కాయల మీద ముదురు ఆకుపచ్చ నూనె రంగు మచ్చలు ఏర్పడి తరువాత నల్లగా మారి గుంటలు ఏర్పడటం వలన కాయలు కుళ్ళిపోతాయి.

**యాజమాన్యం:**

- తెగులు సోకిన మొక్క భాగాలను తీసి నాశనం చేయాలి.
- పంట మార్పిడి అవలంభించడం వలన తెగులు ఉధృతిని అరికట్టవచ్చు.
- కిలో విత్తనానికి సుడోమోనాస్ ఫ్లోరిసెన్స్ 10 గ్రా. చొప్పున పట్టించి విత్తనశుద్ధి చేయాలి.
- భూమిలో పొటాష్ ధాతు లోపం లేకుండా చూసుకోవాలి. సిఫారసు మేరకు పొటాష్ ఎరువులను తప్పక వాడాలి.
- పంట కాలంనందున మంచి సేద్యపు పద్ధతులను అనుసరించాలి.
- తెగులు ఉధృతిని బట్టి 15 రోజుల వ్యవధిలో 3-4 సార్లు 10 లీటర్ల నీటికి స్ట్రెప్టోసైక్లిన్ లేదా పౌషామైసిన్ లేదా ప్లాంటామైసిన్ 1 గ్రా. మరియు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. చొప్పున కలిపి పిచికారి చేయాలి.





# వ్యవసాయ రంగంలో హోమియోపతి మందుల ద్వారా తెగుళ్ళ నివారణ

డా॥ బి. విద్యాసాగర్, డా॥ ఎస్. అమీర్ బాషా, కె. అశోక్ కుమార్ మరియు డా॥ జి. ఉమాదేవి
వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్

హోమియోపతి సహజమైన ప్రకృతి వైద్య కళ. హోమియోపతి మందుల ద్వారా వ్యవసాయ రంగంలో నూతన, సహజమైన ఉపయోగాలు సాధించవచ్చును. ప్రస్తుత రోజుల్లో వ్యవసాయంలో రైతులు అందరూ రసాయనాలు (క్రిమిసంహారక నాశనులు, శిలీంధ్ర నాశనులు) ఉపయోగిస్తున్నారు.

రైతులు అనేక రకాల రసాయన క్రిమిసంహారక నాశనులు, శిలీంధ్ర నాశనులు వాడడం వలన నేల సారవంతం కోల్పోయి పంట దిగుబడి తగ్గిపోయి నష్టాల బారిన పడుతున్నారు. ఈ రసాయన క్రిమి సంహారకాలు ఎక్కువ ధరలో ఉండడం వలన రైతులు అందరు వీటిని కొనలేక మరియు నకిలీ మందుల ప్రభావం వలన రైతులు పూర్తిగా నష్టపోయి, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ రసాయన క్రిమిసంహారక నాశనుల వాడకం ద్వారా మానవ జాతి మరియు పాడి పశువులు రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నాయి.



ఈ రసాయన మందుల స్థానంలో హోమియోపతి మందులు ఉపయోగించడం వలన అనేక రకాల ప్రయోజనాలు పొందవచ్చును.

### హోమియోపతి మందుల ఉపయోగాలు

- హోమియోపతి మందులన్నీ ప్రకృతి సిద్ధ, సాధారణ మందులు కాబట్టి వీటి వాడకం చాలా సులువు.
- హోమియోపతి మందుల వాడకం ద్వారా ప్రకృతికి ఎటువంటి హాని కలగదు.
- హోమియోపతి మందుల వాడకంతో నేల సారవంత గుణం కూడా పెరుగుతుంది.
- ఈ మందుల వాడకం ద్వారా పంటలలోని చీడపీడలు, వ్యాధులు తిరిగి పునరావృత్తం కావు.
- ఈ మందుల వాడకం వలన రైతులకు గానీ పాడి పశువులకు గానీ పంటలకు గానీ ఎటువంటి హాని జరగదు.
- ఈ మందుల వాడకం ద్వారా తక్కువ ధరలో అధిక మొత్తంలో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చు.
- వీటి ద్వారా నేల కాలుష్యం, గాలి కాలుష్యం తగ్గించవచ్చు.
- హోమియోపతి మందులన్నీ అన్ని నీటిలో సులువుగా కరగడం వలన రైతులందరూ వీటిని సులువుగా ఉపయోగించవచ్చు.
- ఈ మందులు మొక్కల విత్తన అంకురోత్పత్తి శాతాన్ని పెంచడమే గాక వ్యాధి నిరోధక శక్తిని కూడా పెంచుతాయి.







- ఈ మందుల ద్వారా మొక్కల యొక్క ఎదుగుదల శాతం, పోషక స్థాయిలను పెంచవచ్చు.
- సాధారణ కారకల ద్వారా వచ్చే ఒత్తిడిని మొక్కలలో పూర్తిగా నివారించవచ్చు.
- ఈ మందులు వాడకం వలన పంట మొక్కలకు నీటి లభ్యత తక్కువగా ఉందును. ఒత్తిడిని తట్టుకొని ఆరోగ్యంగా పెరుగుతాయి.
- హెూమియోపతి మందులలో నకిలీ మందులకు ఎటువంటి ఆస్కారం లేదు.
- ఈ మందుల వాడకం వలన ఎటువంటి చెడు దుష్ప్రభావాలు కలగవు.

## హెూమియోపతి మందులు వాడే విధానం, తగిన సూచనలు

- ఈ హెూమియోపతి మందులు పిచికారి చేయడానికి నర్సరీలలోని నీటి కాన్‌లు, చేతి స్ప్రేలు, నాప్సాక్ స్ప్రేలు మాత్రమే వాడాలి. పవర్ స్ప్రేలు ఉపయోగించి పిచికారి చేయరాదు.
- హెూమియోపతి మందుల తయారీకి శుభ్రమైన నీటిని మాత్రమే ద్రావణంగా ఉపయోగించాలి.
- హెూమియోపతి మందులను ఇతర క్రిమి సంహారకాలతో కలిపి వాడరాదు.
- ఈ హెూమియోపతి మందులను పిచికారి చేసిన 10 రోజుల వరకు ఇతర మందులు ఏమి పిచికారి చేయకూడదు.
- పిచికారికి ముందు మందును అటు ఇటు బాగా తిప్పి కలియబెట్టి పిచికారి చేయాలి.
- 6× సామర్ధ్యం కలిగిన మందులను పిచికారికి ఎంచుకోవాలి.
- ఈ మందుల మోతాదు హెక్టారుకి 125 మి.లీ. 500 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేసుకోవచ్చు లేదా 1 మి.లీ. 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయవచ్చును.

## హెూమియోపతి మందులు వివిధ రకాల పంటలలో వాడకం

| మందు పేరు | మోతాదు | పంట | తెగులు |
|---|---|---|---|
| సల్ఫర్ | 30 సి | ఉల్లి | కాయకుళ్ళు తెగులు |
| నక్స్‌వామిక | 200 సి | ఉల్లి | కాయకుళ్ళు తెగులు |
| కలి అయోడెటం | 100 సి | టమాట | బూడిద తెగులు |
| కలి అయోడెటం | 149 సి | టమాట | కాయకుళ్ళు తెగులు |
| తుజా ఆక్సిడెంటాలిస్ | 87 సి | టమాట | కాయకుళ్ళు తెగులు |
| ఆర్సెనిక్ ఆల్బం | 30 సి | జామ | కాయకుళ్ళు తెగులు |
| లైకోపోడియం | 190సి | మామిడి | కాయ తెగులు |
| తుజా ఆక్సిడెంటాలిస్ | 30 సి | అపరాలు | కాండం, వేర్ల పొడవు పెరగడానికి |

ఆధారం : సి.సి.ఆర్.హెచ్, న్యూఢిల్లీ



# ఆగష్టు మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు

**డా॥ ఐ.వి. శ్రీనివాసరెడ్డి**

**వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట**

**మామిడి :** గత మాసంలో కురిసిన వర్షాల వల్ల కలుపు మొక్కలు మొలకెత్తుతాయి. వీటి నివారణకు పారాక్వాట్ కలుపు మందును 5 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. అవకాశం ఉన్నచోటు దున్ని, పాదులు చేసుకొని 1080 గ్రా. యూరియా, 3.5 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 840 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను మొదలు నుండి 1.5 మీ. దూరంలో 15 సెం.మీ. వెడల్పు గాడి చేసి పీచు వేర్లకు దగ్గరగా వేసుకోవాలి. అధిక వర్షాల వల్ల మచ్చ తెగుళ్ళు వచ్చే అవకాశం ఉంది. నివారణకు 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా 2 గ్రా. కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ కలిసిన మందును లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. గూడు పురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ 2 మి.లీ లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.

**జామ :** వర్షపు నీరు మొక్కల మొదళ్ళలో నిల్వకుండా చూడాలి. లేకపోతే ఎండు తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు మొదళ్ళలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పోసుకోవాలి. నులిపురుగుల నివారణకు పాసిలోమైసెస్ లిలానస్ 50 గ్రా. చెట్టుకు చొప్పున వేసి నీరు పెట్టుకోవాలి. బంతిని అంతర పంటగా వేసుకోవాలి.

**అరటి :** పెద్ద పచ్చ అరటి, పొట్టి పచ్చ అరటి, తెల్ల చక్కెర కేళి రకాలలో ఈ మాసంలో సిగటోక ఆకుమచ్చ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి 2-3 సార్లు 20 రోజుల వ్యవధిలో మార్చి మార్చి పిచికారి చేయాలి. అరటి ఆకుల అంచుల వెంబడి పసుపు రంగులోకి మారి, క్రమేపి ఆకు మొత్తం పండిపోయి ఎండిపోవును. నివారణకు ఆకులపై 5 గ్రా. సల్ఫేట్ ఆఫ్ పొటాష్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. మొక్కకు 80 గ్రా. చొప్పున మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను నలభై రోజుల వ్యవధిలో 4 దఫాలుగా వేసుకోవాలి.

**బత్తాయి, నిమ్మ :** ఈ మాసంలో తోటల్లో వర్షపు నీరు నిలవకుండా చూడాలి. మొదళ్ళ నుండి వచ్చే పిలక కొమ్మలను తీసివేయాలి. శిలీంధ్ర తెగుళ్ళ నివారణకు ట్రైకోడెర్మా విరిడెతో మాగిన పశువుల ఎరువును చెట్టుకు 5 కిలోల చొప్పున వేసుకోవాలి. గజ్జి తెగులు సోకిన కొమ్మలను, ఆకులను కత్తిరించి కాల్చివేయాలి. 180 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్, 6 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ 60 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

**ద్రాక్ష :** ఈ మాసంలో బూడిద తెగులు కనిపించే అవకాశం ఉంది. నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రా., వారం రోజుల తరువాత ఫెన్‌కొనజోల్ 0.5 మి.లీ., 10 రోజుల తరువాత హెక్సాకొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**బొప్పాయి :** కాండం మొదలు కుళ్ళు, కాండం కుళ్ళు తెగుళ్ళ నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా. లేదా మెటలాక్సిల్ ఎమ్.జెడ్ 2 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి చెట్ల మొదళ్ళలో మరియు కాండాన్ని తడుపుతూ పోయాలి.

**సపోట:** ఆకుగూడు అల్లే పురుగు, మొగ్గ తొలిచే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. పిల్ల పురుగులు లేత ముదురు ఆకులను గూళ్ళుగా చేసుకొని ఆకులను గోకి తింటాయి. పూతను అప్పుడప్పుడు కాయలను కూడా ఆశిస్తాయి. నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలుపుకొని ఆకులు, చిగుళ్ళు, కొమ్మలు పూర్తిగా తడిచేలా పిచికారి చేయాలి.

**సీతాఫలం:** ఆకులపై నల్లటి మచ్చలు ఏర్పడి నష్టాన్ని కలుగ





జేస్తాయి. దీని నివారణకు కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఈ మాసంలో చెట్టుకి 500 గ్రా. యూరియా, 700 గ్రా. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 200 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను వేసుకోవాలి.

**కూరగాయలు**

**టమాట :** పొలం చుట్టూ జొన్న లేదా సజ్జ పంటను ఎర పంటగా వేయడం వల్ల రసం పీల్చు పురుగుల ఉధృతి తగ్గి టమాటలో ఆకు ఎండు తెగులు, వైరస్ తెగుళ్ళు తగ్గుతాయి. ఆకుమాడు తెగులు నివారణకు క్లోరోథలోనిల్ 2 గ్రా. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 3 సార్లు పిచికారి చేయాలి.

**వంగ :** రసం పీల్చే పురుగుల నివారణకు డైమిథోయేట్ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. తెల్లదోమ ఉధృతి అధికంగా ఉంటే ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. మొవ్వు మరియు కాయ తొలుచు పురుగు నివారణకు పురుగు ఆశించిన కొమ్మల చివర్లు త్రుంచి వేసి నాశనం చేయాలి. 2 మి.లీ. డైమిథోయేట్ లేదా 1 గ్రా. థయోడికార్బ్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**బెండ:** ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి మొదళ్ళు తడిచేటట్లు పోయాలి. పొలంలో అక్కడక్కడా పసుపు రంగు డబ్బాలకు గ్రీజుగాని, ఆముదం గానీ పూస్తే తెల్లదోమలు ఆకర్షించబడతాయి మరియు నివారణకు లీటరు నీటికి డైమిథోయేట్ 2 మి.లీ. కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి. తీవ్రత అధికంగా ఉంటే ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పందిరి (తీగ) కూరగాయలు :** మొక్కలు 2-4 ఆకుల దశలో ఉన్నప్పుడు లీటరు నీటికి 3 గ్రా. బోరాక్స్ కలిపి ఆకులపై పిచికారి చేస్తే ఆడపూలు ఎక్కువగా పూసి పంట దిగుబడి ఎక్కువగా వస్తుంది. గుమ్మడి పెంకు పురుగులు ఆకులు, పూలను కొరికి తింటాయి. నివారణకు మలాథియాన్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. బూజు తెగులు నివారణకు మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా మెటలాక్సిల్ ఎమ్.జెడ్. 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**క్యాబేజి :** స్వల్పకాలపు రకాలను ఆగష్టు రెండవ పక్షం నుండి నాటుకోవచ్చు.

**కాలీఫ్లవర్ :** నేలను బాగా దున్ని 60 సెం.మీ. దూరంలో బోదెలు వేసుకొని, 25-30 రోజుల వయస్సు గల నారును 45 సెం.మీ. దూరంలో ఈ మాసంలో నాటుకోవాలి.

**బీట్‌రూట్ :** ఈ మాసం నుండి విత్తుకోవచ్చు. దఫ దఫాలుగా ఒక్కొక్క దఫాకు 15 రోజుల తేడాతో విత్తుకుంటే మార్కెట్ డిమాండుకి అనుగుణంగా పంట పొందవచ్చు.

**కరివేపాకు :** ఈ మాసంలో విత్తనాలను విత్తుకోవచ్చు లేదా 3 నెలల వయస్సు గల మొక్కలను పొలంలో నాటుకోవాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు 1 గ్రా. కార్బండాజిమ్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**మిరప :** నారు పోసుకోవడానికి అనువైన సమయం. ఒక మీటరు వెడల్పు, 15 సెం.మీ. ఎత్తు ఉండేటట్లు ఎత్తైన నారుమడులు చేసి మధ్యలో 30 సెం.మీ. కాలువలు తీయాలి. సెంటు నారుమడిలో 80 గ్రా. హైబ్రిడ్ విత్తనం చల్లుకోవాలి. విత్తనంతో పాటు సెంటు నారు మడికి 80 గ్రా. ఫిప్రోనిల్ గుళికలు వాడినచో రసం పీల్చు పురుగులను నివారించవచ్చు. సెంటు నారుమడికి కిలో వేప పిండి వేయాలి. 3 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్ లీటరు నీటిలో కలిపిన నీళ్ళతో నారుమడిని 9 వ, 13 వ రోజు తడపడం ద్వారా మాగుడు తెగులు రాకుండా కాపాడుకోవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9441168156**





# శ్రీగంధం సాగు

**డా॥ టి. చైతన్య, డా॥ ఎ. క్రిష్ణ మరియు డా॥ ఎస్. పరమేశ్వరి**
అటవీ వ్యవసాయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

శ్రీగంధం చెట్టు కొన్ని దశాబ్దాలుగా సువాసనకు మరియు చెక్క వస్తువుల తయారీకి ప్రసిద్ధి. శ్రీగంధం చాలా ఖరీదైన చెట్టు మరియు నిత్య పచ్చని చెట్టు. దీనిని చందనము మరియు శ్రీగంధం అని అంటారు. శ్రీగంధం చెట్టు 13 - 16 మీటర్ల వరకు పెరుగును. దీని చుట్టుకొలత 100-200 సెం.మీ. శ్రీగంధం చెట్లను సౌందర్య, ఔషధ, వాణిజ్య రంగాలలో ఉపయోగిస్తారు. సాధారణంగా పెంచే చెట్లు 30 సంవత్సరాలకు తగిన ప్రతిఫలం ఇచ్చును. సరియైన యాజమాన్య పద్ధతులు అవలంభించటం వలన 15-20 సంవత్సరాలలో మంచి దిగుబడి వచ్చును. శ్రీగంధం తైలము, చేవకు మంచి గిరాకీ కలదు.

**అతిధి మొక్క :** శ్రీగంధం చెట్టు వేరు ఒక పాక్షిక పరాన్న జీవిగా వేరే చెట్టు యొక్క వేర్లపై ఆధారపడి పెరుగుతుంది. ఈ మొక్కలను అతిధి మొక్కలు అని అంటారు. శ్రీగంధం సాగులో అతిధి మొక్కకి చాలా ప్రాముఖ్యత ఉంది. అతిధి మొక్కగా కంది/నిమ్మ/ నారింజ/ బత్తాయి/మలబార్ వేప/టేకు/అవిసె మొక్కలను పెంచవచ్చును. ఈ మధ్య కాలంలో రైతులు శ్రీగంధం చెట్లకు మధ్య ఈ అతిధి మొక్కలను పెంచుతున్నారు.

**వాతావరణం:** ఈ చెట్టు వేడి మరియు గాలిలో తేమ కలిగిన వాతావరణంలో $12-35^0$ సెం.గ్రే. గల ప్రదేశాలలో సంవత్సరానికి 800 నుండి 900 మి.మీ. వర్షపాతం గల ప్రాంతాల్లో పెరుగును.

**నేల తయారి:** నేలను 2-3 సార్లు అడ్డం, నిలువుగా దున్ని కలుపు లేకుండా చేయాలి. 4 మీ.×4 మీ. లేదా 5 మీ.×5 మీ. దూరంలో శ్రీగంధం మొక్కలను, 45 సెం.మీ. × 45 సెం.మీ. గుంతలు తవ్వి ప్రతి గుంతకి 2 కిలోల పశువుల ఎరువు (బాగా చివికిన), కిలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, కిలో వేప పిండి, 100 గ్రా. లిండేన్ పొడి (3%) వేయాలి తరువాత మొక్కలను నాటాలి.

**మొక్కల ఎంపిక:** కనీసం 7 నుండి 8 నెలల వయస్సు కలిగి 30-35 సెం.మీ. ఎత్తు కలిగిన మొక్కలను నాటుటకు ఎంచుకోవాలి. త్రవ్విన గుంతలను కొన్ని రోజుల వరకు వదిలివేసి ఎండ తగిలేలా చేసిన చెద పురుగులు, క్రిమికీటకాలు నశించును. చెదల సమస్య ఉన్నట్లైతే లిండేన్ (3%) 100 గ్రా. తప్పని సరిగా గుంతలో వేసుకోవాలి. ఎకరానికి 400 మొక్కలు నాటాలి.

**నీటి యాజమాన్యం:** మొక్క తొలిదశలో వారానికి 2 సార్లు నీరు పెట్టాలి. ఆ తరువాత వర్షాధార పరిస్థితులలో 15-20 రోజులకొకసారి నీరు పెట్టాలి. బిందు సేద్యంతో కూడా 2-3 వారాలకొకసారి నీరు పారించవచ్చు. ఎండాకాలంలో ప్రతి 2 వారాలకు నీటి తడి పెట్టాలి.

**ఎరువుల యాజమాన్యం:** శ్రీగంధం చెట్ల నుండి మంచి దిగుబడి వచ్చుటకు బాగా చివికిన పశువుల ఎరువు, కంపోస్ట్ లేదా వర్మీ కంపోస్ట్ లేదా కుళ్ళిన సేంద్రియ ఎరువులను వాడవలెను. ఒక చెట్టు సంవత్సరానికి 10-15 కిలోల బాగా చివికిన పశువుల ఎరువు, 150:100:100 నత్రజని, భాస్వరం, పొటాష్ ఇచ్చే ఎరువులను రెండు దఫాలుగా జూన్-జూలై మరియు అక్టోబర్-నవంబర్ మాసాలలో వేయాలి. నాటిన 5 సం॥ల వరకు ఎరువులు వేయాలి.

**కలుపు నివారణ:** ఎప్పుటికప్పుడు కలుపు నివారణ చర్యలను చేపట్టాలి.

**పంటకోత మరియు దిగుబడి:** సాధారణంగా శ్రీగంధం 30 సంవత్సరాలకు ఒక చెట్టు 20 నుండి 25 కిలోల చేవ ఇచ్చును. కాని మంచి యాజమాన్య పద్ధతులు అవలంభించినచో 15 నుండి 20 సంవత్సరాలలో అంతే దిగుబడి ఇచ్చును.

ఒక చెట్టుకు - 20 కిలోలు

ఎకరానికి - 250 చెట్లు (4మీ×4మీ)

ఒక కిలోకి - రూ. 5000/-

ఎకరానికి దిగుబడి - 250× 20 కి॥ = 5000 కిలోలు

ఒక చెట్టుకి - 1 లక్ష రూపాయిలు వచ్చును.

నాణ్యమైన మొక్కలు లభించే ప్రాంతాలు-దూలపల్లి కార్తీకవనంలో నాణ్యమైన మొక్కలు లభిస్తాయి. సుమారు 8 నెలలు నుండి 1 సం॥ వయస్సు మొక్కలు నాటడానికి అనుకూలం. అలాగే హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ వారు కూడ నాణ్యమైన మొక్కలు రైతులకు అందజేస్తున్నారు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం. 9032677235**




# చామంతి సాగు - మేలైన యాజమాన్య పద్ధతులు

డా॥ వి. చైతన్య, డా॥ జె. హేమంత్ కుమార్, డా॥ పి.శ్రీరంజిత,
డా॥ రవికుమార్, ఫణిశ్రీ మరియు జెస్సీ సునీత
కృషి విజ్ఞాన కేంద్రం, వైరా

మన రాష్ట్రంలో వాణిజ్య పరంగా పండించే పూల పంటల్లో ప్రధానమైనది చామంతి. ఇవి మనకు వివిధ రంగులలో లభిస్తూ, ఆకర్షణీయంగా ఉండటమే కాకుండా వీటిని పూజా కార్యక్రమాలు, పండుగలు, శుభకార్యాలలో కట్ ఫ్లవర్‌గా మరియు దండల తయారీకి విరివిగా ఉపయోగిస్తుంటారు. ముఖ్యంగా చలికాలంలో ఈ పూల లభ్యత అధికంగా ఉంటుంది (అనగా అక్టోబర్, నవంబర్ నుండి మార్చి వరకు లభ్యమవుతాయి).

మన రాష్ట్రంలో సాగులో ఉన్న చామంతి రకాలను నక్షత్ర చామంతి (చిట్టి చామంతి), పట్నం చామంతి (మధ్యస్థ పూలు) మరియు పెద్ద సైజు పూలు గలవిగా విభజించవచ్చు.

**రకాలు:** చామంతి వివిధ ఆకారాలు, రంగులలో లభ్యమవుతాయి. మన రాష్ట్రంలో ముఖ్యంగా సాగయ్యేవి తెలుపు, పసుపు మరియు ఎరుపు రకాలు.

తెలుపు రకాలు: అర్కచంద్రిక, అర్క చంద్రకాంత్, పూర్ణిమ, డాలర్ వైట్ రతామ్ సెలక్షన్, బగ్గి.

**పసుపు రకాలు:** అర్క ఎల్లో గోల్డ్, కో-1, రాయచూర్ బసంతి, పూనమ్, సిల్వర్

**ఎరుపు రకాలు:** రెడ్ గోల్డ్, కో-2

**ప్రవర్ధనం:** పిలకలు మరియు కొమ్మ కత్తిరింపుల ద్వారా ప్రవర్ధనం చేస్తారు.

**కొమ్మ కత్తిరింపులు:** ఏపుగా పెరుగుతున్న కొమ్మలు 10 సెం.మీ. ఉండేలా కత్తిరించి నేరుగా లేదా ఇండోల్ బ్యూటారిక్ ఆమ్లం 2500 పి.పి.యం. ద్రావణంలో ముంచి మళ్ళలో గాని కోకోపీట్‌తో నింపిన ప్రోట్రేలలో గాని నాటుకోవాలి. 20-25 రోజులలో ఈ కొమ్మలకు వేరు వ్యవస్థ అభివృద్ధి చెంది ప్రధాన పొలంలో నాటుకోవడానికి అనుకూలంగా ఉంటాయి.

- కొమ్మల ద్వారా ప్రవర్ధనం చెందిన మొక్కలు త్వరగా పెరిగి పూల దిగుబడి కూడా అధికంగా ఉంటుంది.

**నేలలు:** సేంద్రియ పదార్థం అధికంగా ఉండే ఒండ్రు నేలలు, ఎర్ర గరప నేలలు అనుకూలం. ఉదజని సూచిక 6-7 మధ్య ఉండాలి. మురుగు నీటి పారుదల సరిగా లేని ఎడల మొక్కలు చనిపోతాయి.

**వాతావరణం:** ఇది శీతాకాలపు పంట. తేమ ఎక్కువగా ఉండి, పూలు పూసేటప్పుడు తక్కువ ఉష్ణోగ్రతలు ఉండే ప్రాంతాలు ఈ పంట సాగుకు అనుకూలం. పగటి సమయం ఎక్కువ ఉన్నప్పుడు చామంతి మొక్కలు శాఖీయంగా మాత్రమే పెరుగుతాయి.

**నాటే సమయం:** జూన్, జూలై నుండి ఆగష్టు వరకు నాటుకోవచ్చు. పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని ఒక్కసారి కాకుండా 15-20 రోజుల వ్యవధిలో రెండు దఫాలుగా నాటితే పూలను ఎక్కువకాలం పొందే అవకాశం ఉంటుంది.



**నాటే దూరం:** చిన్న పూల రకాలైన నక్షత్ర చామంతి - 30 × 30 సెం.మీ. దూరంలో నాటుకోవాలి. ఇవి ఎకరాకు 55,000 నుండి 60,000 మొక్కలు అవసరమవుతాయి.

- పెద్ద పూల రకాలను 90 × 60 సెం.మీ. లేదా 90×75 సెం.మీ. దూరంలో నాటుకోవాలి. ఇవి ఎకరాకు 8000 నుండి 9000 మొక్కలు అవసరమవుతాయి.

**ఎరువుల యాజమాన్యం:** ప్రధాన పొలంలో మొక్కలు నాటే ముందు ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు, 60-80 కిలోల నత్రజని, 30-40 కిలోల భాస్వరం మరియు 60-80 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులను వేసుకోవాలి.

- మొక్కల ఎదుగుదల దశలో ప్రతి 20 రోజులకొకసారి సూక్ష్మధాతు మిశ్రమంను పిచికారి చేసినట్లైతే దిగుబడి పెరుగుతుంది.

**నీటి యాజమాన్యం:** వాతావరణాన్ని బట్టి మరియు నేల తీరును బట్టి ఇవ్వాలి. నాటిన మొదటి నెలలో వారానికి 2-3 సార్లు వారానికొకసారి నీటితడి ఇవ్వాలి.

**తలలు తుంచడం (పించింగ్):** నారు నాటిన నాలుగు వారాల తర్వాత చామంతి మొక్కల తలలు తుంచి వేయాలి. పొడవైన పూల కాడతో పూలు పొందాలనుకున్న మొక్కకు ఈ కత్తిరింపు సరిపోతుంది. విడిపూలు మాత్రం సేకరించాలనుకొంటే పక్క కొమ్మలను మళ్ళీ కత్తిరిస్తే ఒక్కొ మొక్కకు 20-30 పూలు పొందవచ్చు. ఒక వేళ శీతాకాలం ఆరంభంలోనే పూలు సేకరిస్తే మొక్కలను వెనుకకు కత్తిరించి ఎరువులు వేసుకొంటే 30 రోజులలో మొక్కలు మళ్ళీ పెరిగి పూతకోస్తాయి.

**ఊతమివ్వడం:** చామంతి మొక్కలు పూలు పూసేటప్పుడు బరువుకి వంగి పోకుండా వెదురు కర్రతో ఊతమివ్వడం మంచిది.

**హార్మోన్లవాడకం:** 100 పి.పి.యం. (100 మి.గ్రా. లీటరు నీటిలో) నాఫ్తలిన్ యాసిటిక్ ఆమ్లాన్ని మొగ్గ దశ కంటే ముందుగా పిచికారి చేస్తే పూతను కొంత ఆలస్యం చేయవచ్చు. 100-150 పి.పి.యం. జెబ్బరిల్లిక్ ఆమ్లాన్ని పిచికారి చేస్తే 15-20 రోజుల్లో త్వరగా పూతకు వస్తుంది.

**సస్యరక్షణ:**

**పచ్చ పురుగు:** ఈ గొంగళి పురుగులు ఆకులను, పువ్వులను మరియు మొగ్గలను ఆశించి తీవ్రంగా నష్టపరుస్తాయి. నివారణకు థయోడికార్బ్ 1 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తామర పురుగులు:** ఇవి గుంపులు గుంపులుగా చేరి రసాన్ని పీల్చి వేయడం వల్ల ఆకులు ముడతలు పడి ఎండిపోతాయి. పూలు కూడా వాడిపోయి రాలిపోతాయి. నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.25 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పేనుబంక:** అన్ని రకాల దశల పురుగులు పువ్వుల్ని మరియు మొగ్గల్ని ఆశించి తీవ్రంగా నష్టపరుస్తాయి. ఆక్సీడెమటాన్ మిథైల్ 3 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 0.3 మి.లీ. లేదా పైరిప్రాక్సీఫెన్ 1.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తెగుళ్ళు**

**ఆకుమచ్చ:** నల్లటి లోతైన గుండ్రటి మచ్చలు ఆకులపై ఏర్పడటం వల్ల ఆకులు ఎండి వడలిపోతాయి. నివారణకు క్లోరోథాలోనిల్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**వేరుకుళ్ళు తెగులు:** వర్షాలు అధికంగా ఉన్నప్పుడు ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. మొక్కలు ఆకస్మాత్తుగా వడలిపోతాయి. ఆకులు ఎండిపోయి రాలిపోతాయి. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ళ వద్ద పోయాలి. 2 కిలోల ట్రైకోడెర్మా పశువుల ఎరువులో కలిపి చివరి దుక్కిలో వేయాలి.

**తెల్లతుప్పు తెగులు:** ఈ తెగులు ఆశించిన మొక్కలు సరిగా ఎదగవు. ఆకుల అడుగు భాగాన తెల్లటి ఉబ్బెత్తు మచ్చలు ఏర్పడతాయి. ఈ తెగులు నివారణకు అజాక్సీస్ట్రోబిన్ 1 మి.లీ. లేదా ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ + ట్రిబ్యుకొనజోల్ 0.75 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పైన తెలిపిన విధంగా సరైన యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే రైతులు అధిక దిగుబడిని పొందవచ్చు.

**పూలకోత:** జూన్-జూలై లో నాటిన మొక్కల నుండి అక్టోబర్, నవంబర్‌లో పూలు కోసుకోవచ్చు. పూలను సాయంత్రం లేదా ఉదయం పూట కోసి సంచులలో నింపి దూర ప్రాంతాలకు పంపవచ్చు. సంచులలోపై నింపేటప్పుడు పూలపై నీరు చల్లరాదు.

**దిగుబడి:** ఎకరాకు 5-8 టన్నుల పూల దిగుబడి పొందవచ్చు. ఒక పంట కాలంలో దాదాపు 10-15 సార్లు పూలు కోయవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9441632227



# తీగ జాతి కూరగాయలలో బంక తెగులు - యాజమాన్యం

డా॥ ఎం. సునీల్ కుమార్, డా॥ ఎ. రమాదేవి, ఎ. పోషాద్రి,
కె. మమత మరియు డా॥ వై. ప్రవీణ్ కుమార్
కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్

ఆదిలాబాద్ జిల్లాలో ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, సిరికొండ తో పాటు మరి కొన్ని మండలాల్లో కూరగాయల సాగు రైతులు పెద్దఎత్తున చేపడుతున్నారు. టమాట, వంకాయ, మిరప, బెండ మరియు తీగజాతి కూరగాయలను సాధారణ మరియు ఆధునిక పద్ధతులైన పాలీహౌస్, మల్చింగ్, బిందు సేద్య పద్ధతి, పందిర్లు వంటి పద్ధతులను అవలంభించి కూరగాయలలో అధిక దిగుబడి సాధిస్తున్నారు. కానీ కొన్ని సమయాలలో ప్రకృతి విపత్తులు, చీడపీడలు ఆశించటం వలన రైతులు నష్ట పోతున్నారు. చీడపీడల నివారణ మరియు యాజమాన్య పద్ధతుల పైన అవగాహన లేకపోవడం వలన పంట నష్టం జరుగుతున్నది. కృషి విజ్ఞాన కేంద్రం,ఆదిలాబాద్ శాస్త్రవేత్తల క్షేత్ర సందర్శనలో భాగంగా జిల్లాలోని గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండలాల్లోని కూరగాయ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా దాదాపుగా అన్ని గ్రామాల్లోని సొరకాయ తోటల్లో బంక తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనించటం జరిగింది. ఈ తెగులును గత సంవత్సరం నుండి మాత్రమే గమనిస్తున్నట్లు, దీనివలన పంట దిగుబడిలో సుమారుగా 60-70% వరకు నష్టపోతున్నట్లు రైతులు తెలియజేశారు. ఈ నేపథ్యంలో బంక తెగులు లక్షణాలు, వ్యాప్తి మరియు నివారణ చర్యలకు సంబంధించిన పలు అంశాలను ఈ క్రింది వ్యాసం ద్వారా వివరించటం జరిగినది.

డిడిమెల్ల బ్రయోనియే అను శిలీంధ్రం వల్ల సోకే ఈ బంక తెగులు సొరకాయ పంటను మాత్రమే కాకుండా పుచ్చ, కీరదోస, గుమ్మడి, బూడిద గుమ్మడి, తర్భుజా లాంటి ఇతర తీగజాతి కూరగాయలను కూడా ఆశిస్తుంది. అధిక తేమతో కూడిన చల్లని వాతావరణ పరిస్థితులలో పుచ్చ మరియు తర్భుజా పంటల్లో కోత దశలో తెగులు ఉధృతి అధికంగా ఉండి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుంది. ఈ పంటల్లో తెగులు సోకిన కాయలపైన ఏర్పడే నల్లని మచ్చల వలన ఈ తెగులును నల్లకుళ్ళు తెగులు అని కూడా పిలుస్తారు.

**లక్షణాలు:** ఈ తెగులు విత్తన మొలక నుండి కాయ కోత వరకు అన్ని దశలలో తీగ జాతి కూరగాయలను ఆశిస్తుంది. వేర్లు తప్ప మొక్కలోని అన్ని భాగాలలో తెగులు లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. విత్తన మొలక దశలో లక్షణాలను గమనించినట్లయితే బీజదళాల్లో ఆకు అంచులు మొదట లేత పసుపు రంగులోకి మారి, ఆ తరువాత లేత నుండి ముదురు గోధుమ వర్ణంలోకి మారి ఎండిపోతాయి. కొన్ని సందర్భాల్లో బీజ దళాలపై నీటితో కూడిన మచ్చలు ఏర్పడి, వడలిపోయి మొలక చనిపోవడం జరుగుతుంది.

పంట ఎదిగే దశలో కాండం పైన చిన్న చిన్న మచ్చలు ఏర్పడి క్రమేపి పెరుగుతూ గరుకుగా తయారవుతాయి. కాండం పైన బంకతో కూడిన పగుళ్ళు కూడా ఏర్పడతాయి. ఎరుపు లేదా గోధుమ లేదా నలుపు రంగులో గజ్జి మచ్చలు కాండంపై ఏర్పడి ఎర్రని బంకలాంటి పదార్థం కారుతుంది. తీగజాతి కూరగాయలలో ఆంత్రాక్నోస్ తెగులు వలన కూడా బంక కారడం జరుగుతుంది. కావున జాగ్రత్తగా గమనించి తగు నివారణ చర్యలు చేపట్టాలి. తరవాత దశలో ఆకు ఈనెలు, ఆకు అంచులపై నీటితో కూడిన పెద్ద పెద్ద గోధుమ రంగు మచ్చలు ఏర్పడి మొక్కలు వడలిపోయి చనిపోతాయి. తెగులు సోకిన మూడు నుంచి నాలుగు వారాల తరువాత మొక్కలు వడలిపోవడం జరుగుతుంది. కాయ దశలో ముఖ్యంగా పుచ్చ, కీరదోస మరియు తర్బుజా పంటల్లో కాయలపైన గుండ్రని జిగురు ఆకుపచ్చ రంగు మచ్చలు ఏర్పడి క్రమేపి గోధుమ రంగులోకి మారి కాయలు కుళ్ళిపోతాయి.

**తెగులు కారకము మరియు తెగులు వ్యాప్తి:** డిడిమెల్ల బ్రయోనియే అనే శిలీంధ్రము విత్తనాలు, కలుపు మొక్కలు మరియు గత పంట

కాలంలోని తెగులు సోకిన తీగజాతి మొక్కల అవశేషాలలో జీవిస్తుంది. వాతావరణంలోని తేమ మరియు ఉష్ణోగ్రతలు ఈ తెగులు వ్యాప్తిని ప్రభావితం చేస్తాయి. వాతావరణంలో 16-24 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు మరియు 85% తేమ ఉన్న పరిస్థితులలో తెగులు ఉధృతి అధికంగా ఉండి ఎక్కువ నష్టాన్ని కలుగజేస్తుంది. విరిగిన మొక్క భాగాలు, పేనుబంక మరియు గుమ్మడి పురుగులు తిని వేసిన భాగాలు, బూడిద తెగులు సోకిన మొక్క భాగాలను ఈ శిలీంధ్రము ప్రవేశ ద్వారాలుగా చేసుకొని వ్యాప్తి చెందుతుంది.



### సమగ్ర నివారణ చర్యలు

- బంక తెగులు విత్తనం ద్వారా సంక్రమించే అవకాశం కలదు కావున నాణ్యమైన, నమ్మదగిన కంపెనీ విత్తనాలను వాడాలి.
- కిలో విత్తనానికి మ్యాంకోజెబ్ 2.5 గ్రా. చొప్పున కలిపి విత్తనశుద్ధి చేయాలి. అర్క నూతన్, అర్క శ్రేయాస్ లాంటి తెగులు తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవాలి.
- తీగజాతి కూరగాయలను నారు ద్వారా సాగు చేసినప్పుడు నాణ్యమైన నారును ఎంపిక చేసుకోవాలి. నారుమడి దశలో ఈ తెగులు వలన కాండంపై నీటితో కూడిన మచ్చలు ఏర్పడతాయి.
- గత పంట కాలంలో సాగు చేసినటువంటి తెగులు సోకిన పంట అవశేషాలు శిలీంద్రానికి ఆశ్రయం కల్పిస్తాయి కావున కోతానంతరం పంట అవశేషాలను సేకరించి నాశనం చేసి లోతైన దుక్కులు చేయాలి.



- అడవి జాతి దోస, కాకర వంటి మొక్కలు శిలీంద్రానికి ఆశ్రయం కల్పిస్తాయి కావున వీటిని ఎప్పటికప్పుడు గమనిస్తూ పీకి నాశనం చేయాలి.
- ఒకే పొలంలో తీగజాతి కూరగాయలు మళ్ళీ మళ్ళీ సాగు చేయడం వలన తెగులు వ్యాప్తి అధికంగా ఉంటుంది కావున ఇతర జాతికి చెందిన కూరగాయలతో పంటమార్పిడి చేయాలి.
- పంట సాగు సమయంలో మొలక దశ నుండి కోత వరకు ఎప్పటికప్పుడు క్రమేపి పంటను పరిశీలించినట్లయితే తగిన సమయంలో సరైన మందులు పిచికారి చేసి తెగులును నివారించవచ్చు.
- తెగులు లక్షణాలు గమనించిన వెంటనే లీటరు నీటికి మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా క్లోరోథలోనిల్ 1.5 గ్రా. లేదా మెటిరాం + పైరక్లోస్ట్రోబిన్ 3 గ్రా. చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9676363948

# వ్యవసాయ పదవినోదం

కూర్పు : డా॥ కె. వాణిశ్రీ




## అడ్డం

1. ప్రత్తిలో తొలిదశలో రసం పీల్చే పురుగులను నివారించటానికి కీటక నాశనులను తక్కువ మోతాదులో ఉపయోగించే పద్ధతిని ఏమంటారు? (8)
2. అడవుల్లో ఎత్తైన కొండ ప్రాంతాల్లో సహజ సిద్ధంగా తీగలా అల్లుకొని వర్షాధారంగా పెరిగే కూరగాయ పంట ఏది? (4)
3. మానవాళికి అన్నం పెట్టే ఉద్దేశ్యంతో నిర్విరామంగా కృషి చేసే రైతుకు మరో పేరు? (4)
4. ఆక్సాలిక్ యాసిడ్ ఎక్కువగా ఉండటం వలన పుల్లటి రుచి మరియు మంచి పోషక విలువలు కల్గిన ఆకుకూర? (4)
5. సమగ్ర సస్యరక్షణలో భాగంగా రసం పీల్చే పురుగులను నివారించటానికి ఏమి ఉపయోగించాలి? (6)
6. ప్రస్తుత వానాకాలం వరిలో సమస్యాత్మకంగా మారిన బ్యాక్టీరియా వలన కలిగే తెగులు? (10)

## నిలువు

1. వరిలో ఏ పురుగు ఆశించడం వల్ల మొవ్వు చనిపోయి తెల్లకంకి వస్తుంది? (8)
2. తామర పురుగులను నివారించడానికి సాధారణంగా వాడే పురుగు మందు పేరు? (4)
3. పూలు మొదట పసుపుగా ఉండి తర్వాత నారింజ రంగుకు మారి మరియు గింజలు తెల్లగా ఉండే కుసుమ రకం ఏది? (3)
4. మిరపలో ఏ పురుగు పిందె దశలో ఆశించటం వల్ల కాయలు వంకర్లు తిరిగి గిడస బారతాయి? (5)
5. ఈ మధ్య మొక్కజొన్నలో సమస్యాత్మకంగా మారిన కత్తెర పురుగు, ప్రత్తిలో గులాబి రంగు పురుగును ఏమి ఉపయోగించి నిఘా బెట్టాలి? (8)
6. నొవాలురాన్ మొక్క వ్యాపార నామం వ్రాయండి? (3)
7. పూలలో రారాణి మరియు కట్‌ఫ్లవర్ సాగులో ప్రథమ స్థానంలో ఉన్న బహువార్షిక పంట ఏది? (3)

సమాధానాలు 50వ పేజీలో




# ఇనుము ధాతువును ఇంట్లోనే పెంచుకోండి ఇలా....

యల్. సుహాసిని, డా॥ ఎ. వెంకట్రాం, డా॥ బి. విద్యాధర్
మరియు డా॥ టి. రమేష్
వ్యవసాయ కళాశాల, వరంగల్

కోవిడ్-19 తర్వాత ప్రతి ఒక్కరిలో ఆరోగ్యం మీద శ్రద్ధ పెరిగింది. మన దైనందిన జీవితంలో ప్రతి ఒక్క పోషకాహారంను సమపాళ్ళలో తీసుకోవాలి. దీని వలన రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. అన్ని రకాల పోషకాహార విలువలు ఆకుకూరల్లో లభిస్తాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో కూరగాయలను బయటకొనుగోలు చేయాలన్న కూడా భయందోళనే. కనుక ఇలాంటి పరిస్థితుల్లో కూరగాయలను ఇంట్లోనే పండించుకోవటం ఎంతో మంచిది. కొన్ని రకాల కూరగాయలను అందులో ఆకుకూరలను పండించుకోవటం చాలా సులభం. దీని కోసం ఎక్కువగా ఖర్చు కూడా పెట్టాల్సిన అవసరం లేదు. ఇంట్లోవాడిపడేసిన ప్లాస్టిక్ బాటిల్స్, బకెట్స్, టబ్స్, ప్లాస్టిక్ / మట్టి కుండీలలో ఇంట్లో లభించే విత్తనాలతోనే ఎంతో సులువుగా ఆకుకూరలను పండించుకోవచ్చును.

ఈ మధ్య కాలంలో ముఖ్యంగా పట్టణాలలో (ఒక మోస్తరు నుండి మెట్రోనగరాల వరకు) మిద్దెతోట చాలా ప్రాముఖ్యత పొందింది. ఇంట్లో పెరటి స్థలం లేనివాళ్ళు, మిద్దెల మీదనే వివిధ రకాలుగా ఎంతో సులువుగా ఎలాంటి క్రిమిసంహారక మందులను వాడకుండానే, అన్ని రకాల కూరగాయలను పండించవచ్చును. దీనివలన నాణ్యమైన మరియు పరిశుభ్రమైన కూరగాయలను పండించుకోవచ్చు.

ఐ.సి.యం.ఆర్. సిఫారసు ప్రకారం ప్రతిరోజు సుమారుగా 100-125 గ్రా. వరకు ఆకుకూరలను మన భోజనంలో తప్పనిసరిగా తీసుకోవాలి. ఆకుకూరల్లో అనేక రకాలైన పోషకాహార విలువలున్నాయి. ఇందులో ఎక్కువగా ఇనుము, ఇతర ఖనిజలవణాలు అయినటువంటి కాల్షియం, మెగ్నీషియం, భాస్వరం, మాంగనీస్, మాంసకృత్తులు విటమిన్ ఎ, బి, సి మరియు ఫోలిక్ ఆమ్లం, పీచుపదార్థాలు ఉన్నాయి. ఇవన్నీ రోగనిరోధక శక్తి పెరుగుదలలో ఎంతగానో దోహదపడతాయి.

ఆకుకూరలపై ఎలాంటి క్రిమిసంహారక మందులను వాడకూడదు. ఒకవేళ ఉధృతి ఎక్కువగా ఉంటే వేప సంబంధిత పదార్థాలైన నూనె, పిండిలతో కొన్ని రకాల పురుగులను, వ్యాధులను నివారించవచ్చును. రోజ్‌క్యాన్‌ని ఉపయోగించి నీటిని ఇస్తుండాలి. పండించటానికి ఉపయోగించే ఏ కుండీలైనా సరే వాటికి డ్రైనేజీ రంధ్రాలు (మురుగు నీరు పోయే సదుపాయం) ఉండాలి. ఇంట్లో నుండి వచ్చే వ్యర్థ పదార్థాలను కుండీలలో వేసుకుంటే మొక్కలకు పోషకాలు అందుతాయి.

కొన్ని రకాల ఆకుకూరలను, మిద్దెలపై పండించుకోవచ్చు లేదా ఇంటిలో ఉన్న ఖాళీ స్థలంలో, కుండీలలో కూడా పండించుకోవచ్చు. అవి పాలకూర, గోంగూర, మెంతికూర, కొత్తిమీర, బచ్చలి, తోటకూర, పుదీన, చుక్కకూర, ఆవ ఆకులు, మునగాకు, చింతచిగురు, గంగవాయిలి, పొన్నగంటికూర, ఉల్లికాడలు మరియు కరివేపాకు.

ఈ ఆకుకూరలను చట్నీలుగా, ఇతర కూరగాయలతో కలిపి వండుకోవచ్చు. ఆకులను ఎండబెట్టి కొని పొడులుగా నిల్వచేసుకుని తర్వాత ఉపయోగించుకో వచ్చును.

## ఆకుకూరల వివరాలు

**పాలకూర :** పాలకూరని సాధారణంగా విత్తనం ద్వారా నాటుకుంటారు. విత్తనాల దుకాణాంలో చిన్న కిచెన్ గార్డెన్స్ ప్యాకెట్స్ లభిస్తాయి. విత్తనాలను పలచగా మట్టిలో విత్తుకోవాలి. విత్తిన 3-4 వారాలకు మొదటి కోత వస్తుంది. తర్వాత 7-10 రోజుల వ్యవధిలో 4 నుండి 6 సార్లు కోతలు వస్తాయి.

**గోంగూర :** గోంగూరలో రెండు రకాలున్నాయి. అవి తెల్ల గోంగూర మరియు ఎర్ర గోంగూర. ఇది బహువార్షిక పంట కానీ ఏకవార్షికంగానే ఎక్కువగా పండిస్తారు. సాధారణంగా విత్తనాల ద్వారా నాటుకోవచ్చు లేదా కాడలను కూడా నాటుకోవచ్చు. గోంగూరలో పీచుపదార్థం మరియు విటమిన్ సి అధికంగా ఉన్నాయి. విత్తిన 90 నుండి 160 రోజుల తర్వాత పువ్వులు రాలిన తర్వాత ఆకులను కోసుకోవచ్చును. పువ్వులను కూడా చట్నీలుగా చేసుకోవచ్చును.

**మెంతికూర :** ఇంట్లో లభించే మెంతులను ఒకటి నుండి రెండు రోజులు నానబెట్టి మరుసటి రోజు విత్తుకున్నట్లైతే, మొలకశాతం ఎక్కువగా ఉంటుంది. నాటిన 25 నుండి 30 రోజుల ఆకులను కోసుకోవచ్చును.

**కొత్తిమీర :** ఇంట్లో ఉపయోగించే ధనియాలను అరబద్దలుగా విడగొట్టి మట్టిలో చల్లినట్లైతే మొలకలు త్వరగా వస్తాయి. విత్తిన 40-45 రోజుల తర్వాత పూత మొదలవుతుంది. పూత దశకు ముందు ఆకులను కొసుకొని ఉపయోగించుకోవచ్చును.

**బచ్చలి :** బచ్చలి రెండు రకాలు. ఒకటి ఎర్రటి కాడ కలవి, రెండు ఆకుపచ్చటి కాడ గలవి. ఇవి తీగలాగా పాకి మొక్కలు దీనిని విత్తనాలు మరియు వేరు కత్తిరింపుల ద్వారా నాటుకోవచ్చు. విత్తనాల ద్వారా నాటుకుంటే నాటిన 8-10 వారాల తర్వాత లేదా వేరు కత్తిరింపుల ద్వారా అయితే నాటిన 6 వారాల తర్వాత ఆకులను కోసుకోవచ్చును.

**తోటకూర :** తోటకూరలో రెండు రకాలు. పెద్ద ఆకులు, చిన్న ఆకులు గలవి. ఇందులో ఆకుపచ్చని మరియు పర్పుల్ రంగులు గల ఆకులు ఉన్నాయి. ఈ ఆకుకూరను విత్తనాల ద్వారా నాటుకోవచ్చును. విత్తిన 3 వారాలు (25 రోజులు-30) తర్వాత ఆకులను కోసుకోవచ్చును. తర్వాత ప్రతి 7 నుండి 10 రోజులకు ఒక కోత చొప్పున 90 రోజుల వరకు కోతలను తీసుకోవచ్చును.

**పుదీనా :** పుదీనాను తీగముక్కల ద్వారా నాటుకోవచ్చు. మట్టిలో నాటుకున్న 4-4.5 నెలల తర్వాత ఆకులను కోసుకొనవచ్చును. అలా 60 నుండి 70 రోజుల వరకు ఆకులను కోసుకొనవచ్చును.

**ఆవ ఆకులు :** ఆవ గింజలను విత్తిన 25 నుండి 40 రోజుల తర్వాత పెద్ద ఆకులను కొసుకొని వంటకు వినియోగించవచ్చును. సాధారణంగా ఈ పంటకు చల్లని వాతావరణం అనుకూలం.

**మునగాకు :** మునగ బహువార్షిక పంట. సాధారణంగా దీనిని కాయల కోసం పండిస్తారు. కాని మునగ ఆకులలో చాలా పోషకాలు ఉన్నాయి. ముఖ్యంగా విటమిన్ బి, సి, కాల్షియం, భాస్వరం, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉన్నాయి. ఈ మధ్యకాలంలో ఆకులతో చేసిన పొడులు బాగా ప్రాముఖ్యం సంపాధించుకున్నాయి. వార్షిక రకాలు విత్తనాలు నాటిన 160 నుండి 170 రోజులలో పూతకు వస్తాయి.

**చింత చిగురు :** చింత చిగురు పప్పులతో కలిపి వండుటలో చాలా ప్రాముఖ్యం. దీనిని ఇంట్లో పెంచుకోవటం సాధ్యం కానప్పటికినీ దీని ఆకులలో పోషకాలు ఎక్కువగా ఉండటం వలన లేత ఆకులను కూరగా ఉపయోగిస్తుంటారు.

**గంగవాయిలి :** గంగవాయిలి ఆకులలో ఒమేగా-3 ఫాటీ ఆమ్లాలు ఉండటం వలన శరీర పెరుగుదలకు ఎంతో దోహదపడతాయి. విత్తనాల ద్వారా నాటుకుంటారు. దీని ఆకులు చాలా చిన్నవిగా, మృదువుగా ఉంటాయి. విత్తనాలను నాటిన 2 నెలల తర్వాత ఆకులను కోసుకొవచ్చును.

**పొనగంటి కూర :** సాధారణంగా ఈ ఆకుకూర పొలాల మధ్య, తోటలలో అక్కడక్కడ పిచ్చి మొక్కగా పెరుగుతుంటుంది. పువ్వుల నుండి రాలిన విత్తనాల ద్వారా మళ్ళీ కొత్త మొక్కలు వస్తుంటాయి. ఒక్కసారి నాటుకున్నట్లైతే కొన్ని సంవత్సరాల వరకు మొక్క పెరుగుతూనే ఉంటుంది. లేత ఆకులను కోసుకొని కూరగా వండుకుంటారు. ఇది ఏకవార్షికంగాను వస్తుంటుంది. ఈ ఆకులలో విటమిన్ బి2 మరియు బి3 తో పాటు అనేక రకాలైన పోషకాహార విలువలున్నాయి.

**ఉల్లి కాడలు / ఉల్లి ఆకు :** సాధారణంగా ఇంట్లో ఉండే ఉల్లి గడ్డలను మట్టిలో నాటుకున్నట్లైతే వచ్చే కాడలను ఆకుకూరగా ఉపయోగించుకోవచ్చు లేదా విత్తనాల ద్వారా కూడా నాటుకోవచ్చు. విత్తనాలు నాటిన 7 నుండి 10 రోజుల తర్వాత మొలకలు వస్తాయి. కొత్త గడ్డలు వచ్చేంత వరకు లేదా ఆకులు ఎండిపోయేంత వరకు కూడ ఆకులను కోసుకొవచ్చును.

**కరివేపాకు :** ఇది బహువార్షిక మొక్క ఒక్కసారి నాటుకుంటే సరిపోతుంది. సాధారణంగా విత్తనాలు లేదా వేరుపిలకల ద్వారా నాటుకున్నట్లైతే 10 నుండి 12 నెలల్లో కోతకు వస్తుంది.

**చుక్కకూర :** ఇది బహువార్షిక పంట. ఈ ఆకుకూర పుల్లటి రుచి కలిగి ఉంటుంది. విత్తనాల ద్వారా నాటుకుంటారు. ఇది చల్లని వాతావరణంలో బాగా వస్తుంది. విత్తనాలు నాటిన 60 రోజులకి ఆకులను కోసుకొవచ్చును. మొక్కల నుండి వేరు భాగం విడదీసి కూడ నాటుకోవచ్చును. ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఈ ఆకుకూరను తక్కువగా తీసుకోవటం మంచిది.





# నాణ్యమైన చేప పిల్లల ఎంపికలో మెళకువలు

మాలోత్ మోహన్, డా॥ ఆర్ వి.టి. బాలాజీ నాయక్, డా॥ బి. వెంకట రాజ్ కుమార్, డా॥ యం. భవ్యమంజరి,
డా॥ యం. సురేష్ మరియు పి. విజయ్ కుమార్
కృషి విజ్ఞాన కేంద్రం, రుద్రూర్, నిజామాబాద్

మన రాష్ట్రంలో సాధారణంగా చేపల పెంపకం వర్షాకాలంలో ప్రారంభమవుతుంది. చెరువు కుంటల్లోకి సరిపడా నీరు వచ్చిన వెంటనే రైతులు చేప పిల్లలను చేప పిల్లల కేంద్రాల నుండి కొనుగోలు చేసి వదులుతారు. చెరువు సామర్ధ్యాన్ని, నీటి విస్తీర్ణాన్ని, నీరు నిల్వ ఉండే కాలపరిమితిని పరిగణలోకి తీసుకోకపోవడం వల్ల అనుకున్న దిగుబడి రాక నష్టాల బారిన పడాల్సి వస్తుంది కాబట్టి లాభదాయకమైన చేపల పెంపకానికి చేప పిల్లల ఎంపికలో గల మెళకువలను విధిగా తెలుసుకోవాలి.

**తెలంగాణ నీటి వనరులలో పెంపకానికి అనువైన చేపల రకాలు**

పెంపకానికి అనేక రకాల చేపలు ఉన్నప్పటికీ ఆహారంలో ఒకదానితో ఒకటి పోటీ పడకుండా త్వరగా పెరిగే రకాలను మాత్రమే ఎంచుకోవాలి అందులో ముఖ్యమైనవి.

బొచ్చె, రవ్వ, మ్రిగల, వెండి చేప, గడ్డి చేప, బంగారు తీగ, కొర్రమీను.

**చేప పిల్లల లభ్యత :** చేప పిల్లల రకాలు జిల్లాలో ఉండే ప్రభుత్వ మరియు ప్రైవేట్ చేపపిల్లల కేంద్రాల్లో లభిస్తున్నాయి. ప్రస్తుతం రవాణా ఖర్చులు అధికంగా పెరిగాయి కాబట్టి సమీపంలో ఉండే ఇద్దరు లేదా ముగ్గురు రైతులు కలిసి తెచ్చుకుంటే చేప పిల్లల ఖర్చు తగ్గించుకోవచ్చు. ప్రస్తుతం అనేక ప్రైవేట్ చేప పిల్లల కేంద్రాల్లో సుమారు 100 గ్రాముల నుండి 300 గ్రాముల బరువుండే ఇయర్లింగ్స్ చేప పిల్లలు కూడా లభిస్తున్నాయి. ఖరీదు ఎక్కువగా ఉండటంతో పాటు బ్రతుకుదల శాతం ఎక్కువగా ఉండి అధిక దిగుబడిని సాధించవచ్చు.

కొర్రమీను చేప పిల్లలు మాత్రం చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలలో లభించవు. వీటిని ఆయా ప్రాంతాల్లో స్థానిక మత్స్యకారుల సహజ మంచి నీటి వనరుల నుండి సేకరించుకుని అమ్ముతుంటారు. కావున చేపలతో పాటు వీటిని కూడా రైతులు కొనుగోలు చేసుకొని పెంచుకోవచ్చు. కనీసం రెండు అంగుళాల పైబడిన సైజు నుండి నలుపురంగులో మారినవి పెంపకానికి అనుకూలం.

**చేప పిల్లల్లో దశలు**

- ప్రై దశ (20–25 యం.యం.)
- ఫింగర్ లింగ్ దశ (25–50 యం.యం.)
- అడ్వాన్స్ ఫింగర్ లింగ్ దశ (50–100 యం.యం.)
- ఇయర్ లింగ్ దశ (50 గ్రా.)

చేపల సాగు కొరకు ఏదో ఒక దశ చేపపిల్లలను ఎన్నుకోవాలి. త్వరగా మార్కెట్ సైజుకు తెచ్చుకోవాలి అనుకొన్నప్పుడు ఇయర్ లింగ్, అడ్వాన్స్ ఫింగర్ లింగ్ సైజుగల చేప పిల్లలను చెరువులో వదులుకొన్నట్లైతే అనుకూలంగా ఉంటుంది.

**చేప పిల్లల సంఖ్య :** చెరువులో చేపల పెరుగుదల వాటి సాంద్రత లభించే ఆహారంపై ఆధారపడి ఉంటుంది. కావున కృత్రిమ ఆహారం ఇస్తూ ఎరువులు వేసి చెరువులో ఎకరా నీటి విస్తీర్ణానికి 2000 నుండి 3000 చేప పిల్లలను వేయాలి. ఎలాంటి ఆహారం, ఎరువులు లేకుండా పెంచే చెరువులో ఎకరం నీటి విస్తీర్ణానికి 1000 నుండి 1500 చేప పిల్లలను వేసుకోవాలి.

**చేప పిల్లల నిష్పత్తి :** చెరువు నిర్వహణ స్వభావంపై ఈ నిష్పత్తి ప్రక్రియ ఆధారపడి ఉంటుంది. సాధారణంగా స్వల్పకాలిక ఆరునెలలు నీరు ఉండే నీటి వనరుల్లో బంగారుతీగ రకాలను వదులుకోవాలి. అలాగే దీర్ఘకాలిక 7 నుండి 10 నెలల నుండి శాశ్వత 12 నెలలు ఉండే నీటి వనరుల్లో మూడు నిష్పత్తులలో చేప పిల్లలను వదులుకోవాలి.

| చేప రకం | 3–జాతులు | 4–జాతులు | 6–జాతులు |
|---|---|---|---|
| బొచ్చె | 4.0 | 3.0 | 1.5 |
| రోహు | 3.0 | 3.0 | 2.0 |
| మ్రిగాల | 3.0 | 2.0 | 1.5 |
| వెండి చేప | – | – | 1.5 |
| గడ్డి చేప | – | – | 1.5 |
| బంగారు తీగ | – | 2.0 | 2.0 |

**చేప పిల్లల నాణ్యత**

- పెంపకానికి ఎంపిక చేసుకునే చేప పిల్లలు ఆరోగ్యవంతంగా ఉండాలి.
- చేప పిల్లల శరీరంపై ఎలాంటి మచ్చలు, పుండ్లు పరాన్నజీవులు ఉండరాదు.
- మొప్పలు లేత గులాబి రంగులో ఉండాలి.
- వాజాలు (ఫిన్స్) విరిగిపోయినట్లు గాని, కత్తిరించినట్లు గాని ఉండరాదు.
- చేప పిల్లలు ప్రకాశవంతంగా ఉండి చురుకుగా కదులుతూ ఉండాలి. పొలుసులు ఊడిపోయి చేప పిల్లలు మందకొడిగా ఉండరాదు.
- వీలైనంతవరకు ఎంచుకునే చేప పిల్లల రకం ఒకే సైజులో ఉండేలా చూసుకోవాలి.

**చేప పిల్లల రవాణాలో జాగ్రత్తలు**

- చేప పిల్లలను రవాణా చేయడానికి ముందు 24 గంటల పాటు ఎటువంటి ఆహారాన్ని ఇవ్వకూడదు.
- చేప పిల్లలు చాలా సున్నితమైనవి కాబట్టి వాతావరణం చల్లగా ఉన్న సమయంలో రవాణా చేయడం మంచిది.
- రవాణా చేయదలచిన చేప పిల్లలకు చేతిరాపిడి తగలకుండా సున్నితపు వలలో పట్టి ఉంచుకోవాలి.
- రవాణా చేయు వాహనంలో ఆక్సిజన్ సిలిండర్లను అమర్చి ఆక్సిజన్‌ను అందిస్తూ రవాణా చేసుకోవాలి.
- చేప పిల్లలను తక్కువ ఉష్ణోగ్రత గల నీటిలో రవాణా చేయాలి.
- చేప పిల్లలను రవాణా చేస్తున్న వాహనాన్ని ఎండలో నిలుపరాదు. అలాగే ఈ వాహనాన్ని నీడలో ఎక్కువసేపు నిలుపరాదు. ఒకవేళ నిలపాల్సిన పరిస్థితి ఏర్పడితే స్టార్టింగ్‌లోనే ఉంచాలి.
- పాలిథీన్ బ్యాగ్‌లో సరైన మోతాదులో ఆక్సిజన్ ఉన్నదా లేదా చేప పిల్లలు చురుకుగా ఉన్నాయా లేదా అనేది గమనించాలి.
- పంపిణీ చేయబడిన చేప పిల్లలను ఎక్కడ ఆగకుండా నిర్దేశింపబడిన నీటి వనరు వద్దకు తీసుకుపోవాలి.
- నిర్దేశించిన నీటి వనరులలో మాత్రమే చేప పిల్లలను వేసుకోవాలి.
- నీటి వనరులలో వేసుకునే ముందు పాలిథీన్ బ్యాగులను నీటిలోకి వదిలి, నీటి ఉష్ణోగ్రతను అలవాటు చేసి తదుపరి బ్యాగు తెరిచి నీటిని పాలిథీన్ బ్యాగ్‌లోకి కొద్దికొద్దిగా కలిపి అప్పుడు వదలాలి.
- చిన్న సైజు చేప పిల్లలను ప్లాస్టిక్ బ్యాగులలో, పెద్ద సైజు చేప పిల్లలను ప్లాస్టిక్ డ్రామ్‌లలో సరిపడా ఆక్సిజన్‌తో రవాణా చేసుకోవాలి.

**చేప పిల్లల విడుదల :** చేప పిల్లలను చెరువు దగ్గరకు తీసుకు వచ్చిన తర్వాత చెరువు నీటిని అలవాటు చేసి నెమ్మదిగా వదలాలి అలా కాకుండా చేప పిల్లలను వేగంగా పై నుంచి చెరువులోకి పోయరాదు అలా చేస్తే పిల్లలు అధిక మొత్తంలో చనిపోయే ప్రమాదం ఉంది.

**ఇతర మెళకువలు**

- చేప పిల్ల ఎంపికలో ఒకే రకం కాకుండా కనీసం రెండు లేదా మూడు రకాలు కలిపి పెంచడం లాభదాయకం.
- నీటి మొక్కలు అధికంగా పెరిగే చెరువులలో వీటితోపాటు ఎకరానికి 100 నుంచి 150 గడ్డి రకం చేప పిల్లలను పెంచుకోవాలి.
- చేప పిల్లలను నమ్మకమైన ఉత్పత్తిదారుని వద్దనే కొనుక్కోవాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9493460735

# టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

డా॥ యం. శ్రీనివాసులు, జె.ఎస్. సుధారాణి మరియు డా॥ పి. ప్రశాంత్
ఎలక్ట్రానిక్ మీడియా వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్.

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| | | **I. డి.డి.- యాదగిరి (రైతు నేస్తం) : సాయంత్రం 5.00-6.00** | |
| 1. | 03.08.2020 | వానాకాలం పంటల్లో అధిక దిగుబడికి సూచనలు | **డా॥ యం. మల్లారెడ్డి,** ప్రధాన శాస్త్రవేత్త<br>కంప్యూటర్ సెంటర్, రాజేంద్రనగర్, హైదరాబాద్, 9848199544 |
| 2. | 04.08.2020 | సోయాచిక్కుడులో సమగ్ర సస్యరక్షణ | **కె. రాజశేఖర్,** శాస్త్రవేత్త<br>వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్, 9908556659 |
| 3. | 05.08.2020 | వానాకాలం పంటల్లో కలుపు యాజమాన్యం | **డా॥ టి. రాంప్రకాశ్,** ప్రధాన శాస్త్రవేత్త, అఖిల భారత సమన్వయ కలుపు యాజమాన్య విభాగం, రాజేంద్రనగర్, హైదరాబాద్, 9440121398 |
| 4. | 07.08.2020 | ప్రత్తి సాగులో పాటించవలసిన సమగ్ర యాజమాన్య పద్ధతులు | **వై. ప్రశాంత్,** శాస్త్రవేత్త<br>వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్, 9010756465 |
| 5. | 10.08.2020 | ఆలస్యంగా వరి నాట్లు వేసే రైతులకు సూచనలు | **వై. చంద్రమోహన్,** సీనియర్ శాస్త్రవేత్త<br>వరి పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్, 9908577040 |
| 6. | 12.08.2020 | ప్రత్యామ్నాయ వరి సాగు పద్ధతులు | **డా॥ యు. నాగభూషణం,** సీనియర్ శాస్త్రవేత్త<br>ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, 9010104998 |
| 7. | 13.08.2020 | ప్రత్తిలో చీడపీడల యాజమాన్యం | **డా॥ బి. రాంప్రసాద్,** సీనియర్ శాస్త్రవేత్త<br>ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, 9963073087 |
| 8. | 18.08.2020 | పెసర, మినుములో సస్యరక్షణ | **డా॥ వి. శ్రీధర్,** శాస్త్రవేత్త<br>వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, 9640370666 |
| 9. | 19.08.2020 | మెట్ట పంటల్లో బెట్ట పరిస్థితులను అధిగమించుటకు సూచనలు | **డా॥ పి. శ్రీరంజిత,** శాస్త్రవేత్త<br>కృషి విజ్ఞాన కేంద్రం, వైరా, 9989617700 |
| 10. | 20.08.2020 | జీవ నియంత్రణ పద్ధతుల్లో సస్యరక్షణ | **డా॥ జి. అనిత,** శాస్త్రవేత్త, అఖిల భారత జీవనియంత్రణ పరియోజన<br>రాజేంద్రనగర్, హైదరాబాద్, 9949997830 |
| 11. | 21.08.2020 | వరి సాగులో మేలైన వరి సాగు పద్ధతులు | **డా॥ పి. రేవతి,** శాస్త్రవేత్త<br>ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల, 9912944880 |
| 12. | 24.08.2020 | ఆముదంలో అధిక దిగుబడికి సూచనలు | **డా॥ యం. సుజాత,** ప్రధాన శాస్త్రవేత్త,<br>ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, 7207240582 |
| 13. | 31.08.2020 | మొక్కజొన్నలో అధిక దిగుబడికి పాటించవలసిన యాజమాన్య పద్ధతులు | **డా॥ ఇ. రజనీకాంత్,** శాస్త్రవేత్త,<br>వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్, 9908698043 |
| | | **II. టి-శాట్ : సాయంత్రం 4.30-5.30** | |
| 1. | 03.08.2020 | మాఘీ జొన్నలో అధిక దిగుబడికి సూచనలు | **డా॥ యస్. మహేశ్వరమ్మ,** శాస్త్రవేత్త<br>ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, పాలెం, 8978229445 |
| 2. | 10.08.2020 | సమర్థ ఎరువుల వినియోగానికి సూచనలు | **డా॥ సిహెచ్. రాములు,** శాస్త్రవేత్త<br>ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, 7893862667 |
| 3. | 17.08.2020 | వానాకాలంలో అధిక దిగుబడులకై వివిధ పంటల సాగులో పాటించవలసిన మెళకువలు | **డా॥ యం. శ్రీధర్,** ప్రధాన శాస్త్రవేత్త & హెడ్<br>ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన కేంద్రం, రుద్రూర్, 9989625218 |
| 4. | 24.08.2020 | వానాకాలం పంటల్లో కలుపు యాజమాన్యం | **జె.ఎస్. సుధారాణి,** శాస్త్రవేత్త<br>ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్, 9550526096 |
| 5. | 31.08.2020 | సమగ్ర వ్యవసాయం – లాభాలు | **డా॥ సిహెచ్. ప్రగతి కుమారి,** శాస్త్రవేత్త<br>అఖిల భారత సమగ్ర వ్యవసాయ పద్ధతుల పరిశోధనా విభాగం,<br>రాజేంద్రనగర్, హైదరాబాద్, 9440404050 |



# రైతన్నకో ప్రశ్న...

డా॥ సిహెచ్. వేణుగోపాల రెడ్డి, డా॥ కె. వాణిశ్రీ, యం. పల్లవి మరియు డా॥ యం. విజయలక్ష్మి
వ్యవసాయ సమాచార ప్రసార మరియు ముద్రణాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

**1. వరి నాటిన పొలాల్లో పిలక దశలో అంకురం ఉల్లికాడవలే లేత ఆకుపచ్చని పొడుగాటి గొట్టంగా మారటం దేని వలన జరుగుతుంది?**

ఎ. వరి ఈగ  బి. అగ్గితెగులు

సి. ఉల్లికోడు  డి. కాండం తొలుచు పురుగు

**2. వరిలో జింకు ధాతు లోపాన్ని ఎలా గుర్తించాలి?**

ఎ. ఆకులు చిన్నవిగా, పెళుసుగా మారతాయి.

బి. మొక్కలలో పై నుండి 3 లేదా 4 ఆకుల్లో మధ్య ఈనె పాలిపోతుంది

సి. ముదురాకు చివర్లలో మధ్య ఈనెకు ఇరు ప్రక్కల త్రుప్పు లేక ఇటుక రంగు మచ్చలు ఏర్పడతాయి

డి. పైవన్నీ

**3. ప్రస్తుతం ప్రత్తిలో కనిపిస్తున్న వేరుకుళ్ళు తెగులు లక్షణాలు గుర్తించటం ఎలా?**

ఎ. మొక్కలు గుంపులు గుంపులుగా చనిపోతాయి

బి. తెగులు సోకిన మొక్కలు తేలికగా పీకి వేయవచ్చు

సి. ఈ తెగులు వ్యాపిస్తే అర్ధాంతంగా మొక్క పూర్తిగా ఎండిపోతుంది

డి. పైవన్నీ

**4. సోయాచిక్కుడులో 25 రోజుల పంట దశలో వెడల్పాకు మరియు గడ్డిజాతి కలుపు మొక్కల నివారణకు ఉపయోగించే కలుపు మందు?**

ఎ. క్విజాలోఫాప్ ఇథైల్  బి. ఇమాజితాఫిర్

సి. ఇమాజితాఫిర్+ఇమాజోమాక్స్

డి. బి అండ్ సి

**5. ఫ్యుజేరియమ్ ఎండు తెగులు మరియు వెర్రి తెగులును పూర్తిగా తట్టుకునే కంది రకం**

ఎ. హనుమ (టిడిఆర్‌జి-4)  బి. ఉజ్వల (పిఆర్‌జి-176)

సి. మన్నెంకొండ కంది (ఐసిపిహెచ్ 2740)

డి. వరంగల్ కంది 53 (డబ్ల్యుఆర్‌జి 53)

**6. ఆముదంలో ఏ ధాతువు లోపం వలన లేత ఆకుల అంచుల నుండి ఈనెల వైపు పసుపురంగు లోకి మారి మొక్క పెరుగుదల తగ్గి ఆకులు చిన్నవిగా అవుతాయి**

ఎ. జింక్  బి. గంధకం  సి. ఐరన్  డి. కాల్షియం

**7. ఐసిఎఆర్-ఔషధ మరియు సుగంధ ద్రవ్యాల మొక్కల పరిశోధన సంచాలక కార్యాలయం ఎక్కడ ఉంది?**

ఎ. ఆనంద్  బి. లక్నో

సి. బెంగుళూరు  డి. పూనె

**8. ఎర్రకుళ్ళును తట్టుకునే చెఱకు రకాలు**

ఎ. కో 7706  బి. 87 ఎ 298

సి. 83 ఆర్ 23  డి. పైవన్నీ

**9. "క్రికెట్ బాల్" అనే రకం ఏ ఉద్యాన పంటకు సంబంధించింది?**

ఎ. మామిడి  బి. అరటి

సి. సపోట  డి. జామ

**10. జాతీయ అరటి పరిశోధన కేంద్రం (ఎన్ఆర్‌సిబి) ఎక్కడ ఉంది?**

ఎ. ట్రిచి  బి. చెన్నై

సి. మధురై  డి. కోయంబత్తూరు

పై ప్రశ్నలకు సమాధానాలు 50 వ పేజీలో చూడవచ్చు




## వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ నూతన భవనావిష్కరణ

వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్‌లో నూతనంగా నిర్మించిన పరిపాలన భవనం, ల్యాబ్‌లను రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు గౌ॥ శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మరియు రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు గౌ॥ శ్రీ గంగుల కమలాకర్ జూలై 11 న ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖామాత్యులు మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణకి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, రాష్ట్రంలో వ్యవసాయ విద్య, పరిశోధనలను మరింత పరిపుష్టం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, రాష్ట్రంలోనే అతి పురాతనమైన కరీంనగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో మొక్కజొన్నపై పరిశోధనలు మరింత ముమ్మరం చేసి నాణ్యమైన వంగడాలు రైతులకి అందుబాటులోకి తేవడానికి విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు కృషిచేస్తున్నారని తెలిపారు. అలాగే ప్రపంచ వ్యవసాయ రంగంలో వస్తున్న కొత్త పోకడల్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి రైతులకు ఆహార ఉత్పత్తులు, లాభదాయక పంటల సాగుపై తగిన సూచనలు, సలహాలు ఇవ్వటానికి ప్రభుత్వం శాస్త్రవేత్తలతో మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మరియు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్న విశ్వవిద్యాలయ ఉపకులపతి, శాస్త్రవేత్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు నారదాసు లక్ష్మణ రావు, శాసనసభ్యులు రసమయి బాలకిషన్, రవిశంకర్, కరీంనగర్ మేయర్ సునీల్‌రావు, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా॥ యస్. సుధీర్ కుమార్ మరియు పరిశోధన సంచాలకులు డా॥ ఆర్. జగదీశ్వర్ పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డులను పొందిన వర్సిటీ కృషి విజ్ఞాన కేంద్రాలు

వర్సిటీ పరిధిలోని వివిధ కృషి విజ్ఞాన కేంద్రాలు వార్షిక జోనల్ వర్క్‌షాప్ జోన్-X లో 17 పురస్కారాలు అందుకున్నాయి. కృషి విజ్ఞాన కేంద్రం, అదిలాబాద్‌కు అత్యధికంగా ఎనిమిది రంగాల్లో (ఉత్తమ వార్షిక నివేదిక, ఫాక్ట్ షీట్, రైతు సమాచార సమూహం, వార్తాలేఖ, ఫోటోలు, వీడియోలు, ప్రచురణలు మరియు టిఎస్‌పి ప్రాజెక్ట్) పురస్కారాలు లభించగా, కృషి విజ్ఞాన కేంద్రం, వైరాకు ఐదు విభాగాలలో (ఉత్తమ ఫాక్ట్ షీట్, నిక్రా, జలశక్తి అభియాన్, టిఎస్‌పి మరియు దాము ప్రాజెక్టులకు), కృషి విజ్ఞాన కేంద్రం, పాలెంకు నాలుగు విభాగాలలో (ఉత్తమ రైతు సమాచార సమూహం, పికెవివై, సిఎఫ్ఎల్‌డి, సీడ్ హబ్), కృషి విజ్ఞాన కేంద్రం, కంపాసాగర్‌కు ఆర్యా మరియు దాము ప్రాజెక్టులకు, కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాలకు సిఎఫ్ఎల్‌డి, కృషి విజ్ఞాన కేంద్రం, రుద్రూర్‌కు జలశక్తి అభియాన్ ప్రాజెక్టుకు, కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లికి టిఎస్‌పి సిఎఫ్ఎల్‌డి ప్రాజెక్టుకు మరియు కొత్తగా స్థాపించిన కృషి విజ్ఞాన కేంద్రం, కొత్తగూడెం మరియు మంచిర్యాలకు ప్రశంసా పురస్కారాలు లభించాయి. ఈ సందర్భంగా ఉపకులపతి డా॥ వి. ప్రవీణ్ రావు వర్సిటీ పరిధిలోని అన్ని కృషి విజ్ఞాన కేంద్రాలను అభినందించారు.

## ఘనంగా నిర్వహించిన తెలంగాణకు హరితహారం

తెలంగాణకు హరితహారంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని జూలై 1 మరియు జూలై 24 న ఘనంగా నిర్వహించారు. జూలై 24న వ్యవసాయ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్, గ్రీన్ క్లబ్ వాలంటీర్లు, ఐ.సి.ఏ.ఆర్ - ఎన్.ఎ.హెచ్.ఈ.పి ప్రాజెక్టు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ టి. పాపిరెడ్డి ముఖ్య అతిధిగా హాజరై ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ హరితహారంలో ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఉపకులపతి డా॥ వి. ప్రవీణ్ రావు, విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు మరియు భోదన, భోదనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ పాలిటెక్నిక్, సంగుపేట బాలికల నూతన వసతి గృహావిష్కరణ

వ్యవసాయ పాలిటెక్నిక్, సంగుపేట బాలికల నూతన వసతి గృహాన్ని రాష్ట్ర ఆర్థిక మంత్రివర్యులు గౌ॥ టి. హరీష్ రావు జూలై 4న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం మరియు వ్యవసాయానుబంధ రంగాలను లాభసాటిగా మార్చేందుకు వేలాది కోట్ల రూపాయలు పెట్టుబడిగా పెడుతున్నామని, రైతు సంక్షేమం కోసం రైతుబంధు, రైతు భీమాలతో పాటు ఉచిత విద్యుత్, గోడౌన్‌ల నిర్మాణం, పంటల్ని మద్ధతు ధరలకు కొనుగోలు చేయటం వంటి కార్యక్రమాలు చేపట్టామని మరియు వ్యవసాయం, ఉద్యాన పంటలతో పాటు మత్స్య పరిశ్రమలని, గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించడంతో గ్రామాల్లో రైతులకు చేతినిండా పని దొరుకుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు చంటి క్రాంతికిరణ్, లోక్‌సభ సభ్యులు బి.బి. పాటిల్, సంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీపాల్ రెడ్డి, కలెక్టర్ యం. హనుమంతరావు మరియు వర్సిటీ రిజిస్ట్రార్ డా॥ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

## స్టాటిస్టికల్ అండ్ అనాలైటికల్ స్కిల్స్‌పై వెబినార్

భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి సౌజన్యంతో షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా "స్టాటిస్టికల్ అండ్ అనాలైటికల్ స్కిల్స్ ఫర్ సోషల్ సైన్సెస్ అండ్ అగ్రిబిజినెస్" పై నైపుణ్య శిక్షణా కార్యక్రమం జూలై 3 నుండి 9 వరకు విస్తరణ విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వెబినార్ జరిగింది. ఈ వెబినార్‌లో నారమ్ శాస్త్రవేత్తలు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు మరియు వివిధ విభాగాల పరిశోధనా విద్యార్థులు పాల్గొన్నారు.

వి. సుధాకర్ మరియు మార్ఫ్ బాబు

# సేంద్రియ శ్రేష్ఠం - మన అంజిరెడ్డి

బి.ఆర్. మధుశేఖర్, డా॥ అనిల్ కుమార్ మరియు జి. నరేందర్
ఏరువాక కేంద్రం, నల్గొండ



ప్రస్తుత కాలంలో రసాయనిక ఎరువులతో పండించే ఉత్పత్తుల కంటే (వ్యవసాయ మరియు ఉద్యాన) వినియోగదారులు సేంద్రియ ఉత్పత్తుల వైపు ఆకర్షితులవ్వడమే కాకుండా విషతుల్యమైన ఆహారం తీసుకోనకుండా నాణ్యమైన మరియు విషరహితమైన (ఎరువులు మరియు పురుగుల మందులు వినియోగించకుండా) ఉత్పత్తులను తీసుకోవాలనే ఉద్దేశ్యం మరియు సంకల్పం గట్టిపడుచున్నది. దీని కనుగుణంగా తనకున్న 20 ఎకరాలలో సేంద్రియ వ్యవసాయం చేస్తూ దాదాపు 500 రకాల చెట్లను పెంచుతూ వివిధ రకాల పండ్లను, వరిని పండిస్తూ తన తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న చర్లపల్లి గ్రామం, నల్గొండ మండలం రైతు అంజిరెడ్డి విజయగాథ.

చర్లపల్లి రైతు అంజిరెడ్డి ముఖ్యంగా రసాయన మరియు విష రహిత ఆహారం పండించాలనే ఉద్దేశ్యంతో 2016 సం॥ నుంచి సేంద్రియ వ్యవసాయలతో పాటు సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులను పాటిస్తూ వ్యవసాయ మరియు ఉద్యాన పంటలతో పాటు కోళ్ళు, బాతులు, చీమ కోళ్ళు, గిరి మరియు దేశిజాతి ఆవులతో పాటు తనకున్న నీటికుంట (ఫామ్ పాండ్)లో చేపలను కూడా వేస్తూ సమగ్ర వ్యవసాయాన్ని చేపట్టడమైనది. ముఖ్యంగా సేంద్రియ వ్యవసాయంపై ఆకర్షితుడై డాట్ సెంటర్, నల్గొండని సంప్రదించినపుడు దానికి సంబందించిన సాంకేతిక సలహాలు మరియు నల్గొండ జిల్లా సేంద్రియ రైతుల వివరాలు తెలియజేయడమైనది. తనకున్న వ్యవసాయ పొలాన్ని విభజించుకొని కొంత కూరగాయలు, కొంత వరి మరియు ఉద్యాన పంటలు వేసుకోవడమైనది.

పొలం చుట్టూ వివిధ రకాల చెట్లైన అడవి ఉసిరి, శ్రీగంధం, ఎర్రచందనం, వేపచెట్లు, చింతచెట్లు, కొబ్బరి చెట్లు, సరుగుడు చెట్లు, గంధం, టేకు వేసుకోవడం జరిగింది. పండ్ల చెట్లలో సీతాఫలం, రామాఫలం, అరటి చెట్లు, నిమ్మ, మామిడి, పనస, రేగు, నేరుడు చెట్లు ఎక్కువ మోతాదులో మునగ, బత్తాయి, జామ, అంజీర్, ద్రాక్ష మరియు ఇతర పండ్ల చెట్లను వేయడమైనది.

వరిని పండించే ముందు జీలుగ, జనుము, పెసర మరియు ఇతర పచ్చిరొట్ట పంటలతో పాటు సీతాఫలం ఆకులు, గానుగ ఆకులు వేస్తూ మరియు వాటిని కలియదున్నిన తరువాత దేశీ వరి రకాలైన నవారా (రైడ్ రైస్), సిద్ధి, చిట్టి ముత్యాలు ఇంకా కొద్ది మొత్తంలో ఆర్.ఎన్.ఆర్. 15048 వేసుకోవడమైనది. ఎటువంటి రసాయనిక ఎరువులు కాని, పురుగు మందులు కానీ వేయకుండా తనకున్న పంట అవశేషాలను ఎరువుల రూపకంగా వేస్తూ పొలం చుట్టూ ఒక ట్రెంచ్ గుంటను తవ్వకొని పంట అవశేషాలను దానిలో వేస్తూ అవి కుళ్ళిన తర్వాత భూమిలో వేసి కలియదున్నేవారు. మరియు జీవామృతం, వేస్ట్ డీకంపోసర్, పంచగవ్య లను తయారు చేసుకొని ఎప్పుటికప్పుడు భూమికి అందించేవారు. పంటలపై పురుగులు ఆకర్షించకుండా వికర్షకంగా వేప ఆకుల కషాయం, వేపనూనె, ఆముదం, సీతాఫల ఆకుల కషాయం ఎప్పుటికప్పుడు పిచికారి చేసేవారు. ఒకవేళ పురుగులు, తెగుళ్ళు సంక్రమిస్తే పై కషాయాలతో పాటు ఉల్లి, వెల్లుల్లి కలిపిన మిశ్రమాన్ని పిచికారి చేసేవారు. పొలంలో మొదటసారి కలుపుని కూలీల ద్వారా తీయించి మరల కలుపు రాకుండా పొలంగట్లపై తక్కువ కాల పరిమితి గల పంటలు లేదా కూరగాయలు వేసేవారు. వివిధరకాల కూరగాయలు అయిన బెండకాయ(దేశీ), బీరకాయ, ఆకు కూరలు, దోసకాయ, దొండకాయ, మునగ మరియు ఇతర పంటలను కొద్ది మొత్తంలో పండిస్తూ ఎల్లప్పుడూ ఏదో ఒక కూరగాయ వచ్చే విధంగా ప్రణాళిక వేసుకోవడమైనది. చిరుధాన్యాలైన కొర్రలు, సామలు, ఊదలు, జొన్నలు కూడా పండిస్తున్నారు.

ఇవే కాకుండా తేనె టీగల పెంపకాన్ని కూడా ఆసక్తితో చేస్తూ తన పంట క్షేత్రంలో 6 తేనె టీగల పెట్టెలను పెట్టుకోవడమైనది. తన తోటి రైతులకు సేంద్రియ వ్యవసాయంపై ఎప్పుటికప్పుడు అవగాహన కల్పిస్తూ తనయొక్క క్షేత్రంలో వ్యవసాయ మరియు అనుబంధ రంగాలకు సంభందించిన రైతులకు శిక్షణా కార్యక్రమాలు వ్యవసాయశాఖ మరియు ఏరువాక కేంద్రం సహాకారంతో చేస్తూ రైతులలో సేంద్రియ వ్యవసాయంపై ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేస్తున్నారు.

తను పండించిన ఉత్పత్తులను నల్గొండ పట్టణంలోని వినియోగదారులు మరియు చుట్టు ప్రక్కల గ్రామాల వారు అధిక ధరలు వెచ్చిస్తూ తీసుకొని వెళ్తుంటారు. ఉత్పత్తులకు 2017 మరియు 2019 లో రెండుసార్లు సేంద్రియ సర్టిఫికేషన్ చేసుకోవడమైనది. ఇదే కాకుండా 10 ఫీట్ల వృత్తాకారంలో 20-30 రకాల విత్తనాలు విత్తుతూ జీవవైవిధ్యాన్ని కూడా ప్రోత్సహించడమైనది. తనకున్న ప్రధానమైన అభిరుచి - ఒక సంచి భుజానికి వేసుకొని వివిధ రకాలైన దేశీ మరియు అడవి రకాలను సేకరిస్తూ తన పంట పొలంలో వేసుకోవడం. ఈ విధంగా ఎన్నో రకాల పంటలను పండిస్తూ తన తోటి రైతులకు సేంద్రియ వ్యవసాయంలో సహాకారిగా ఉంటూ ఈ రైతు ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.



**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9866103797**

## 41వ పేజీలోని వ్యవసాయ పదవినోదం సమాధానాలు

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | 2 ఫి | | | | | | | 5 లిం | | |
| | | ప్రో | | | | | | 2 అ | గా | క | ర |
| 1 కాం | డా | ని | కి | 3 మం | దు | 4 పూ | త | | క | | |
| డం | | ల్ | | జీ | | త | | 3 క | ర్ష | కు | డు |
| తొ | | | | ర | | పు | | | క | | |
| లు | | | | | | రు | | | బు | | |
| 4 చు | క్క | కూ | ర | | 5 జి | గు | రు | అ | ట్ట | లు | |
| పు | | | | | | | | | లు | | |
| రు | | | | | | | | | | | |
| గు | | 6 బ్యా | క్టీ | 6 రి | యా | ఎం | డా | కు | తె | 7 గు | లు |
| | | | | మా | | | | | | లా | |
| | | | | న్ | | | | | | బి | |

**47వ పేజీలోని ప్రశ్నలకు సమాధానాలు : 1. సి 2. డి 3. డి 4. డి 5. సి 6. ఎ 7. ఎ 8. డి 9. సి 10. ఎ**

# పలు పంటల్లో తెగుళ్ళ నివారణకు ట్రైకోడెర్మా విరిడె వినియోగం

డి. అశ్విని, డా।। ఎస్. మాలతి మరియు డా।। పి. జగన్మోహన్ రావు
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్




1. కిలో విత్తనానికి 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడెతో విత్తనశుద్ధి చేయాలి

2. లీటరు నీటికి 10 గ్రా. చొప్పున ట్రైకోడెర్మా విరిడెని కలిపిన ద్రావణంలో పసుపు కొమ్ములను 30 నిమిషాలు నానబెట్టాలి

3. 90 కిలోల పశువుల ఎరువుకి 10 కిలోల వేప పిండి, 2 కిలోల ట్రైకోడెర్మా విరిడెని కలిపి వృద్ధి చేసి దుక్కిలో వేయాలి

RNI No : TELTEL/2015/60296

Total No. of Pages : 52

August, 2020

Postal Regd.No:HSE/1013/2018-2020

Date of Publication : 06.08.2020

Date of Posting : 09.08.2020



**జగిత్యాల తిల్ -1 : అధిక నూనె శాతం కలిగి బూడిద మరియు ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగుళ్ళను తట్టుకునే తెల్ల గింజ రకం**

*Striving for a greener tomorrow...*

ముద్రణ మరియు ప్రచురణ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం

Printed and Published by Dr. Ch. Venu Gopala Reddy on behalf of Professor Jayashankar Telangana State Agricultural University,

Owned by Professor Jayashankar Telangana State Agricultural University,

Printed At : PJTSAU Press, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana State

Published From : Professor Jayashankar Telangana State Agricultural University, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana State

Editor : Dr. Ch. Venu Gopala Reddy, RNI File No. 1262077, Title-Code : TELTEL00152